ఆదివారం
9-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 167
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

పోసాని కృష్ణమురళికి తప్పని కష్టాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సినీనటుడు పోసాని కృష్ణమురళికి ఈనెల 20 వరకు రిమాండ్ విధిస్తూ విజయవాడ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పీటీ వారెంట్‌పై శనివారం కర్నూలు జిల్లా జైలు నుంచి ఆయనను తీసుకొచ్చి విజయవాడలోని భవానీపురం పోలీసుస్టేషన్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం విజయవాడ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఈనెల 20 వరకు రిమాండ్ విధించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు, వారి కుటుంబసభ్యులు,

- మిగతా 2 లో

కలిసి పనిచేయండి
సిద్ధు, డీకేకు ఖర్గే సూచన

బెంగళూరు: కర్నాటకలో నాయకత్వ మార్పు జరగనుందంటూ కొంత కాలంగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం స్పందించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు సూచించారు. 16వ బడ్జెట్ ప్రవేశపెట్టిన సిద్ధరామయ్యపై ఖర్గే ప్రశంసలు కురిపించారు. 'ఇది మంచి బడ్జెట్. మంచి పనులు చేసే

- మిగతా 2 లో

గవర్నర్ రేసులో కమలాహారిస్?

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన కమలా హారిస్ తాజాగా కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన అనేక కార్యక్రమాల్లో కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీకి సిద్ధమైనట్లు సూచనప్రాయంగా ఆమె తెలిపారు. మరికొన్ని రోజుల్లో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం గావిన్ న్యూసమ్ కాలిఫోర్నియా గవర్నర్‌గా వ్యవహరిస్తున్నారు. 2028 అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని ఆమె యోచిస్తున్నట్లు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు

- మహిళలను కోటీశ్వరులను చేస్తాం
- వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు సహకారం
- మహిళా శక్తి బస్సుల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్ర రాజధానిలో ఆడబిడ్డలు తమ ఆత్మగౌరాన్ని చాటుతున్నారని, చంద్ర గ్రహణం తొలగి మా ఆడబిడ్డలు ఇవాళ వెలుగులు చూస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరా మహిళా శక్తి బస్సులను శనివారం ఆయన ప్రారంభించారు. మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో మహిళా సంఘాల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. సీఎం మాట్లాడుతూ... మా ఆడబిడ్డలు రాణీరుద్రమలు, చాకలి ఐలమ్మల స్ఫూర్తితో మహిళా శక్తిని చాటారన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా పురోగమిస్తుందని పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసినప్పుడే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వన్ ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని వాటి నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించామన్నారు. కోటి 30 లక్షల జతల స్కూల్ యూనిఫామ్ కుట్టుపని ఆడబిడ్డలకు అప్పగించామని, మహిళా సంఘాల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో రూ. 25 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మిస్తున్నామన్నారు. వ్యాపారవేత్తలుగా మార్చేందుకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను అప్పగించడం జరిగిందన్నారు. ఆర్టీసీ బస్సులకు యజమానులను చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులకు యజమానులు కాబోతున్నారని వివరించారు. రాజకీయాల్లో మహిళలు రాణించాలి, సమాజానికి సేవచేయాలన్నారు. ఆడబిడ్డల అభివృద్ధే లక్ష్యమన్నారు. ప్రతీ మండలంలో మహిళలకు రైస్ మిల్లులు, గోడౌన్స్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని, టన్నెల్ కూలితే, పంటలు ఎండితే బీఆర్ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జీహెచ్ ఎండి మేయర్, డిప్యూటీమేయర్ పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు చెక్కులు

2,82,552 మహిళా స్వయం సహాయక

- మిగతా 2 లో

మతోన్మాదుల నుండి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- కార్పొరేట్లకు దాసోహమై పేదల హక్కులు కాలరాస్తున్నారు
- బీకేఎంయూ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో డి.రాజా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా అనుభవించకుండా కాలరాస్తున్న మతోన్మాదుల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పోరాటాలే శరణ్యమని సీపీఐ ప్రధానకార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. ఈనెల 10వ తేదీ వరకు మూడు రోజులపాటు దిల్లీలో జరిగే భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్(బీకేఎంయూ) జాతీయ సమితి సమావేశాలను రాజా శనివారం ప్రారంభించారు. బీకేఎంయూ జాతీయ అధ్యక్షుడు యన్.పెరియాస్వామి అధ్యక్షత వహించారు. డి.రాజా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విధానాలతో దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలకు విపత్తు సంభవిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ విధానాలు అమలు చేస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. దేశంలో

- మిగతా 2 లో

కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి

అఖిలపక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా ఒక్క తాటిపైకి రావాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అప్పుడు రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ప్రజాభవన్ లో శనివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు సంబంధించి అనుమతులు, నిధులు దశాబ్దకాలంగా అపరిష్కృతంగా ఉన్న విషయాన్ని ... సీఎం రేవంత్ రెడ్డితో పాటు తాను, మంత్రులు, ఉన్నతాధికారులు పలు వేదికల్లో ప్రధాని మోదీ, కేంద్ర క్యాబినెట్ మంత్రులందరి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. రాష్ట్ర విభజన హామీలు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రీజినల్ రింగ్ రోడ్డు, వరంగల్ టెక్స్టైల్స్ పార్క్, నవోదయ స్కూల్స్ వంటి అనేక అంశాలకు సంబంధించి పలుమార్లు విన్నవించినా ఫలితం రాలేదని పేర్కొన్నారు. కేంద్ర నుంచి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున బకాయిలు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ఎంపీలంతా కలిస్తేనే వీటిని సాధించేందుకు అవకాశం ఉంటుందనే సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పార్టీలకు అతీతంగా అపరిష్కృత అంశాలపై పూర్తి సమాచారం రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక శాఖ ద్వారా అందజేస్తుందని తెలిపారు. రాబోయే పార్లమెంటు సమావేశాలు ప్రారంభానికి ముందు లేదా సమావేశాల మధ్యలో దిల్లీలో అఖిలపక్ష పార్టీల ఎంపీల సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ సమస్యలకు సంబంధించిన పూర్తి సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తామని అన్నారు.

సామాన్యులకు అందుబాటులో ఇసుక

రాష్ట్రంలో అన్ని వ్యవసాయ మార్కెట్లలోనూ సామాన్యులకు ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- మిగతా 2 లో

తాగు, సాగునీటిపై పూర్తిస్థాయి దృష్టి

- నిరంతర విద్యుత్‌పై అప్రమత్తం
- క్షేత్రస్థాయి పర్యవేక్షణ అవశ్యం
- సమన్వయంతో పనిచేయండి
- వేసవి వెతలపై అధికారులతో తుమ్మల సమీక్ష

నల్లగొండ బ్యూరో-విశాలాంధ్ర: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తాగు, సాగునీరు, విద్యుత్‌కు ఇబ్బందులు రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, ఇంచార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో శనివారం అధికారులతో ఆయన సమీక్షించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా, పంటలు ఎండిపోకుండా, విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగే విధంగా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఎక్కడా ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు తాగునీటిపై పూర్తిస్థాయి దృష్టి సారించాలన్నారు. తాగునీటి అవసరాలకు

- మిగతా 2 లో

నేడు 'ఛాంపియన్స్' సమరం

భారత్, కివీస్ ఫైనల్ పోరు

పాతికేళ్ల ప్రతీకారం టీమిండియా తీర్చుకుంటుందా?

న్యూదిల్లీ : ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ పోరు ఆదివారం భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనుంది. మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ టైటిల్ పోరులో విజేతకు ట్రోఫీ మాత్రమే కాకుండా కోట్ల రూపాయల బహుమతి కూడా అందించనున్నారు. ఈసారి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రైజ్ మనీని 53 శాతం పెంచారు. ఈ రెండు జట్లు ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో తలపడటం ఇది రెండోసారి. టోర్నీలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించి భారత్ ఫైనల్ చేరుకుంది. మరోవైపు 50 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి న్యూజిలాండ్ ఫైనల్ పోరుకు సిద్ధమైంది. ఇంతకు ముందు గ్రూప్ దశలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 44 పరుగుల తేడాతో టీమ్‌ఇండియా విజయం సాధించింది. అయితే పాతికేళ్ల పరాజయానికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందా అని క్రికెట్ అభిమానులు వేచి చూస్తున్నారు. గతంలో అక్టోబరు 15, 2000న కెన్యా రాజధాని నైరోబిలోని జింఖానా క్లబ్ గ్రౌండ్‌లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో కివీస్ జట్టు భారత్‌ను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి ట్రోఫీని ఎగరేసుకుపోయింది. కెప్టెన్ సౌరవ్ గంగూలీ అద్భుతమైన సెంచరీ చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ ఆరు వికెట్లకు 264 పరుగులు చేసింది. అయితే అల్ రౌండర్ క్రిస్ కైర్న్స్ విజృంభించి 113 బంతుల్లో 8 ఫోర్లు,

- మిగతా 2 లో

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి

కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు మంత్రులు, ఎంపీల వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో కొత్త రైల్వే లైన్లు మంజూరు చేస్తూ వాటిని పూర్తిగా రైల్వే నిధులతో నిర్మించాలని, కాజీపేటలో రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని, అక్కడి రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను వేగవంతం చేయాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు విన్నవించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధ్వర్యంలో మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్టులో కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్ర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర మంత్రిని కలిసినట్లు చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమైంది కాజీపేట రైల్వే డివిజన్ అని, తెలంగాణలో రెండో అతిపెద్ద

- మిగతా 2 లో

వైఫల్యాన్ని అంగీకరిద్దాం

బీజేపీ పక్షపాతులను తొలగిద్దాం
అంతర్గత ప్రక్షాళనతోనే ఫలితాలు - పార్టీకి పూర్వ వైభవం
గుజరాత్ కాంగ్రెస్ నేతలకు రాహుల్ పిలుపు

అహ్మదాబాద్: గుజరాతీల మనస్సు గెలుచుకోవడంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాన్ని అంగీకరిస్తున్నట్లు మాజీ అధ్యక్షుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్త సంకల్పించాలన్నారు. ఇందుకోసం పార్టీ రాష్ట్ర నాయకత్వంలో ప్రక్షాళన అవసరమని సూచించారు. బీజేపీతో

- మిగతా 2 లో

పునర్విభజనలో రాష్ట్రాలకు
సమన్యాయం



- దక్షిణాదిని దేశంలో భాగంగా గుర్తించాలి
- జనాభా ప్రాతిపదికన జరిగితే అన్యాయమే
- తిరుగుబాట్లకు ఆస్కారం అధికం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర- హైదరాబాద్: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో అన్ని రాష్ట్రాలకు సమ న్యాయం జరిగే విధంగా సీట్ల సంఖ్య ఉండాలని, ఇందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. అమెరికా సెనెట్ తరహా 'రాష్ట్రాల సభ'గా పిలవబడే రాజ్యసభకు లోక్‌సభతో సమాన అధికారాలు కల్పించాలని సూచించారు. 2026లో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన ఖాయమంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు వెల్లువరిస్తున్న నేపథ్యంలో జనాభా ప్రతిపాదికన పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూమ్‌భవన్‌లో శనివారం పార్టీ రాష్ట్ర సమితి అధ్వర్యంలో 'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన-దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో

- మిగతా 2 లో

వెంటనే శాంతి చర్చలు జరపాలి

ఉక్రెయిన్, రష్యాకు ట్రంప్ స్పష్టీకరణ
మాస్కోపై కొత్త ఆంక్షలతో సిద్ధం

2లో

గోవా సత్యాగ్రహంలో సీపీఐ

గోవా విమోచనలో సత్యాగ్రహోద్యమం, సీపీఐ పాత్ర భారత చరిత్రలో చెరిపేయలేని అధ్యాయం. ఇందులో కమ్యూనిస్టులు వీరోచితమైన పాత్ర పోషించారు. 1955 నుంచి కమ్యూనిస్టు పార్టీ విడతలు విడతలుగా గోవా సరిహద్దుల్లోకి సత్యాగ్రహులను పంపించింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

వెంటనే శాంతి చర్చలు జరపాలి

ఉక్రెయిన్, రష్యాకు ట్రంప్ స్పష్టీకరణ

మాస్కోపై కొత్త ఆంక్షలతో సిద్ధం

వాషింగ్టన్: తక్షణమే శాంతి చర్చలు జరిపి ఒప్పందం కుదుర్చుకోవాలని రష్యా, ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. కాల్పుల విరమణ-శాంతి కోసం ఒప్పందం జరిగేంత వరకు రష్యాపై కొత్తగా ఆంక్షలు, సుంకాలు అమల్లోకి తెచ్చే దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కీవ్‌కు సహాయాన్ని ట్రంప్ నిలిపివేశారు. ఇప్పుడు రష్యాకు హెచ్చరికలు చేశారు. కొత్త ఆంక్షలు, సుంకాలు అమల్లోకి తెస్తామన్నారు. వెంటనే చర్చలు జరిపి ఏకాభిప్రాయానికి రావాలని సూచించారు. ఉక్రెయిన్ విద్యుత్ క్షేత్రాలపై డ్రోన్, క్షిపణి దాడులను రష్యా జరపడంతో ట్రూత్ మాధ్యమంగా ట్రంప్ ఈ మేరకు హెచ్చరించారు. 'యుద్ధ క్షేత్రంలో ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడుతోంది. ఈ పరిస్థితుల దృష్ట్యా రష్యాపై పెద్దఎత్తున ఆంక్షలు విధించాలని, సుంకాలు అమలు చేయాలని భావిస్తున్నా. కాల్పుల విరమణ, శాంతి దిశగా తుది ఒప్పందం జరిగేంత వరకు సుంకాలు, ఆంక్షలు కొనసాగించే ఉద్దేశం ఉంది' అని ట్రంప్ పేర్కొన్నారు. పరిస్థితి చేయి దాటకముందే చర్చలు జరపండి అంటూ రష్యా, ఉక్రెయిన్‌కు సూచించారు.

రాజీకి సిద్ధమే: జెలెన్‌స్కీ

శాంతికి తాము సిద్ధమంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. 'శాంతి మార్గంలో నడిచేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉంది. ఈ యుద్ధం మొదలైన మొదటి క్షణం నుంచే ఉక్రెయిన్ శాంతిని కోరుకున్నది. యుద్ధం ఆపేలా రష్యాను నిలువరించడమే పెద్ద సవాల్' అని ఆయనన్నారు. జెలెన్‌స్కీ రాజీ కోసం చేసిన ప్రతిపాదనకు ఉక్రెయిన్ మిత్రపక్షాలు మద్దతు ప్రకటించాయి. ఉక్రెయిన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు చేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ ధ్రువీకరించింది. అదే సమయంలో ఉక్రెయిన్ సైన్యానికి మద్దతు ప్రకటించింది. ఉక్రెయిన్ సైనిక-పారిశ్రామిక ఆధారిత కేంద్రాలే రష్యా లక్ష్యమని ఆ దేశ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ వెల్లడించారు.

అమెరికా-ఉక్రెయిన్ ప్రతినిధుల భేటీ

బ్రిటన్, టర్కీతో సహా నాటో భాగస్వామ్య దేశాల ప్రతినిధులు భేటీ అయినట్లు యూరోపియన్ యూనియన్ పేర్కొంది. అంతర్జాతీయ భద్రత కోసం భావసారూప్యతగల నాటో భాగస్వాముల మధ్య సమన్వయం అవసరమని తెలిపింది. ఉక్రెయిన్ రక్షణ కోసం ఉమ్మడిగా ముందుకెళ్లాలని, చర్యలను ముమ్మరం చేయాలని ఈయూ సభ్యదేశాల ప్రాతినిధ్య సంఘం అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాగా, కాల్పుల విరమణ దిశగా మాస్కోతో కీవ్ చర్చలు గాడిలో పడ్డాయని వాషింగ్టన్ ప్రకటించింది. ఇదిలావుంటే, జెలెన్‌స్కీ సోమవారం సౌదీలో పర్యటించనున్నారు. యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీ కానున్నారు. ఆ తర్వాత రోజు అమెరికా, ఉక్రెయిన్ అధికారులు భేటీ కానున్నారు. తాజా పరిణామాలపై విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని తెలిసింది.

ట్రంప్ ప్రభుత్వంపై శాస్త్రవేత్తల కన్నెర్ర

- అమెరికావ్యాప్తంగా భారీ ర్యాలీలు
- పరిశోధనా రంగానికి నిధుల్లో కోతలకు ఖండన

వాషింగ్టన్: ట్రంప్ ప్రభుత్వంపై శాస్త్రవేత్తలు కన్నెర్ర చేశారు. శ్వేతసౌధంలో అడుగు పెట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించారు. ప్రాణాలు కాపాడే పరిశోధనలకు, ఆరోగ్యం, వాతావరణ సంస్థలకు నిధుల్లో కోతలు విధించడానికి నిరసనగా అమెరికా వ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో పెద్దఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనల్లో పరిశోధకులు, వైద్యులు, విద్యార్థులు, ఇంజినీర్లు, ప్రజాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారంతా వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఫెడరల్ రీసెర్చ్ ఫండింగ్‌లో కోతలు విధించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి నిష్క్రమించారు. ఆరోగ్యం, వాతావరణ సంబంధిత పరిశోధనల్లో పనిచేసే వందల మంది ఫెడరల్ వర్కర్లపై వేటు వేశారు. దీంతో న్యూయార్క్, వాషింగ్టన్, బాస్టన్, చికాగో, మాడిసన్ విస్కాన్సిన్ వంటి ప్రధాన నగరాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. సైన్స్‌పై దాడిని ప్రదర్శనకారులు ఖండించారు. రాజధానిలో చేపట్టిన ర్యాలీలో వెయ్యి మందికిపైగా పాల్గొన్నారు. 'సైన్స్‌కు నిధులు ఇవ్వండి... బిలియనీర్లకు కాదు', 'సైన్స్ ఆధారంగానే అమెరికా నిర్మాణం జరిగింది' వంటి పోస్టర్లు ప్రదర్శించారు.

భవిష్యత్ పరిశోధనలపై ఆందోళన వ్యక్తం చేశారు. నిధుల్లో కోతల కారణంగా ఇప్పటికే కొన్ని విశ్వవిద్యాలయాలు డాక్టోరల్/రీసెర్చ్ ప్రోగ్రామ్స్‌లో విద్యార్థులను తగ్గించినట్లు వెల్లడించారు. ఈ పరిస్థితుల్లో తమ భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. తమ జీవితాలతో చెలగాటం ఆడవద్దని, సముచిత నిధులను సంబంధిత సంస్థలన్నింటికి ఇవ్వాలని ట్రంప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తాగు, సాగునీటిపై పూర్తిస్థాయి దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ల వద్ద నిధులు ఏర్పాటుకు ముఖ్యమంత్రి తో మాట్లాడి వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యేలకు ఎస్‌డీఎఫ్ కింద నిధులు ఇచ్చేలా చర్చిస్తామన్నారు. ఎకరం పొలం కూడా ఎండిపోకుండా ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందించి పంటలు కాపాడాలన్నారు. ఇంజినీరింగ్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో నీటి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఆ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ... తాగునీటి అవసరాలకు ప్రతి జిల్లాకు కనీసం రూ. ఐదు కోట్లు, నల్లగొండకు రూ. 15 కోట్ల నిధులు ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఏఎంఆర్ ప్రాజెక్టు కింద కెనాల్ విస్తరణ, లైనింగ్ చేపడితే సమృద్ధిగా నీరు అందుతుందన్నారు. ఉదయసముద్రం మేజర్ కెనాల్ పూర్తి చేసి చెరువులకు నీరు అందిస్తే తాగు, సాగునీటి సమస్య రాదని అన్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ... మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు వేసవిలో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని కోరారు. కలెక్టర్లు తాగునీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రతి గ్రామానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు తక్షణ సాయంగా అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీటి సమస్యలు ఉత్పన్నమైతే ఆ నిధుల ద్వారా పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యేలు సైతం తమ ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి తాగునీటికి ఖర్చు చేయాలని కోరారు.

తొలుత నల్లగొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి తమ జిల్లాలో తాగునీరు, ఇరిగేషన్, విద్యుత్ పరిస్థితులను వివరించారు. జిల్లాలో 1,775 గ్రామాలు ఉన్నాయని, రోజూ 140 ఎంఎల్‌డిల తాగునీరు అవసరం ఉందని, విలీనగ్రామాలలో తప్ప ఎక్కడ సమస్య లేదన్నారు. బోర్లు, పైపులైన్ మరమ్మతులకు ఎస్‌డీఎఫ్ కింద రూ.10.30 కోట్లు కావాలని, 26 సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు వెల్లడించారు. విద్యుత్ సమస్యలు లేవన్నారు. సబ్ డివిజన్ వారీగా 250 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమని గుర్తించినట్టు చెప్పారు. తొమ్మిది క్విక్ రెస్పాన్స్ బృదం వాహనాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నాగార్జునసాగర్ ద్వారా రెండు పంటలకు సాగునీరు ఇస్తున్నామన్నారు. శ్రీశైలం నుంచి సాగునీరు విడుదల చేయాల్సి ఉందని మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ... తమ తమ జిల్లాలకు సంబంధించిన తాగునీరు ,ఇరిగేషన్, విద్యుత్ పరిస్థితులపై మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అన్ని గ్రామాలలో బోర్ నీళ్లు, తాగునీరు కలిసిపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, కొన్నిచోట్ల కొత్త బోర్లు అవసరం ఉన్నాయని తెలిపారు. పిల్లాయిపల్లి, బునియదిగానిపల్లి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. బస్వాపురం ఆర్‌అండ్ఆర్ కింద వశీకరణ చెల్లింపులు తక్షణం చేయాలని, కాలువల్లో గుర్రపుడెక్క తీయాలని, కాలువలపై మోటార్లను నియంత్రించాలని కోరారు. సుదర్శపురం వాటర్ ట్యాంక్ ను పూర్తిచేయాలని, మోత్కూరు జనాభాకు తాగునీటిని సరఫరా చేసేందుకు పైప్లైన్ దయా పెంచాలని, తండాలలో బోర్ల మరమ్మతులకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఆర్ఎస్పీ కింద బిక్కమల్ల వరకు నీరు రావడంలేదని, నూతనకల్ దాటి నీరు వెళ్లాల్సిన అవసరం ఉందని, కాలువలో పూడికతీయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త బోర్లుకు అనుమతి ఇవ్వాలని, అద్దె బోర్ల రేట్లు పెంచాలని, నిడమనూరు చెరువును నీటితో నింపితే నిడమనూరు, హాలియా మున్సిపాలిటీకి తాగునీరు అందుతుందని అన్నారు. క్రిటికల్ గ్యాస్‌ని పూర్తి చేయాలని, పెల్లిపాకల ప్రాజెక్టు కింద ఏజెన్సీకి జీతాలు చెల్లించాలని కోరారు. ఏఎంఆర్పీ ద్వారా తక్కువ మొత్తంలో కాలువలకు సాగునీరు వస్తున్నదని, మరో 10 రోజులపాటు నీరు వదలాలని, బ్రాహ్మణ వెల్లేముల ప్రాజెక్టు కింద జాతీయ రహదారి క్రాసింగ్ కు అనుమతి తీసుకోవాలని కోరారు. మిషన్ భగీరథ ఏజెన్సీకి బకాయిలను చెల్లించాలని, దామరచర్ల, అడవిదేవులపల్లి, మిర్యాలగూడలో తండాలు ఎక్కువగా ఉన్నాయని, గత ఏడాది అద్దె బోర్లకు చెల్లించిన మొత్తాన్ని విడుదల చేయాలని కోరారు. వజీర్ బాగ్ కాల్వ చివరి వరకు సాగునీరు ఇవ్వాలని, డి-40 కింద నీరు రావటం లేదని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.

వైఫల్యాన్ని అంగీకరిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

కుమ్మక్కైన వర్గాన్ని వేరు చేయాల్సిన అవసరాన్ని సూచించారు. కాంగ్రెస్‌లో ఉండి బీజేపీ కోసం పనిచేసే వారిని తొలగిస్తేనే మంచి ఫలితాలు సాధించగలమని రాహుల్ అన్నారు. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని అంగీకరించడంలో సిగ్గుపడబోనని చెప్పారు. పార్టీలో రెండు వర్గాలు ఉన్నాయని, వీటిని వేరు చేయాలని, ఇందుకోసం 30-40 మందిని తొలగించాలని అన్నారు. గుజరాత్ ప్రజలకు కావాల్సినది నిజమైన ప్రత్యామ్నాయం అని... బీజేపీకి బీ టీమ్ కాదని రాహుల్ వక్కాణించారు. కాంగ్రెస్ ఉండి బీజేపీ కోసం పనిచేసే వారంతా బయటకు వెళ్లి నచ్చినట్లు చేసుకోవచ్చు అని అన్నారు. కాంగ్రెస్‌కు నేతల కొరత లేదని రాహుల్ ఉద్ఘాటించారు. రాష్ట్రంలో 30ఏళ్లుగా అధికారానికి దూరమైనప్పటికీ పార్టీకి 40శాతం ఓట్లు లభిస్తున్నాయని, గెలవడానికి మరో ఐదు శాతం పెరగాలని అన్నారు. రాహుల్ శనివారం అహ్మదాబాద్‌లోని సింధు భవన్ రోడ్డులోగల జెడ్ బాంక్వెట్ హాల్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. జిల్లా-మండలి స్థాయి నుంచి గుజరాత్‌లోని పార్టీ నాయకత్వంలో విభజనలు ఉండటంపై మాట్లాడారు. పార్టీలో ఒక వర్గం నాయకులు.... ప్రజల పక్షాన నిలుస్తూ, కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడితే, మరో వర్గం మాత్రం ప్రజలంటే గౌరవం లేకుండా వారికి దూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ రెండు వర్గాలను వేరు చేస్తేనే ప్రజల విశ్వాసాన్ని పొందగలమని చెప్పారు. గుజరాత్ ప్రజలు, వ్యాపారవేత్తలు, చిరు, మధ్యస్థాయి వర్తకులు, రైతులు, కార్మికులు, విద్యార్థులు ప్రత్యామ్నాయమే కోరుకుంటున్నారు తప్ప బీజేపీకి బీ టీమ్‌ని కాదని రాహుల్ అన్నారు. మన పార్టీలో ఉండి ప్రత్యర్థి పార్టీ కోసం పనిచేసే వారిని ఏరిపారేద్దామని పిలుపునిచ్చారు. వారిని బీజేపీ కూడా ఎక్కువ కాలం ఉంచుకోదని, ప్రజల మధ్య తమకంటూ స్థానాన్ని వీరు ఎలా ఏర్పాటు చేసుకుంటారో చూద్దామని రాహుల్ అన్నారు. కాంగ్రెస్‌కు ఆదరణ, ఓట్లవాటా పెరగడంపై దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ఇందుకోసం మరింతగా ప్రజల్లోకి వెళ్లి, వారితో మమేకం కావాలని, వారి అవసరాలను, సమస్యలను తెలుసుకోవాలన్నారు. గుజరాత్‌కు కాంగ్రెస్ పార్టీ దశ-దిశ నిర్దేశించగలగాలని రాహుల్ పిలుపునిచ్చారు. 'గుజరాత్‌కు దిశ చూపడటంలో మనం అందరం విఫలమయ్యాం. గుజరాతీలతో పటిష్ఠ బంధాన్ని ఏర్పాటు చేసుకోలేకపోయాం. దీనిని అంగీకరించడంలో సిగ్గు పడటంలేదు' అని ఆయనన్నారు. గుజరాత్‌కు చెందిన మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్ కాంగ్రెస్ టాప్ 5 నేతల్లో ఉన్నారని, పార్టీకి రూపాన్ని, సిద్ధాంతాలను ఇచ్చారన్నారు. ఓడిన చోట ఎలా గెలవాలో వీరి నుంచి నేర్చుకోవాలని సూచించారు. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తేవాలని, ఇందుకోసం ప్రతి ఒక్క కార్యకర్త తన వంతు కృషి చేయాలని రాహుల్ పిలుపునిచ్చారు. పార్టీ ప్రక్షాళన చేయకుంటే ఇది సాధ్యం కాదని స్పష్టంచేశారు. కార్యకర్తలు తిరిగి ప్రజలకు చేరువై వారికి భరోసాగా ఇవ్వాలని, కార్యకర్తల్లోని సత్తాని వెలికితీసేందుకు ముందుంటానని రాహుల్ దిశానిర్దేశం చేశారు.

మహిళలు సమాజానికి వెన్నెముక...

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలందరికీ రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సమాజానికి వెన్నెముక వంటి వారన్నారు. స్త్రీశక్తి, స్వావలంబన, గళం ద్వారానే దేశ భవిష్యత్ రూపుదిద్దుకుంటుందని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రతి మహిళ తన భవిష్యత్‌ను నిర్మించుకోగలిగేలా, తన కలలను సాకారం చేసుకునేలా, గొప్ప శిఖరాలను అధిరోహించేలా జరిగేంత వరకు ఎదురొచ్చే అవరోధాలను తొలగించడంలో మీకు అండగా ఉంటా' అని మహిళలనుద్దేశించి రాహుల్ అన్నారు.

పోసాని కృష్ణమురళికి తప్పని కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

మీడియా సంస్థలపై దూషణలు, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన ఆరోపణలపై జనసేన నేత శంకర్ ఫిర్యాదు మేరకు విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్‌లో పోసానిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. తనపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారని న్యాయాధికారికి పోసాని విన్నవించారు. 'ఒకే విధమైన కేసులతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు తిప్పుతున్నారు. నేను అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నా. గుండె జబ్బు, పక్షవాతం లాంటి రుగ్మతలు ఉన్నాయి' అని న్యాయాధికారికి పోసాని తెలియజేశారు. నిందితుడు వాడిన తీవ్రమైన పదజాలం, కొందరిని రెచ్చగొట్టేలా చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఆయనకు అన్ని పరీక్షలు జరిపామని, ఆరోగ్యంగా ఉన్నారని తెలియజేశారు. దీంతో ఈనెల 20 వరకు రిమాండ్ విధించారు.

నేడు 'ఛాంపియన్స్' సమరం

(మొదటి పేజీ తరువాయి)

2 సిక్సర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచి కివీస్‌కి విజయాన్ని చేకూర్చాడు.

టీమిండియా కొత్త వ్యూహం

భారత్ గ్రూప్ దశలో కివీస్‌పై విభిన్నమైన బౌలింగ్ ప్లాన్‌తో బరిలోకి దిగి విజయం సాధించింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ముగ్గురు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లతో ప్రత్యర్థి మీద బౌలింగ్ అటాక్ చేసింది. న్యూజిలాండ్, సెమీస్ (ఆస్ట్రేలియాతో) మ్యాచ్‌ల్లో ఇద్దరు పేసర్లు, నలుగురు స్పిన్నర్లతో వ్యూహరచన మార్చింది. కివీస్‌తో మ్యాచ్‌కు ముందు వరకు క్రికెట్ విశ్లేషకులు ఈ నిర్ణయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే తమ ప్లానింగ్ పక్కా హిట్ అని నమ్మిన రోహిత్ అండ్ టీమ్... రెండు మ్యాచ్‌ల్లోనూ అదే ఆచరణలో పెట్టి అదరగొట్టింది. ఇప్పుడు ఫైనల్ మ్యాచ్‌లోనూ నలుగురు స్పిన్నర్ల వ్యూహమే అనుసరించనుంది. తుది పోరు కోసం న్యూజిలాండ్ కూడా నలుగురు స్పిన్నర్లను ఆడించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం జట్టులో ఫుల్ టైమ్ స్పిన్నర్లుగా శాంట్నర్, బ్రేస్‌వెల్ మాత్రమే ఉన్నారు. రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్ ఉన్నా వాళ్లు పార్ట్ టైమర్లు మాత్రమే. ఈ నేపథ్యంలో మార్క్ చాప్‌మన్‌ను తీసుకునే అవకాశం ఉంది. ఇదే జరిగితే భారత్‌కు కాస్త ఇబ్బందులు తప్పవు. ఎందుకంటే ఇటీవల కాలంలో మన బ్యాటర్లు స్పిన్ విషయంలో ఇబ్బంది పడుతున్నారు. అయితే పిచ్ బట్టి తుది నిర్ణయం ఉంటుంది. గాయం తర్వాత టీం లోకి వచ్చిన షమీ ఇప్పటికీ మైదానంలో అప్పుడప్పుడు కాస్త ఇబ్బందిగానే కదులుతున్నాడు. టోర్నీలో ఇప్పటివరకు 8 వికెట్లు తీసినా తన స్థాయి బౌలింగ్ ప్రదర్శన ఇంకా రాలేదు. హార్దిక్ పాండ్య ఒక్క మ్యాచ్‌లోనే తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. దానికితోడు వరుసగా చిన్నపాటి గాయాలపాలవుతున్నాడు. నలుగురు స్పిన్నర్ల కాంబినేషన్‌లో వెళ్లాల్సి వస్తే ఈ ఇద్దరూ పేస్ భారాన్ని మోయాలి. అంటే ఇద్దరూ తమ బెస్ట్ బయటకు తీసుకురావాలి. న్యూజిలాండ్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో స్పిన్నర్లు బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టారు. వరుణ్ చక్రవర్తి 5 వికెట్ల ఫీట్ కూడా సాధించాడు.

ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు

(మొదటి పేజీ తరువాయి)

సంఘాలకు రూ. 22 వేల 794 కోట్ల 22 లక్షల చెక్కును సీఎం రేవంత్ రెడ్డి అందజేశారు. మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు లోన్, ప్రమాద బీమా పథకాల ద్వారా 44 కోట్ల 80 లక్షలు పంపిణీ చేశారు. సోలార్ ప్లాంట్స్ కు వర్చువల్ గా సీఎం శంకుస్థాపన చేశారు. ఇందిరా మహిళాశక్తి మిషన్-2025 పాలసీని అవిష్కరించారు.

అంతర్జాతీయ వర్సిటీలతో పోటీపడాలి

అంతర్జాతీయ యూనివర్సిటీలతో పోటీ పడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో మహిళా వర్సిటీ విద్యార్థినులు రాణించి రాజీవ్ గాంధీ కలల్నినిజం చేయాలని పిలుపునిచ్చారు. కోఠిలో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. అనంతరం దర్బార్ హాల్ ను సందర్శించారు. తొలుత చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. రేవంత్ మాట్లాడుతూ మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకోవడం తెలంగాణకు గొప్ప కీర్తిగా పేర్కొన్నారు. ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే సందర్భం వస్తుందని పేర్కొన్నారు. మీ అన్నగా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించి వారికి పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగించామని వివరించారు. రెండున్నరేళ్లలో వర్సిటీలో నిర్మాణాలు పూర్తి కావాలని అధికారులకు ఆదేశించారు. చదువుల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జీహెచ్‌ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేషన్ చైర్మన్లు, పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో శనివారం రెవెన్యూ రిసోర్స్ మొబైల్ జేషన్ సబ్ కమిటీ సమావేశం డిప్యూటీ సీఎం అధ్యక్షతన జరిగింది. ప్రజా ప్రయోజనాలకు ఉద్దేశించిన ఇసుక, మైన్స్ శాఖలను అత్యంత ప్రాధాన్యత కలిగినవిగా వివరిస్తూ ఇసుకకు సంబంధించి ఐటీడీఏలతో ఒప్పందం చేసుకోవాలని మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు సూచించారు. ఆదాయం ఆర్జించే శాఖల్లో లూప్‌హోల్స్ అరికట్టాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధికారులు సాధించాలని భట్టి అన్నారు. హైదరాబాద్ నగరంలో కాలుష్య కారకమైన పరిశ్రమలను అవుటర్ రింగ్ రోడ్డు దాటించాలని గతంలోని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆ నిర్ణయాన్ని వేగవంతంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్యాబినెట్ సబ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను ఆయా శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు ప్రతినెల ప్రగతిని సమీక్షించాలని, ఆ ప్రగతి వివరాలను ప్రతి మూడు నెలలకు క్యాబినెట్ సబ్ కమిటీకి వివరించాలని ఆదేశించారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను విస్తృతంగా అన్వేషించాలని ఆదేశించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, రెవెన్యూ, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ఎంఏ రిజ్వి, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సురేంద్రమోహన్, రిజిస్ట్రేషన్ కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఇండస్ట్రీస్ కమిషనర్ విష్ణువర్ధన్, హౌసింగ్ ఎండి గౌతం, కమర్షియల్ టాక్స్ కమిషనర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

నగరం వరంగల్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని, ఇటీవల కేంద్రం విశాఖపట్నం కేంద్రంగా... సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు చేసిందని తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే కింద సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ జోన్లు మాత్రమే ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రిదృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ప్రయాణికులు, గూడ్స్‌కు సమర్థవంతమైన రైల్వే నెట్ వర్క్ ఆపరేషన్స్, మెయింటెనెన్స్ చేసేందుకు కాజీపేటలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని, అత్యధిక ప్రయాణీకుల రద్దీతోపాటు, సరుకు రవాణా చేస్తున్న కాజీపేట ను డివిజన్‌గా చేస్తే.. గుంటూరు , హైదరాబాద్ డివిజన్‌ల కంటే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తుందని కేంద్ర మంత్రికి ఇచ్చిన వినతిలో వివరించినట్లు పేర్కొన్నారు. వరంగల్ చుట్టూ నిర్మిస్తున్న రింగ్ రోడ్డుకు అనుసంధానంగా దానిచుట్టూ రింగ్ రైల్ నిర్మిస్తామని స్వయంగా కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలత తెలియజేయడంపై కోమటిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వికారాబాద్-కృష్ణ లైన్ దక్షిణ తెలంగాణలో వెనకబడిన పరిగి, కొడంగల్, టేకల్ కోడే, నారాయణ్‌పేట, మక్తల్ వంటి పట్టణాలను కలుపుతుందని, తాండూరు పట్టణం చుట్టూ ఉన్న సిమెంట్ పరిశ్రమలతో పాటు భవిష్యత్తులో రాబోయే పరిశ్రమలకు కూడా అత్యంత ఉపయోగకరంగా ఉంటుందని, ఆర్థికంగా ఇబ్బంది లేని ఈ రైల్వే లైన్ ను నిర్మిస్తే సరుకు రవాణా మార్గంగా ఉపయోగకరంగా ఉండబోతున్నందున దీన్ని ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ లో పరిగణంలోకి తీసుకొని నిర్మిస్తే రైల్వే శాఖకు... తెలంగాణ ప్రజలకు అనేక ప్రయోజనాలను కల్పిస్తున్నట్టు లేఖలో పేర్కొన్నట్టు చెప్పారు.

గవర్నర్ రేసులో కమలాహారిస్?

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ వర్గాలు తెలిపాయి. దశాబ్దాలుగా కాలిఫోర్నియా వాసులు డెమోక్రట్లకే మొగ్గుచూపుతున్నారు. దీంతో ఆమె ఈ ఎన్నికల్లో పోటీకి దిగితే... తప్పక విజయం సాధిస్తారని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశారు.

కలిసి పనిచేయండి

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తులకు పార్టీ ఎప్పుడూ మద్దతిస్తుంది. వారిని ప్రోత్సహిస్తుంది. పార్టీ, రాష్ట్రం కోసం శివకుమార్ ఎంతో శ్రమిస్తారు. ప్రజల కోసం అంకిత భావంతో పని చేయడాన్ని చూశాం. ఇద్దరు నేతలు కలిసికట్టుగా రాష్ట్రం కోసం పాటుపడాలి. ప్రజలను నిర్లక్ష్యం చేస్తే... వారు పార్టీపై నమ్మకం కోల్పోతారు' అని ఖర్గే పేర్కొన్నారు. 'ఈ ఇద్దరు నేతలు కలిసి ఉంటేనే రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంది. లేకపోతే పార్టీతో పాటు ప్రజలు కూడా ఇబ్బంది పడతారు. ఏదేమైనా కలిసే ముందుకు సాగాలి' అని సూచించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

పేదల హక్కులు ఎక్కడని ఆయన ప్రశ్నించారు. మతోన్మాద, ఫాసిస్టు దుర్మార్గపు ఆలోచనలను మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్నదన్నారు. రాజ్యాంగం ప్రకారం పౌరులందరూ ఒక్కటేనని, లింగ బేధం ఉండకూడదన్నారని గుర్తు చేశారు. విద్య, వైద్యం, ఉపాధి, నివాసగృహాలు తదితర కనీస అవసరాలు కూడా తీరని స్థితిలో పేదలు ఉన్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటిన తర్వాత కూడా ఇలాంటి పరిస్థితులు ఉండటం దురదృష్టకరమన్నారు. దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదల సంఖ్య మరింత పెరిగిపోతుండగా... దేశ సంపద కేవలం కొద్దిమంది పారిశ్రామికవేత్తల చేతుల్లో కేంద్రీకృత మవుతోందన్నారు. ఇతర దేశాల్లో పేదరికం అంతరి స్తుంటే... మన దేశంలో రోజురోజుకీ పెరుగుతుండడమే పేదల పట్ల పాలకుల వివక్షతకు నిదర్శనంగా ఉంద న్నారు. నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అంతులేకుండా పోతోందని, రూపాయి మారకపు విలువ దారుణంగా పడిపోతున్నదని, మరోవైపు అదానీ, అంబానీల ఆదాయం గణనీ యంగా పెరుగుతోందన్నారు. దేశంలో వారు అతిపెద్ద బిలియనీర్లుగా అభివృద్ధి చెందుతుండగా, వారి కనుసన్నల్లో మోదీ ప్రభుత్వం నడుస్తున్నదని విమర్శిం చారు. ఈ దేశంలో ఆర్ఎస్ఎస్ రిజిస్టర్డ్ సంఘమే కాదని, అయినా దేశ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహిస్తున్నదన్నారు. చత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలపై నక్సలైట్ల పేరుతో దమనకాండ కొనసాగుతోందని రాజా విమర్శి ంచారు. మణిపూర్‌లోనూ ఆదివాసీలపై దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇదంతా వారు నివసిస్తున్న ప్రాంతాల్లో అటవీ భూములు లాక్కొని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్ట డానికేనని ధ్వజమెత్తారు. పారిశ్రామికవేత్తలకు భారీ రాయితీలిస్తున్న మోదీ ప్రభుత్వం... ఉపాధి హామీకి మాత్రం నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగం ప్రమాదంలో పడినందున ఈనెల 23 భగత్ సింగ్ వర్ధంతి రోజున...'దేశాన్ని రక్షించండి-రాజ్యాంగాన్ని కాపాడండి' నినాదంతో దేశవ్యాప్తంగా సీపీఐ అధ్వర్యాన జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలని కోరారు. ఇందులో భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ శ్రేణులు కూడా పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేదల కోసం, వ్యవసాయ కూలీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలు చేయాలని నేతలకు సూచించారు. స్మశాన వాటికలు కావాలని, అంటరానితనానికి వ్యతిరేకంగా, దళితులు, గిరిజనులపై దాడులు ఆపాలని, ఆదివాసీలు, గిరిజన సమస్యలపైన, ఇళ్లు, ఇళ్ల స్థలాలు కావాలని, భూములు పంచాలని అనునిత్యం ఆందోళనలు చేయాలన్నారు. రాజస్థాన్‌లో ఇప్పటికీ దళిత యువతీ, యువకులు గుర్రాలపైన, బుల్లెట్ బండిపైన తిరుగుతూ పెళ్లిళ్లు చేసుకోకూడదని నిబంధనలు ఉన్నాయంటే... ఈ దేశంలో పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతోందన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితపర్చి పోరాటాలకు సిద్ధం కావాలని రాజా పిలుపునిచ్చారు. సమావేశంలో బీకేఎంయూ అగ్ర నాయకులు నాగేంద్రనాథ్ ఓఝూ, జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా, జాతీయ మాజీ అధ్యక్షులు ఇస్మాయిల్, జానకి పాశ్వాన్, దర్యావ్ సింగ్, ఫూల్‌చంద్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, లండా వెంకట్రావు, తెలంగాణ నుండి కలకండ కాంతయ్య, సృజన్ కుమార్, తాటి వెంకటేశ్వర్లు, బాబు తదితరులు పాల్గొన్నారు.

పునర్విభజనలో రాష్ట్రాలకు సమన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రొఫెసర్ జి.హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, ఐఏఎల్ జాతీయ అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ఆర్థిక నిపుణులు కె.పాపారావు, న్యాయవాది కె.ప్రభాకర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడారు. హరగోపాల్ మాట్లాడుతూ... నియోజవర్గాల పునర్విభజన భారత రాజ్యాంగంలో పొందుపర్చినప్పటికీ భారత సమాఖ్య స్ఫూర్తిని దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరముందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణతో జనాభా పెరుగుదలకు అడ్డుకట్ట పడిందన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో నియంత్రణ పాటించకపోవడంతో జనాభా పెరిగిందని చెప్పారు. జనాభా నియంత్రణ పాటించి దేశ అభివృద్ధికి తోడ్పాటును అందించిన దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా మారిందన్నారు. సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జనాభా ప్రతిపాదికన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశంతో భారత దేశం ఒక సంక్లిష్టమైన సమస్యను ఎదుర్కోబోతుందన్నారు. 2026లో నియోజకవర్గాల పునర్విభజన చేపడితే పార్లమెంట్‌లో దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గి ఉత్తరాదిలో నాలుగు రాష్ట్రాల ప్రాబల్యం పెరగనుందని చెప్పారు. పార్లమెంట్ ప్రస్తుతం 24.1 శాతం ఉన్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 19.1 శాతానికి తగ్గిపోనుండగా, అదే ఉత్తరాదిలోని 40 శాతం నుంచి 46 శాతానికి పెరగనుందని చెప్పారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... భాషా, ఆర్థిక, సాంస్కృతిక, సమానత్వం ఇలా అన్ని రంగాల్లో దక్షిణాది రాష్ట్రాలు వివక్షతకు గురవుతున్నాయన్న భావన ప్రాంత వాసుల్లో నెలకొందన్నారు. ఈ తరుణంలో లోకసభ నియోజకవర్గాల పునర్విభజను దేశ సమాఖ్యస్ఫూర్తికి విఘాతం కల్గకుండా చేపట్టాలన్నారు. ఉత్తరాది, దక్షిణాది ప్రజల మధ్య బేధాభిప్రాయాలు లేకపోయినా... బీజేపీ తన అధికారం అడ్డం పెట్టుకుని స్వార్థ రాజకీయాల కోసం దక్షిణాదికి ఎక్కడ అన్యాయం చేస్తుందోనన్నదే తమ భయమని పేర్కొన్నారు. జనాభా ప్రకారం పునర్విభజన జరిగితే దక్షిణాదికి తీరని అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. దక్షిణాదిని భారతదేశంలో భాగంగా పరిగణించాలని, లేకుంటే తిరుబాట్లు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజనపై జాతీయ స్థాయిలో చర్చించి సీపీఐ తన కార్యాచరణను ప్రకటిస్తుందని వెల్లడించారు. అజీజ్ పాషా మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజన... జనాభా ప్రాతిపదికన కాకుండా సామాజిక, ఆర్థిక రాష్ట్రాల స్థానిక పరిస్థితులు, ఆ ప్రాంతాల రాజకీయ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని చేయాల్సిన అవసముందని చెప్పారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం గల ఈ దేశంలో బిజెపిఅవలంభిస్తున్న మతపరమైన విధానాలతో ఇప్పటికే దేశ భవిష్యత్ ఎలా ఉండబోనుందనే ఆందోళన నెలకొందన్నారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి అనుగుణంగా అన్ని రాష్ట్రాల ప్రాతినిధ్యం లోకసభలో సమన్యాయంగా ఉండేలా చూడాలన్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన ప్రధానమంత్రి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్నిపార్టీల నాయకులతో కమిటీ ఏర్పాటు చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ దేశ సమాఖ్య వ్యవస్థకు ఏమాత్రం భంగం కలగకుండ పార్లమెంట్ నియోజవర్గాల పునర్విభజన ప్రక్రియ ఉండాలన్నారు. పల్లా వెంకట్ రెడ్డి, పి.జంగయ్య, డి.జి.సాయిల్ గౌడ్, విజయలక్ష్మి పండిత్, నెల్లికంటి సత్యం, అంజయ్య నాయక్ హాజరయ్యారు. సమావేశానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు స్వాగతం పలకగా, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ వందన సమర్పణ చేశారు.

మహిళల పోరాట ఫలితమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - కారేపల్లి : మహిళలు తమ హక్కుల కోసం ప్రపంచవ్యాప్తంగా జరిపిన పోరాట ఫలితంగా నేడు మహిళా దినోత్సవం జరుగుతున్నదని సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కే నరేంద్ర అన్నారు. శనివారం కారేపల్లిలోని భాగం రామ నరసయ్య భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఐద్వా-సిఐటియు ఆధ్వర్యంలో ఐద్వా మండల అధ్యక్షురాలు సురభాక ధనమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు నేత కే నరేంద్ర మాట్లాడుతూ 1910మార్చి 8న కోపెన్ హెగన్లో ప్రముఖ సంఘ నాయకురాలు క్లారా జట్కిన్ ఆధ్వర్యంలో మహా ఉద్యమం జరగగా పెట్టుబడిదారీ భూస్వామ్య శక్తులు అణిచివేయాలని చూసినప్పుడు దానిని అధిగమించి తమ హక్కులైనా సమానత్వం ఓటు హక్కు పని గంటల తగ్గింపు సమాన పనికి సమాన వేతనం స్త్రీ పురుషులకు ఒకే రకమైన కూలి మహిళలపై జరుగుతున్న అన్యాయాలు అరికట్టాలని అనేక పోరాటాలు ప్రపంచ వ్యాప్తంగా జరిగాయని ఆ ఉద్యమాలు చేసిన ఫలితంగా 1975లో ఐక్యరాజ్యసమితి మార్చి 8న అంతర్జాతీయ దినోత్సవం జరపాలని నిర్ణయించిందని అది మహిళల పోరాట విజయమని ఆయన అన్నారు. మహిళా దినోత్సవ స్ఫూర్తితో శ్రామిక మహిళలు ఐక్యమై తమ హక్కుల సాధనకు నడుం బిగించాలని మహిళా ఉద్యమాలతోనే సమాజం ముందుకు పోతుందని అప్పుడే మహిళా సాధికారత సాధ్యమని అందుకు మహిళలు చైతన్యవంతమై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్ ఐద్వా మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి నాయకులు సోమందుల నాగమణి, మేదరి మంగతాయి, వాంకుడోత్ కమల, కరపటి రాంబాయమ్మ, పచ్చల బుజ్జమ్మ,భవాని, మేదరి కుమారి, ఆదేర్ల దేవకరుణ, రజియా సుల్తానా పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో మహిళా సిబ్బందికి ప్రత్యేక స్థానం

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్: తెలంగాణ పోలీస్ శాఖలో మహిళా సిబ్బందికి ప్రత్యేక స్థానం ఉందని జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, అన్ని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందితో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, విధి నిర్వహణలో రాణించిన మహిళా పోలీస్ సిబ్బందికి అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, వారు ఏదైనా సాధించగలరని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని, దేశంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు వివిధ రంగాల్లో మెరుగ్గా రాణిస్తున్నారని పేర్కొన్నారు. పోలీసు స్టేషన్ లో రిసెప్షన్ విధులు, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్, రైటర్ వంటి బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, గృహ హింస మరియు వైవాహి వివాదాలలో బాధితులైన మహిళలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు అనేక రకాల విధులను మహిళా పోలీసు అధికారులు నిర్వహిస్తున్నారని అభినందించారు. జిల్లా మహిళా సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మహిళా సిబ్బంది కీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ మహిళల సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన మాజీ సర్పంచ్

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు మండలంలోని వివిధ గ్రామాలలో అనారోగ్యం బాగాలేక, అలాగే ప్రమాదవశాత్తు యాక్సిడెంట్లకు గురై, ప్రమాదంలో చేయి విరిగిన, విశ్రాంత ఉద్యోగుల బాధితులను గూడూరు మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ నునావత్ రమేష్ నాయక్ బాత్ శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. మండల కేంద్రంలోని చంద్రునిగూడెంలోని కేశవ తండ, భద్రు తండ, వడ్డెర గూడెంలలో ప్రమాదానికి గురైన బండి శ్రీను స్వరూప, చిన్నాల వెంకటేష్, ఫారెస్ట్ రిటైర్డ్ ఉద్యోగులు చిర్రా వెంకటేష్, కోమండ్ల చంద్రరెడ్డి, ఎలమందల రవి, దూకుట్ల వెంకన్న, అనారోగ్యంతో బాధపడుతున్న సూర వెంకటయ్య, వాంకుడోత్ విజయ, వాంకుడోత్ చంద్యా, వాంకుడోత్ భద్రమ్మ, చెవిటి వెంకన్నలను వారి స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిలో అడిగి తెలుసుకున్నారు. అంతేగాక వారికి పాలు, పండ్లను అందజేశారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండి యాకూబ్ పాషా, ఐలబోయిన సమ్మక్క, కన్నబోయిన వెంకన్న, బ్లాక్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ పెసరి శివ, మాజీ వార్డు నెంబర్ హెచ్ శివ, మండల మల్లేష్, చంటి మహేష్ రమేష్ సతీష్ జామ్లా పిసా కమిటీ ఉపాధ్యక్షులు ధరావత్ కిషన్, చందూలాల్, యాకూబ్, లచ్చులు రాములు వెంకన్న యుగంధర్ మునేషులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఘన సన్మానం

విశాలాంధ్ర - నేరేడుచర్ల : జనసేన పార్టీ హుజూర్నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ సరికొప్పుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సందర్భంగా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో శనివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సరికొప్పుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ఆశ వర్కర్లకు సన్మానం చేసి మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. సరికొప్పుల నాగేశ్వర మాట్లాడుతూ మన జీవితంలో మహిళ ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎంతోమంది దేవతలను పూజించే మన దేశంలో మహిళలను దేవతల కొలవాలని జనసేన పార్టీలో మహిళలకు ప్రత్యేకంగా వీర మహిళ విభాగాన్ని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రవేశపెట్టారు అని తెలియజేశారు. సరికొప్పుల విజయలక్ష్మి, సరికొప్పులలో నాగేశ్వరరావు గారు. కొమ్మరాజు శ్రీను. తిగుళ్ల సాయిచరణ్. అంజి, లీల, యమున, నాగమణి, వరలక్ష్మి రవళి రమణ దేవీ శైలజ ఆశ వర్కర్లు తులసి సీత సునీత రజిత మంజుల పావని రాజ్యం యశోద విజయనిర్మల గురువమ్మ స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వాగులను పూడ్చి వేస్తున్నా పట్టించుకోరా...

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : జిల్లాలోని చెరువులను వాగులు వంకలను పూడ్చేస్తూ ఉన్నా పట్టింపేది.. నిర్మల్ పరిసర ప్రాంతమైన హైవే రోడ్డుకు కూతవేటు దూరంలో ఉన్న కనకాపూర్ శివారులో హైవే 64 ప్రక్కన, చెరువు విస్తీర్ణాన్ని సగభాగంలో వ్యవసాయ భూమిగా మార్చివేశారు అదే తరహాలో ఖానాపూర్ పట్టణంలోని సాయిబాబా గుడికి పై భాగాన రిజర్వు అడవి నుండి తిమ్మాపూర్ శివారులో ప్రవహించే చిన్న వాగును అక్రమిస్తూ కట్టడాలు నిర్మిస్తున్నారు. అక్కడినుండి కిలోమీటర్ దూరంలో డబల్ బెడ్ రూమ్ల సమీపాన ఒక పక్క వ్యవసాయ భూములు మరోపక్క మస్కాపూర్ బీట్ రిజర్వ్ ఫారెస్ట్ అనుకొని తిమ్మాపూర్ శివారులో ప్రవహించే మద్దుల వాగు అదేవిధంగా ఇక్బాల్ పూర్ శివారులోని రిజర్వ్ ఫారెస్ట్ నుండి తిమ్మాపూర్ శివారులోని వ్యవసాయ భూముల మధ్యలోంచి ప్రవహించే రేంకొని వాగు మట్టితో పూడ్చి వేస్తున్న సో ద్యం చూసినట్టు చూస్తున్నారు తప్ప పట్టించుకునే అధికారులు పాలకులు కరువయ్యారని ఖానాపూర్ పట్టణ నివాసితులు వ్యాఖ్యానిస్తున్నారు.

రైల్వే లైన్ మంజూరుకు తుమ్మల కృతజ్ఞతలు

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : పాండురంగాపురం నుండి మల్కాజ్గిరి వరకు రైల్వే లైన్ మంజూరు చేయడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల అభ్యర్థనను కేంద్ర రైల్వే మంత్రి నీ హైదరాబాద్‌లో కలిసి రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పత్రం అందించినారు. ఈ రైల్వే మార్గాన్ని సారపాక (భద్రాచలం) వరకు త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు అమలయితే భద్రాచలానికి తరలి వచ్చే భక్తులకు మరింత సౌకర్యం లభిస్తుందని, యాత్రికుల సంఖ్య పెరిగే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. గోదావరి నదిపై నిర్మించాల్సిన రైల్వే బ్రిడ్జి పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా సారపాక వరకు రైల్వే లైన్‌ను పూర్తిచేస్తే, భక్తులు రైలు మార్గంలో సారపాక చేరుకుని, అక్కడి నుంచి బస్సులు మరియు ఇతర రవాణా సదుపాయాల ద్వారా భద్రాచలానికి చేరుకునే వీలుంటుందని వివరించారు. ఈ సందర్భంగా, సత్తుపల్లి - కొవ్వూరు మరియు పెనుబల్లి (ఖమ్మం) - కొండపల్లి (అమరావతి) వరకు కొత్త రైల్వే లైన్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని లేఖ ద్వారా కోరారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - ఖమ్మం: మహిళా చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని చట్టాల రక్షణతో జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించవచ్చునని ప్రముఖ సీనియర్ న్యాయవాది పొలిశెట్టి పద్మావతి తెలిపారు. హక్కుల సాధన చైతన్యంతో వివక్షను రూపుమాపవచ్చునన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో మహిళా దినోత్సవ సభ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అధ్యక్షతన జరిగింది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన పొలిశెట్టి పద్మావతి మాట్లాడుతూ మారిన సామాజిక పరిణామాలకు అనుగుణంగా అనేక మహిళా చట్టాలు రూపొందించబడ్డాయన్నారు. గృహహింస మొదలు మహిళలు ఎదుర్కొనే ప్రతి సమస్యకు చట్టంలో పరిష్కారం ఉందని ఆమె తెలిపారు. మహిళల్లో చట్టాల ద్వారా వివక్షను ఎదుర్కొనే చైతన్యం రావాలన్నారు. ఆధునీక సమాజంలోని మహిళలు వివక్షను, ఇబ్బందులను ఎదుర్కొవడం శోచనీయమన్నారు. ప్రముఖ న్యాయవాది ఓరుగంటి శేషగిరిరావు మహిళా చట్టాలు వినియోగం అనే అంశంపై ప్రసంగించగా, పరిణామ క్రమం - మహిళా చైత న్యంపై ఎడ్యుకేషన్ సబ్ కమిటీ బాధ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి ప్రసంగించారు. సభకు ముందు మహిళా సమాఖ్య పతాకాన్ని పోటు కళావతి ఆవిష్కరించారు. మహిళా సమాఖ్య గౌరవాధ్యక్షురాలు తాటి నిర్మల, జిల్లా ప్రధాన కార్య దర్శి ఏపూరి లతాదేవి, మహిళా సమాఖ్య బాధ్యులు దండి రాజేశ్వరి, బాగం అహల్య, జమ్ముల -లక్ష్మి, కె.ఉష, సరోజినమ్మ, మేళ్లచెరువు లలిత, లక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

సత్తుపల్లి చరిత్రలో లేడీ ఎమ్మెల్యే రాగమయి

విశాలాంధ్ర - పెనుబల్లి : రాష్ట్ర రాజకీయాలలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రత్యేక చరిత్ర ఉంది. కాంగ్రెస్ నేత జలగం వెంగళరావు సత్తుపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. అదేవిధంగా ఆయన సోదరుడు జలగం ప్రసాదరావు రాష్ట్ర మంత్రిగా పనిచేయగా వెంగళరావు తనయుడు జలగం వెంకటరావు కూడా సత్తుపల్లికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లి కి ప్రాతినిధ్యం వహించారు. ఆయన ఎన్టీఆర్ నాయకత్వంలో రాజకీయాల్లోకి వచ్చి అనేక మంత్రి పదవులు ఆ పార్టీలో చేపట్టి ఆ తరువాత ప్రత్యేక రాష్ట్రం వచ్చాక టీఆర్ఎస్ లో జాయిన్ అయి అందులో కూడా రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ఇప్పుడు కాంగ్రెస్‌లో కూడా ఆయన జాయిన్ అయిన తర్వాత మంత్రిగా కొనసాగుతున్నారు. అయితే ఎంతో రాజకీయ చరిత్ర కలిగిన సత్తుపల్లి నియోజకవర్గం నుంచి డాక్టర్ రాగమయి దయానంద్ 2023లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి తొలి మహిళ ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించారు. సత్తుపల్లి నియోజకవర్గానికి తొలి మహిళా ఎమ్మెల్యే అయినందున అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

16 నెలల్లో కాంగ్రెస్ చేసింది శూన్యం

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ హుజూర్నగర్ నియోజకవర్గ ఇన్చార్జి సమన్వయ కర్త ఒంటెద్దు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నేరేడుచర్ల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ కోట్ల రూపాయలను దుబారా చేశారని విమర్శించారు. వంద రోజులలో ఎన్నికల హామీలను అమలు చేస్తామని 16 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని ఆయన విమర్శించారు. అభయాస్తం పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2500లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని ఆరోపించారు. రైతు బంధు కోసం కెసిఆర్ రూ. 6500 కోట్ల నిధులను కేటాయిస్తే, ఎన్నికల కోడ్ తో నిలుపుదల చేశారని, ఆ డబ్బు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క క్యాబిన్లో 250 మంది కాంట్రాక్టర్లు బిల్లు రాక ధర్నా చేశారని పేర్కొన్నారు. ధాన్యము బియ్యము కొనుగోలులో అవినీతి అక్రమాలు జరిగాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి, కృష్ణా జలాలను తరలించుకొని పోతుంటే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మౌనంగా ఉంటున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు సీఎం రేవంత్ రెడ్డి కీలుబొమ్మగా ఉన్నారన్నారు. రేవంత్ రెడ్డి ఎప్పుడైనా చేరావచ్చునని జోష్యం చెప్పారు. తెలంగాణలో చంద్రబాబు నాయుడు చేసే కుట్రలకు రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయబాబు,మాజీ ఎంపీపీలు లకుమల్ల జ్యోతి, చెన్న బోయిన సైదులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు చిత్తలూరి సైదులు,యల్ల బోయిన లింగయ్య, పాలక వీడు మండల అధ్యక్షుడు అంజి రెడ్డి,హుజూర్ నగర్ మాజీ మార్కెట్ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సైది రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు గుర్రం మార్కండేయ, ఇంజమూరి రాములు, పల్లే పంగ నాగరాజు, వినాయక రావు,సుదర్శన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ గొప్ప అవకాశం

విశాలాంధ్ర - వనపర్తి : ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ గొప్ప అవకాశమని వనపర్తి జిల్లా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్. సునీత అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించిన న్యాయమూర్తి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను, వివాదాలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కోర్టులకు వెచ్చించే సమయాన్ని ఆదా చేసుకోవడమే కాకుండా, కోర్ట్ ఫీజు కూడా వాపస్ పొందవచ్చు అని చెప్పారు. నేటి లోక్ అదాలత్ ఏడు బెంచ్‌ల ద్వారా మొత్తం 6,266 కేసులను పరిష్కరించినట్లు న్యాయమూర్తి చెప్పారు. వాటిలో 2,663 క్రిమినల్ కేసులు కాగా, 8 సివిల్ కేసులు, 3,595 ప్రీ లిటిగేషన్ కేసులో ఉన్నట్లు చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వీ రజనీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కే కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ బి రవి కుమార్, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ వై జానకి, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ బి శ్రీలత, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రతతో కూడిన సాధికారత కావాలి : సాహెరా బేగం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : వర్తమాన సమాజంలో పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలకు భద్రత, గౌరవంతో కూడిన సాధికారత లభించినప్పుడే నిజమైన స్వేచ్ఛ ఉంటుందని సిపిఐ నాయకురాలు, తాజా మాజీ కౌన్సిలర్ సాహెరా బేగం అన్నారు. శనివారం మహిళా దినోత్సవం నేపథ్యంలో తన 25 వార్డ్ లో సాహెరా బేగం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రష్యా లోని శ్రామిక వాడాలో రోజా అనే మహిళ ఉద్యమ, కృషి ఫలితంగా ఈ ప్రత్యేక మహిళా శ్రామిక దినోత్సవం 1910 మార్చ్ 8 న ప్రకటించడం జరిగిందన్నారు. తర్వాత అది అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా మార్పు చేసి ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. ఎన్ని చట్టాలు రూపొందించిన మహిళలపై అఘాయిత్యాలు ఎందుకు ఆగడంలేదో పాలకులు సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న మహిళలకు చీరలతో అందించి, ఆత్మీయంగా సన్మానించి కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాహెరా భర్త మాజీ కౌన్సిలర్ ఎండి. యూసుఫ్, అంగన్వాడీ టీచర్లు పద్మ, కుమారి, శైలజ, ఆశ వర్కర్లు గంగా, శుశీల, ఆర్పి రాజకుమారి, ఓబి లు అనూష, సరోజ, కృష్ణవేణి, విజయ లక్ష్మి, రమా, అంగన్వాడీ ఆయాలు చంద్రకళ, వరాలు, తుల్సి, సైండ్ల. స్వాతి, టంగుతూరి. శాంత పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ పి.రాజేంద్ర ప్రసాద్ మహిళా పోలీస్ సిబ్బంది శ్రీలత, లావణ్య, లక్ష్మి, జ్యోత్స్న మరియు స్వప్న లను సన్మానించారు. వారి అంకితభావానికి, ధైర్యసాహసాలకు ప్రశంసలు కురిపించారు. కేక్ కటింగ్ అనంతరం, మహిళా సిబ్బందికి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. మహిళా పోలీసులు పోలీస్ శాఖలో కీలక భూమిక పోషిస్తూ, సమాజంలో శాంతి, భద్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు, ఇంటి,ఉద్యోగ బాధ్యతలను, సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాజానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తున్నారని ఇన్‌స్పెక్టర్ పి.రాజేంద్రప్రసాద్ తెలిపారు.

సిర్పూర్ న్యాయవాదుల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలు

సిర్పూర్ (టీ)కోర్టు జడ్జి,న్యాయవాదుల ఆధ్వర్యంలో మహిళ న్యాయవాదులను శాలువతో ఘనంగా సత్కరించి ప్రపంచ అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి అజయ్ ఉల్లం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది మార్చి 8న మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఓ చారిత్రాత్మక ఉద్యమమే మహిళా దినోత్సవంగా మారింది పనిగంటలు తగ్గించమని కోరుతూ మహిళలు చేపట్టిన ఉద్యమం దేశ దేశాల్లో మహిళా దినోత్సవంగా ఉద్భవించింది. నేటి సమాజంలో మహిళలు ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల వివక్షలను వదిలి, మగవారితో సమానంగా అవకాశాలు కల్పించాలని ఈ మహిళా దినోత్సవం సందర్భంగా కోరుకుందాం. మహిళలకు విద్య అందిందన్నారు.

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వివిధ మహిళ సంఘాలు, సింగరేణి సంస్థ,రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం,ఈ ఉత్సవాల సందర్భంగా సమావేశాలు నిర్వహించి మహిళా దినోత్సవ ఔన్నత్యాన్ని చాటి చెప్పాయి. రామగుండం కమీషనరేట్ కార్యాలయంలో పెద్దఎత్తున జరిపిన ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ సి.రాజు మహిళా అధికారులు, సిబ్బంది తో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మహిళా సిబ్బందికి శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ లేకపోతే సృష్టి లేదు అని,ప్రతి స్త్రీ ని గౌరవించాలి అని అన్నారు.మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, వారు ఏదైనా సాధించగలరని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని దేశంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు మెరుగ్గా రాణిస్తున్నారని అన్నారు. ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగరేణి సేవాసమితి అధ్యక్షురాలు అనితా లలిత్ కుమార్ ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో రాణిస్తున్న విధంగా సింగరేణిలో కూడా కొత్తగా ఉద్యోగంలో చేరిన మహిళలకు కూడా రాణించేందుకు అన్ని అవకాశాలు కల్పించిందని అన్నారు.

సమిష్టి ఉద్యమాలతోనే మహిళా హక్కులు కాపాడుకోవాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: సమిష్టి ఉద్యమాలతోనే మహిళా చట్టాలు, హక్కులకు పరిరక్షించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాష పిలుపునిచ్చారు. భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో రజబ్ అలీ భవన్లో శనివారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ ను కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.సాబీర్ పాష మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో నాటి నుంచి నేటి వరకు పాలకులు మహిళల అభ్యున్నతికి చేసింది చాలా తక్కువే అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. వివిధరంగాల్లో సేవలందిస్తున్న పలువురు మహిళా ప్రముఖులను సమాఖ్య ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి మున్నా లక్ష్మికుమారి, సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, బారిగేల సంపూర్ణ, రత్నకుమారి, మామిడాల ధనలక్ష్మి, కూరపాటి విజయ లక్ష్మి, మునిగడప పద్మ, మేదిని లక్ష్మి, ధారా లక్ష్మి, భాగ్యలక్ష్మి, నిర్మల, గోనె మణి, పల్నాటి వీణ, షహీన్, షమీన, ధనలక్ష్మి, శాంతి, కైసర్ పాల్గొన్నారు.

సమాజ మనుగడ స్త్రీలతోనే సాధ్యం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : తన కుటుంబ సంస్కరణ బాధ్యతల తోపాటు సమాజాభివృద్ధి సమగ్ర మానవ పురోగతి స్త్రీల పైన ఎంతైనా ఆధారపడి ఉందని జమాతే ఇస్లామీ హింద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పర్వీన్ బాజీ అన్నారు. వర్తమాన సమాజం ఆధునికంగా ఎంత ఎదిగినప్పటికీ సమాంతరంగా స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఇంకా పూర్తిస్థాయి స్వేచ్ఛా, సమానత్వాలు, భద్రతా జీవితాలు ఏర్పడలేదన్నారు. శనివారం జమాతే ఇస్లామీ హింద్ మహిళావిభాగం కొత్తగూడెం పట్టణ ఉపాధ్యక్షురాలు షెహనాజ్ జహంగీర్ షరీఫ్ అధ్యక్షతన ఎజాజ్ జరీన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల తోపాటు ఇఫ్తార్ పార్టీ పెద్దఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యతిదిగా పర్వీన్ బాజీ మాట్లాడుతూ ఇంకా కొనసాగుతున్న పురుషాధిక్య సమాజం మహిళలకు ప్రకటిత స్వేచ్ఛ ముసుగులో భోగ, ఆటవస్తువు లాగే చూస్తుందని స్పష్టం చేసారు. మహిళలను ఆట వస్తువు లాగా చూస్తున్న నేటి తరంలో తమ స్పష్టమైన నైతిక, సమాజిక పరిణామాలను అవగాహన చేసుకున్నప్పుడే నిజమైన గౌరవం సామాజిక వికాసం, మహిళా సాధికారకత సాధ్యమన్నారు. అందుకు రంజాన్ మాసం వ్యక్తి శిక్షణా, ధార్మిక పరిజ్ఞానం కల్గించి నైతికత సత్ సమాజం ఏర్పడేందుకు దోహదం చేస్తుందన్నారు. ఇందులో పాల్గొన్న అడ్వకేట్ మల్లెల ఉషారాణి మాట్లాడుతూ మహిళలకు భద్రతతో కూడిన సమానత్వం లభించినప్పుడే దేశ భవిషత్ నిర్మాణం సాధ్యమన్నారు. కొత్తగూడెం షీ టీమ్ సబ్ ఇన్స్పెక్టర్ రమాదేవి మాట్లాడుతూ జమాతే ఇస్లామీ హింద్ నిత్యం మహిళల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ సామజిక చైతన్యం, ఆత్మ స్థైర్యం పాదుగొలుపుతుందన్నారు. సంస్కారమంత గృహిణులుగా రూపు దిద్దేందుకు జమాత్ ఇస్లామీ హింద్ కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని అభినందించారు. తన పరిధిలో ఉన్న అవకాశం మేరకు మహిళా సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకురాలు సంధ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు చట్టాలను పటిష్టంగా అమలు చేసేందుకు ఒత్తిడి తేవాలని కోరారు. గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఆయేషా కార్యక్రమాల నివేదిక వినిపించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ, కులమతాలకతీతంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవోదయ' ఏర్పాటు అడ్డుకుంటున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లాకు మంజూరు చేయించిన నవోదయ పాఠశాల ఏర్పాటును బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అడ్డుకుంటున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి 7 నవోదయ పాఠశాలలు మంజూరు అయితే రెండు పాఠశాలలను నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో నిజామాబాద్, జగిత్యాలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు మంజూరైన పాఠశాలను జిల్లా మధ్యలో ఏర్పాటు చేయడానికి జక్రాన్ పల్లి మండలం కలిగోట్ గ్రామంలో ప్రతిపాదనలు నివేదిస్తే సుదర్శన్ రెడ్డి అడ్డుకున్నారని విమర్శించారు. బిజెపి జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ జిల్లాలోని కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలతో చర్చించి సిఎం తో మాట్లాడి ప్రతిపాదనలు రూపొందించినట్లు వెల్లడించారు. కలికోట గ్రామంలో ఏర్పాటు చేసే ప్రతిభను కాకుండా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బోధన్ నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ భూముల్లో ఏర్పాటుకు ప్రతిపాదన చేశారని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో నైపుణ్యం పెంచుకోవాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పినపాక : మహిళలు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాల్లో నైపుణ్యం పెంచుకొని రాణించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పినపాక నియోజకవర్గ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మణుగూరు మండలం ప్రజా భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్నా ఆయన మహిళలందరికీ స్ఫూర్తిగా నిలుస్తూ వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలందరికీ శాలువతో సత్కరించారు. మహిళలు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మహిళలు ఆశీర్వదించాలని కోరారు. తమ ప్రజా ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిరినాకి నవీన్, తరుణ్ రెడ్డి, కొర్సా ఆనంద్, బర్ల నాగమణి, మేకల జ్యోతి, కూరపాటి సౌజన్య, భూక్య సుగుణ, తాటి సావిత్రి, శివ, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు పాల్గొన్నారు.

కోర్టు కేసుల్లో లోక్ అదాలతే మంచి పరిష్కారం

విశాలాంధ్ర - ఇల్లందు : వాది ప్రతివాదుల కోర్టు కేసుల విషయంలో ఉత్తమమైన పరిష్కార మార్గాన్ని లోక్ అదాలత్ అంతిమ పరిష్కార మార్గమని ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు. శనివారం ఇల్లందు కోర్టు ఆవరణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఇందులో కీర్తి చంద్రిక రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీ పడినట్లయితే ఇరువర్గాలు గెలిచినట్టేనని అన్నారు. తద్వారా ఎంతో విలువైన కాలాన్ని డబ్బుని ఆదా చేసుకున్న వారు అవుతారన్నారు. లోక్ అదాలత్‌లో రాజీపడిన కేసులకు చట్టబద్ధత ఉంటుందన్నారు. కోర్టుకు వెళ్లి అప్పిల్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. కోర్టు ఆవరణంలో శరత్ మ్యాక్స్ ఐ కేర్ విజన్ నిర్వహించిన ఉచిత నేత్ర పరీక్షలు కార్యక్రమాన్ని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించి ఆమె నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం కక్షిదారుల కోసం చేసిన పులిహోర పొట్లాలను జడ్జి చేతుల మీదుగా పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమాల్లో ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూకే రవికుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి కె. ఉమమహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, బ్యాంకు సిబ్బంది, ఇల్లందు డిఎస్పి చంద్రభాను, సిఐ సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పొద్దుటూరు నాగేష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి

విశాలాంధ్ర - తొర్రూర్ (నెల్లికుదురు): సరదా కోసం చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడ్డ సంఘటన నెల్లికుదురు మండలంలోని మేచరాజుపల్లి శివారు పెద్ద తండా గ్రామపంచాయతీలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన కథనం ప్రకారం పెద్ద తండా గ్రామానికి చెందిన బాదావత్ శేఖర్ (21) భూక్యా రాములు (45) ఇరువురు శుక్రవారం మేచరాజుపల్లి గ్రామ శివారు లోని కుమ్మరి కుంట లో చేపల వేటకు వెళ్లారని, సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో గ్రామస్తుల సహకారంతో కుంట వద్దకు వెళ్లి వెతుకులాడగా ఇరువురు మృతిచెంది ఉన్నారని తెలిపారు. తండ్రి బాదావత్ బద్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మహబుబాబాద్ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఆయన తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల రోదనలతో తండాలో విషాదం నెలకొంది.

సంపాదకీయం

అదానీకి కాంట్రాక్టుపై సుప్రీం దృష్టి

మహారాష్ట్ర ప్రభుత్వం ముంబైలోని ధరావి పునరభివృద్ధి పథకాన్ని మోదీకి సన్నిహిత మిత్రుడైన అదానీకి కట్టబెట్టడంపై చాలా రోజులుగా వివాదం చెలరేగుతూనే ఉంది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టును ఆశ్రయించిన వారూ ఉన్నారు. అయితే సుప్రీంకోర్టు ఈ పథకాన్ని అమలు చేయడంపై స్టే మంజూరు చేయడానికి నిరాకరించింది కానీ ఈ వ్యవహారాన్ని సమీక్షించడానికి సమ్మతించింది. అదానీ ప్రాపర్టీస్ అన్న సంస్థకు ధరావీ పునరభివృద్ధి పథకాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టింది. స్టే ఇవ్వడానికి నిరాకరించినప్పటికీ అదానీ ప్రాపర్టీస్ సంస్థ ఈ అంశానికి సంబంధించిన సకల లావాదేవీలకు ఖర్చు పెట్టే మొత్తాన్ని ఎస్క్రో అకౌంట్ ద్వారా నిర్వహించాలని ఆదేశించింది. ఎస్క్రో అకౌంట్ అంటే అది దాదాపు మూడవ పక్షం ఖాతా. ధరావిలో మురికి వాడలు ఎక్కువ. ఈ ప్రాంతాన్ని ఆధునికంగా దిద్ది తీరుస్తారట. మెరుగైన ఇళ్లు నిర్మిస్తారట. మౌలిక సదుపాయాలు, ఆర్థిక అవకాశాలు కల్పిస్తారట. నిజానికి ఈ పనులన్నీ ప్రభుత్వం చేయాల్సినవే. కానీ ఈ మహత్తర బాధ్యతను అదానీకి అప్పగించడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. సీలింక్ టెక్నాలజీస్ కార్పొరేషన్ (ఎస్.టి.సి.) దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది. అయితే అదానీకి ఈ పథకం బాధ్యత అప్పగించడం తాము ఇచ్చే తుది తీర్పుకు లోబడి ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి సంజయ్ కుమార్ విచారిస్తున్నారు. ధరావీ పథకం కోసం మొదట టెండర్లు పిలిచినప్పుడు సీలింక్ టెక్నాలజీస్ కార్పొరేషన్‌కు ఈ టెండర్ దక్కింది. కానీ ప్రభుత్వ లక్ష్యం ఈ బాధ్యత అదానీకి అప్పగించడం కనక రెండోసారి టెండర్లు పిలిచారు. అదానీకి అనుకూలమైన అంశాలు ఆ టెండర్లో చేర్చారు. ఇంకేముంది అదానీకి టెండర్ దక్కింది. సుప్రీంకోర్టు విచారణ పూర్తి చేసి అదానీకి ఇచ్చిన కాంట్రాక్టును రద్దు చేయకపోతే అదానీ ముంబైలో భారీ ఎత్తున స్థిరాస్తి కార్యకలాపాలు నిర్వహిస్తారన్న మాట. మరో మలుపు ఏమిటంటే సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఎస్.టి.సి. కంపెనీ అదానీ చేస్తానంటున్న పనులన్నీ తామూ చేస్తామని అందువల్ల కాంట్రాక్టు తమకు కేటాయించాలని కోరుతోంది. అదానీకి ఇచ్చిన కాంట్రాక్టు విలువ రూ. 8.640 కోట్లు. ధరావీ ఆసియాలోనే అతి పెద్ద మురికి వాడ. అక్కడ జన సాంద్రత చాలా ఎక్కువ. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు మొదటి సారి జారీ చేసిన టెండర్‌కు, రెండో సారి జారీ చేసిన టెండర్ కు మధ్య చేసిన మార్పులనైతే పరిశీలించింది. మునుపు ఇచ్చిన కాంట్రాక్టును రద్దు చేసే అవకాశం ఉందా లేదా అన్న విషయమూ సుప్రీంకోర్టు పరిశీలించనుంది. మొదటి సారి టెండర్ జారీ చేసినప్పుడు ఎస్.టి.సి. రూ. 7000 కోట్లతో ఈ పథకాన్ని పూర్తి చేయడానికి ముందుకొచ్చింది. కానీ టెండర్ నిబంధనలను మార్చేసి ఈ కాంట్రాక్టు అదానీ ప్రాపర్టీస్ సంస్థకు ఇచ్చేశారు. మొట్ట మొదట అధిక మొత్తం ఖర్చు పెట్టడానికి ముందుకొచ్చిన సంస్థ ఎస్.టి.సి.నే. ఈ కేసు హైకోర్టు విచారించినప్పుడు ఈ అంశాన్ని పట్టించుకున్నట్టు లేదు. ఈ పథకం అమలయ్యే ప్రాంతంలో కొంత రైల్వే భూమి కూడా ఉంది. తమ భూమిని ఈ పథకం కోసం ఇవ్వడానికి అప్పుడు రైల్వే శాఖ అంగీకరించలేదు. కానీ ఈ కాంట్రాక్టు అదానీకి అందగానే తమ భూమిని ఇచ్చేయడానికి రైల్వే శాఖ అంగీకరించింది. అంటే మతలబు ఎక్కడుందో అర్థం అవుతూనే ఉంది.

ఎస్.టి.సి.ని రంగం నుంచి తొలగించిన తరవాత టెండరు షరతులు ఎందుకు మార్చేశారు అని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ అంశాలన్నీ ముందే ఎందుకు ఆలోచించలేదని కూడా నిలదీసింది. అంత మాత్రం చేత సుప్రీంకోర్టు అదానీకి కట్టబెట్టిన టెండర్‌ను రద్దు చేస్తుందని తొందరపడి నిర్ణయానికి రావడం దండగ. ఎందుకంటే ఈ మధ్యలో న్యాయ మూర్తులు విచారణ సందర్భంగా చాలా నిశిత దృష్టితో పరిశీలి స్తున్నట్టు కనిపించడానికి అనేక సాహసోపేతమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. చివరకు తీర్పు మాత్రం ప్రభుత్వానికి అనుకూలంగానే వస్తోంది. సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అదానీ కంపెనీ తరఫున వాదించడాన్ని కూడా తీవ్రంగా పరిశీలించవలసిందే. అదానీ రూ. 8, 869 కోట్లకు పని పూర్తి చేయడానికి అంగీకరించారని, అందులో రూ. 5,069 కోట్లు అసలు పథకానికైతే రైల్వే భూమి ఇచ్చినందుకు అదనంగా రూ. 1,000 కోట్లు చెల్లించడానికి ఒప్పుకున్నారని, మరో నష్ట పూర్తికోసం రూ. 2.869 కోట్లు ఇవ్వడానికి అంగీకరించారని అదానీ ప్రాపర్టీస్ తరఫున వాదిస్తున్న తుషార్ మెహతా అంటున్నారు. కానీ మొదట్లో అందరికన్నా ఎక్కువ మొత్తం ఖర్చు పెట్టడానికి ఒప్పుకున్న కంపెనీ ఇప్పుడు అదానీ చేస్తానంటున్న పనులన్నీ చేయడానికి సిద్ధపడ్తోంది. మొదటి సారి టెండర్‌ను ఎందుకు రద్దు చేయవలసి వచ్చిందో సుప్రీంకోర్టు పరిశీలనలో తేలుతుందో లేదో చూడాలి. ఎక్కువ మొత్తానికి టెండర్ పాడిన వ్యక్తిని పక్కకు తోసేసి తరవాత టెండర్ షరతులను ఎందుకు మార్చారో సుప్రీంకోర్టు ఏ దృష్టితో పరిశీలిస్తుందో మే లో తదుపరి విచారణలో కాని తేలదు. ఎస్.టి.సి. పెట్టుకున్న పిటిషన్‌ను బొంబాయి హైకోర్టు 2024 డిసెంబర్‌లో తోసిపుచ్చింది. ఎస్.టి.సి. వాదనలో బలం లేదని కూడా వ్యాఖ్యానించింది. ఎస్.టి.సి. సెషెల్స్ నుంచి పని చేసే సంస్థ. అది కొన్ని కాంట్రాక్టు కంపెనీల సముదాయం. 2020 నవంబర్ అయిదున ప్రభుత్వం ఎస్.టి.సి.కి ఈ కాంట్రాక్టు ఇవ్వకూడదని నిర్ణయించింది. ఈ విషయాన్ని 2020 నవంబర్ లో ఎస్.టి.సి. కంపెనీకి తెలియజేశారు. 2022 సెప్టెంబర్ 22న మహారాష్ట్ర ప్రభుత్వం కొత్త టెండర్ ప్రక్రియ ప్రారంభించింది. 2023 జులై 13న అదానీ కంపెనీకి ఈ కాంట్రాక్టు ఇచ్చేశారు. తమ టెండర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడం భారత రాజ్యాంగంలోని 14వ అధికరణానికి విరుద్ధమైందని కూడా ఎస్.టి.సి. వాదిస్తోంది. తమ కంపెనీ రెండో సారి జారీ చేసిన టెండర్‌లో పాల్గొనడానికి వీలు లేకుండా టెండర్ నిబంధనలను మార్చేశారని ఎస్.టి.సి. అంటోంది. ధరావి పునర్నిర్మాణ పథకం అంతా మహారాష్ట్ర ప్రభుత్వ పుణ్యమా అని సినిమా ఫక్కీలో నడుస్తోంది. పనిగట్టుకుని అదానీకి టెండర్ కట్టబెట్టిన తీరుపై గత డిసెంబర్ నుంచి ముంబై ప్రజలు భారీ ఎత్తున ఆందోళనలు మొదలు పెట్టారు. ఈ నిరసన ధరావి నుంచి మొదలై ముంబైలోని కుర్లాలో ఉన్న అదానీ ప్రధాన కార్యాలయం దాకా సాగింది. అంటే ఈ నిరసనకు ఉన్న రాజకీయ ప్రాధాన్యాన్ని కూడా గమనించాలి. ఇప్పటిదాకా అదానీపై ఆరోపణలు, ఫిర్యాదులు పత్రికా విలేకరుల సమావేశాలకు, పార్లమెంటులో ప్రస్తావనలకు, ఇతరత్రా మార్గాలకు పరిమితమైనాయి. కానీ ఇప్పుడు అదానీకి వ్యతిరేకంగా ప్రజలే రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది.

విద్యుత్ చార్జీలపై మంత్రి అవాస్తవాలు

ఎం. లక్ష్మీరాజ్యం

విద్యుత్ చార్జీలపై శాసనసభ సాక్షిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు విద్యుత్ చార్జీలను పెంచలేదనీ, భవిష్యత్‌లోనూ పెంచబోదని ఆయన పెద్ద అబద్ధమాడేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదినెలల కాలంలో రెండు సార్లు ట్రూ అప్/ ఎఫ్‌పీపీసీఏ పేరుతో సుమారు పదహారు వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిన విషయాన్ని మంత్రి మరిచిపోవడం అత్యంత విచారకరం. రాష్ట్రంలోని గత వైసీపీ ప్రభుత్వం యూనిట్‌కు ఆరు పైసలుగా ఉన్న విద్యుత్ సుంకాన్ని ఏకంగా రూపాయికి పెంచితే దానికి చట్టబద్ధత కల్పించింది కూటమి ప్రభుత్వమేనన్న విషయాన్ని మంత్రి ఎలా మరిచిపోయారో అర్థంకావడంలేదు. ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరుతో ఇప్పటికీ ప్రతి నెలా యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా వసూలు చేస్తున్న విషయాన్ని మంత్రి దాచిపెట్టడం అత్యంత దారుణం. ప్రజలపై గత ప్రభుత్వం వేసిన భారాలను కొనసాగిస్తూ, ఇంకొన్ని కొత్త భారాలను మోపుతూనే చార్జీలను పెంచలేదనీ, భవిష్యత్‌లో పెంచబోమని మంత్రి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడం శాసనసభను రాష్ట్ర ప్రజలను పక్కదారిపట్టించడమేననడంలో ఎటువంటి సందేహంలేదు.

అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రకటించిన టీడీపీ కూటమి అధికారం చేపట్టిన నాలుగు నెలలకే హామీని మరచి ట్రూఅప్ చార్జీల పేరుతో భారీగా వడ్డించింది. అధికారానికి వస్తే 'విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం', 'విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం' అని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీలిచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం భారాలు తగ్గించకపోగా గత ఏడాది అక్టోబరు మాసాంతంలో అమాంతం 44 శాతం పెంపుదలకు పూనుకుని ప్రజలకు విద్యుత్ షాక్ తగిలించింది. ఎన్నికల ముందు అధికారం కోసం చార్జీలు పెంచేదిలేదని చేసిన ప్రకటన మేరకు ఈ చార్జీలను ప్రభుత్వమే భరించాలన్న వినియోగదారుల విజ్ఞప్తులను చంద్రబాబు సర్కార్ పెడచెవినపెట్టింది. ఇచ్చిన మాట తప్పి 6,072 కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపింది. ఇంధన, విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు (ఎఫ్‌పీపీసీఏ) చార్జీలు 8,113.60 కోట్ల రూపాయలు వసూలు చేసుకునేందుకు అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)కి డిస్కంలు ప్రతిపాదించాయి. గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి రూ. 2,194 కోట్లు, వ్యవసాయ విద్యుత్ సర్వీసుల నుంచి రూ. 1,901 కోట్లు, పారిశ్రామిక సర్వీసుల నుంచి రూ. 2,748, వాణిజ్య సర్వీసుల నుంచి రూ. 669 కోట్లు, వివిధ సంస్థల నుంచి రూ.547 కోట్లు చొప్పున విద్యుత్ బిల్లులలో అదనంగా వసూలు చేసుకుంటామని అడిగాయి. చార్జీలు భరించడంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సంకేతాలు రాకపోవడంతో వారం రోజులు వేచిచూసిన ఏపీఈఆర్‌సీ 6,072.86 కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీల వసూలుకు అనుమతిస్తూ అక్టోబరు చివరి వారంలో తన నిర్ణయాన్ని వెల్లడించింది. ఈ మొత్తాన్ని వినియోగదారులు వాడిన విద్యుత్‌కు నవంబరులో జారీచేసిన బిల్లు నుంచి 15 నెలలపాటు వసూలు చేయాలన్న ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు 2026 జనవరి వరకు వినియోగదారులు ఈ భారాన్ని మోయాల్సివుంటుంది. ఫలితంగా నవంబర్ నుంచి ప్రతి యూనిట్‌పై రూ.1.58పైసల వరకు అదనపు భారం ప్రజలపై పడింది. ఇంతేకాకుండా ఎఫ్‌పీపీసీఏ పేరిట వినియోగదారుల నుంచి విద్యుత్ సంస్థలు వసూలు చేస్తున్న అదనపు మొత్తం నొప్పి వినియోగదారులకు తెలియకుండా వసూలు చేసుకునేందుకు ఏపీఈఆర్‌సీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. మొదటి, నాలుగో త్రైమాసికంలో వసూలు చేయాల్సిన ఎఫ్‌పీపీసీఏ (ట్రూఅప్) మొత్తాన్ని సమానంగా విభజించి రెండు నెలల్లో వసూలు చేసుకునేందుకు డిస్కంలను అనుమతించింది. స్వల్పకాలిక కొనుగోళ్ల పేరుతో గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం సైతం కొనసాగించడం అత్యంత విచారకరం. ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోలో విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం, విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని హామీనిచ్చారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రసంగాల్లో ఇదే విషయం గట్టిగా చెప్పారు. వైసీపీ హయాంలో రకరకాల పేర్లతో వేసిన వేల కోట్ల రూపాయల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాష్ట్ర ప్రజలు చంద్రబాబు మాటలతో కొంత ఊరట లభిస్తుందని ఆశించారు. రానున్న ఐదేళ్లూ కరెంటు చార్జీలు పెరగవని గట్టిగా విశ్వసించారు. అయితే, టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల హామీకి విరుద్ధంగా రెండు సార్లు ఎఫ్‌పీపీసీఏ చార్జీల భారం మోపింది. ఈ వాస్తవాలను విస్మరిస్తూ మంత్రి శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం చివరి రెండేళ్లలో ప్రజలపై రూ. 15వేల కోట్ల విద్యుత్ భారాలను మోపిందనీ, ఆ పెంపు ప్రక్రియ మూడు నెలల్లో పూర్తిచేయాల్సి ఉండగా, దాన్ని 20 నెలలకు సాగదీసిందని చెప్పడం ద్వారా తమ ప్రభుత్వం మోపిన భారం నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. వాగ్దానాలను విస్మరించడమేగాక ప్రజలకు అబద్ధాలు చెబుతూ మోసగించి ఎల్లకాలం పాలన సాగించలేరు. విద్యుత్ భారాలు మోస్తున్న ప్రజలు తప్పక ప్రతిఘటిస్తారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదించిన వీటీపీఎస్, కృష్ణపట్నం మూడో యూనిట్ థర్మల్ కేంద్రాలను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో డిస్కంలు బహిరంగ మార్కెట్లో ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం కూడా ప్రస్తుత విద్యుత్ భారాలకు కారణంగా చెప్పవచ్చు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అంతకుముందున్న టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా సర్దుబాటు పేరిట విద్యుత్ చార్జీలను పెంచాల్సి వచ్చిందని చెప్పింది. ప్రస్తుతం ఉన్న టీడీపీ ప్రభుత్వం కూడా గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాల వల్లే చార్జీలను పెంచాల్సి వచ్చిందని చెపుతోంది. ఏదిఏమైనప్పటికీ ఈ రెండు ప్రభుత్వాలు కూడా ప్రైవేట్ ఉత్పత్తిదారుల నుంచి ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలుచేసి ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

ప్రమాదంలో రాజ్యాంగ లక్ష్యాలు

డి.రాజా
సీపీఐ ప్రధాన కార్యదర్శి

మోదీ దుష్ట పాలనపై మార్చి 23నుంచి ఏప్రిల్ 14 వరకు సీపీఐ ప్రచారం

ప్రపంచంలో గొప్ప ప్రజాస్వామ్య భారతదేశం నేడు చౌరాస్తాలో నిలిచి ఉంది. గొప్ప ఆదర్శాలు గల మన రిపబ్లిక్ సోషలిజం, లౌకిక వాదం, సామాజిక న్యాయం, సమానత్వంతో కొనసాగుతున్నప్పటికీ ఇవన్నీ నేడు ఎనలేని ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. మెజారిటీ మత వర్గానికి ప్రభుత్వ అనుకూలత పెరుగుతోంది. అధికారం కేంద్రీకృతం అవుతోంది. సమాఖ్య విధానం క్రమక్షయం, అసమానత్వం పెరగడం జరుగుతోంది. రాజకీయ, సామాజిక వాతావరణం మరింత దుర్గంధ పూరితమవుతోంది. అసహనం, అన్యాయం పెరుగుతున్నాయి.

మోదీ ప్రభుత్వం దుందుడుకుగా విధ్వంసకర ఆర్థిక విధానాలను అనుసరిస్తోంది. శ్రామిక వర్గ ప్రజల జీవితాలను నాశనం చేస్తోంది. కార్పొరేట్ సంపన్నుల లాభాలు పెరిగి పోతూనే ఉన్నాయి. ద్రవ్యోల్బణం పెరిగిపోతూ, ఉద్యోగ అవకాశాలు, ఏక, జీవన ప్రమాణాలు దిగజారుతూ సామాన్య ప్రజలు అల్లాడి పోతున్నారు. భారత్ జనాభా మనకొక ప్రయోజనమని, అదొక బలమని భావించాం. ఇప్పుడు విపరీతమైన జనాభా మిక్కుటమైందని, నిరుద్యోగ భారమే ఇలా అనుకొనేందుకు కారణమని భావిస్తున్నారు. భారీ కార్పొరేషన్లకు అనుకూలమైన విధానాల వల్ల ఆర్థిక బలహీనతలు అపారంగా బలమైనవయ్యాయి. ప్రభుత్వ రంగాన్ని ఒక పద్ధతి ప్రకారం నాశనం చేశారు. శ్రామిక వర్గం, అణగారిన వర్గాలు మరింతగా దిగజారి పోతున్నాయి.

రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య సూత్రాల నాశనం, కేంద్ర ప్రభుత్వ అధికారం కేంద్రీకృతం కావడం పెరుగుతుండటం భారత్ ఎదుర్కొంటున్న సవాళ్లలో అత్యంత కీలకమైంది. ప్రజలకు ఉపయోగంలేని జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) రుద్దడం, ఒకే విధమైన ఆహార అలవాట్లను అమలు చేయడానికి, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం లాంటి క్లిష్టమైన రంగాలలో ప్రభుత్వ అధికారాలను దిగజార్చడం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకే భాషను దేశ వ్యాప్తంగా రుద్దడానికి భారత్ సంపద్వంతమైన వైవిధ్యాన్ని ధ్వంసం చేసేందుకు ప్రభుత్వం పూనుకున్నది. ఆర్ఎస్ఎస్- బీజేపీ మెజారిటీ ఎజెండాగా సాంస్కృతిక ఆధిపత్యం నెలకొల్పేందుకు ఈ ప్రయత్నం.

సమాఖ్య విధానంలో క్రమక్షయం కేవలం రాజకీయంగా ఆందోళన కలిగించేది మాత్రమే కాదు దేశ భిన్నత్వంలో ఏకత్వంపై దాడి. ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వంతో తరచుగా తలపడ వలసివస్తోంది. ఆర్థిక వనరుల పంపకం వద్దలేదా, దర్యాప్తు అధికారాల దుర్వినియోగం, ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ, నష్ట పరిహారం చెల్లింపులలో కేంద్రంతో రాష్ట్రాలు తగాదా పడవలసి వస్తోంది. ఇలాంటి ధోరణులు సహకార సమాఖ్య విధానాన్ని విచ్ఛిన్నం చేస్తుంది. ఇలాంటి విషయాలలో ప్రధాన మంత్రి మోదీ గతంలో చాలా మాట్లాడారు, అయితే వీలైనంత మేరకు ప్రతి సందర్భంలో దాడి చేస్తూనే ఉంటారు.

భారత్‌లో ఆర్థిక అసమానతలు అత్యంత ప్రమాదకరంగా వేగంగా పెరుగుతూనే ఉన్నాయి. మన దేశంలో బిలియనీర్ల సంపద పెరుగుదల మనకు స్పష్టంగా తెలిసిపోతూనే ఉంటుంది. గణనీయమైన జనాభా రెండు పూటలా ఆహారం తినడానికి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు ప్రైవేటీకరణకు ప్రాధాన్యత నిస్తోంది. సంపన్నులకు, పేదలకు మధ్య అంతరం అపారంగా ఉంది. ప్రభుత్వ రంగ విధ్వంస స్థిర ఉద్యోగం, ప్రభుత్వ సేవలు లేకపోవడానికి మాత్రమేగాక, ఉద్యోగాలు ఊడిపోవడానికే కాదు ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాల రంగంలో అత్యవసర సేవలు బలహీన పడిపోవడానికి కారణం.

కార్మికుల హక్కులు, సామాజిక భద్రతా చర్యలు క్షీణించి పోవడానికి కారణం ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలే. కార్మిక చట్టాలు బలహీనపడ్డాయి. ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు వ్యక్తులకు చౌక ధరలకు విక్రయిస్తున్నారు. అనేక మిలియన్ల ప్రజల జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయి. సామాజిక- ఆర్థిక విధానాలు అత్యంత తీవ్రంగా దిగజారుతున్నాయి. దళితులు, మైనారిటీల, ఆదివాసీలు తదితర అణగారిన వర్గాలు ఆర్థిక మినహాయింపు వల్ల దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. భారత్‌లో కులం ఆధారంగా ఏకం అవుతున్న విషయం మనకు స్పష్టంగా తెలుస్తోంది. ఇది ఆందోళనకరమైన అంశం. ఈ ధోరణి వివక్షతతో కూడింది. హింసకు దారి తీస్తుంది. ఆర్ఎస్ఎస్ మనువాద సిద్ధాంతానికి చెందింది. ఇది వారసత్వంగా చిరకాలం నుంచి వస్తున్న కులాన్ని సమర్థిస్తుంది. సమ సమాజానికి వ్యతిరేకం, రాజ్యాంగ రచయిత డా॥అంబేద్కర్ వలే కుల వ్యతిరేక సిద్ధాంతాన్ని అనుసరించరు. కుల ఆధార హింసాయుత సంఘటనలు పెరుగుతున్నాయి. దళితులకు, అణగారిన వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఆర్ఎస్ఎస్, బీజేపీ తిరస్కరిస్తున్నారు.

విద్యారంగం, సాంస్కృతిక సంస్థల ద్వారా కులాన్ని మరింతగా బలోపేతం చేస్తున్నారు. ఇవి తిరోగమన ధోరణులు. ఈ సందర్భంగా డా॥అంబేద్కర్ ఎంతగానో మనసు పెట్టి రచించిన రాజ్యాంగం చాలా ప్రాముఖ్యమైంది. ఆయన దూరదృష్టితో న్యాయం, సమత్వమైన భారత్‌లో ఫ్యూడల్ వ్యవస్థ (భూస్వామ్య వ్యవస్థ)ను పునరుద్ధరించడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. అంబేద్కర్ వారసత్వాన్ని, రాజ్యాంగాన్ని అందులో పొందుపరిచిన హక్కులను పరిరక్షించాలని, సమర్థించాలన్న ప్రాముఖ్యతను భారత కమ్యూనిస్టు పార్టీ గుర్తించింది.

ప్రపంచ వ్యాప్తంగా చూసినా, ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి గెలవడంతో రాజకీయ సవాళ్లు మరో మలుపు తీసుకున్నాయి. ప్రపంచ మితవాద కూటమి ఏర్పడింది. ఆయన అనుకున్నదే చేస్తాడు. మార్చుకునే లక్షణం లేదు. పరిచయం లేని కొత్త వారిని చూస్తే అతి భీతి చెందుతాడు. సంపదను అతిగా ప్రేమించే ఆర్థిక విధానాలను అనుసరిస్తాడు. బహుళత్వ విలువలను సమ్మతించడు. ట్రంప్ ప్రభుత్వానికి ఆర్ఎస్ఎస్-బీజేపీలకు సామీప్యం ఎంతో ఉంది. రెండు శక్తులు తిరోగమన శక్తులు. మితవాదం వైపు ప్రపంచంలో అనేక శక్తులు మళ్లుతున్నందున సామ్రాజ్యవాద ధోరణులు పెరుగుతున్నాయి. ఫలితంగా అభివృద్ధి, సుస్థిరత ఇండియాలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా కుంటుపడుతోంది. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సామ్రాజ్యవాదంపై పోరాడటంలో ముందు పీఠిన ఉన్నది. అలాగే అలీన ఉద్యమం, శాంతి, అంతర్జాతీయ సంఘీభావం ప్రపంచ వ్యాప్తంగా ప్రగతిశీల ఉద్యమాలకు తోడ్పాటుగా ఉన్నది. సామ్రాజ్యవాదం, మితవాద శక్తులపై పోరాటం సాగించాలి. షహీద్ భగత్‌సింగ్ వర్థంతి 2025 మార్చి 23 వ తేదీన, డా॥అంబేద్కర్ పుట్టిన రోజు 2025 ఏప్రిల్ 14వ తేదీన జరుగుతున్నాయి. ఈ తేదీల నుంచి సీపీఐ ముమ్మరమైన రాజకీయ ప్రచారాన్ని నిర్వహిస్తున్నది. గొప్ప జాతీయ ఉద్యమాన్ని, దాని ఆశయాలను ప్రజలకు వివరించేందుకు, ఆర్ఎస్ఎస్- బీజేపీల ఎత్తుగడలను వారి తిరోగమన లక్ష్యాలను ప్రజలకు తెలియజేసేందుకు సీపీఐ ప్రచారాన్ని నిర్వహించనున్నది. ఈ ప్రచారం సందర్భంగా జాతాలు, ర్యాలీలు, సెమినార్‌లు, బహిరంగ సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఈ కార్యక్రమంలో కేవలం రాజకీయ ప్రచారం సాగించటమే కాదు, మన రిపబ్లిక్ కీలకమైన లక్ష్యాలు సోషలిజం, సెక్యులరిజం, సామాజిక న్యాయం, సమానత్వం ఆశయాలను ప్రజలకు తెలియజేయటం జరుగుతుంది. భగత్‌సింగ్ జీవితం ఆయన నిర్వహించిన కార్యకలాపాలు దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాన్ని అర్పించిన గొప్ప ఆశయాన్ని ప్రచారం చేయడం జరుగుతుంది. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటి గొప్ప లక్ష్యాలతో కూడిన రాజ్యాంగాన్ని డా॥అంబేద్కర్ దేశానికి సమర్పించారు. న్యాయం, దేశ పురోగతి కోసం పోరాటం జరిపేందుకు రాజ్యాంగం ఉత్తేజం ఇస్తుంది. చరిత్రలో అత్యంత కీలకమైన సందర్భంలో ఆర్ఎస్ఎస్ ఎజెండాను తిప్పి కొట్టగలమని సీపీఐ విశ్వసిస్తోంది. ఇది తప్పనిసరి లక్ష్యం. ఈ విషయంలో విఫలమైనట్లయితే దేశ బహుళ సామాజిక వ్యవస్థకు తిరుగులేని హాని జరుగుతుంది. పౌరుల ప్రజాస్వామ్య లక్ష్యాలకు నష్టం జరుగుతుంది. పార్టీ ఆశయాలు ప్రజలకు చేరడానికి, మెజారిటీ వాదంతో కలిగే ప్రమాదాన్ని ప్రజలకు వివరించేందుకు సెక్యులర్ విలువల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ప్రచారం నిర్వహించనున్నారు. కొద్దిమంది సంపన్నులకు గాకుండా ప్రజలందరికి ఆర్థిక ప్రయోజనాలను అందించేందుకు, సెక్యులర్ విలువలను పెంపొందించేందుకు ప్రచారం సాగుతుంది.

నేడు జరిగే పోరాటం రాజకీయ పోరాటం కాదు, భారతదేశ ఆత్మను కాపాడేందుకు జరిగే పోరాటం. సోషలిజం, సెక్యులరిజం, సామాజిక న్యాయం, సమానత్వం కేవలం రాజ్యాంగ సూత్రాలు కాదు. భారత్ ఒక రిపబ్లిక్ అనే సారాంశాన్ని ప్రజలకు తెలియజేయాలి. భగత్‌సింగ్, డా॥అంబేద్కర్ వారసత్వాన్ని, వారి ఆశయాలను ప్రజలకు వివరించేందుకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వీధుల్లో తిరిగి ప్రచారం సాగిస్తారు. అన్ని ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు ఈ పోరాటంలో చేరి భారత్ బహుళత్వ, సమ్మిళిత గుర్తింపును పరిరక్షించాలని సీపీఐ పిలుపునిస్తోంది. మన పంథా సవాలును ఎదుర్కొంటోంది. అత్యంత క్లిష్టమైన సవాళ్లను ప్రజల శక్తి ఏ విధంగా సమర్థమంతంగా ఎదుర్కొందో చరిత్ర నిరూపించింది. సమ్మిళిత, పురోగమన భారత్ సాధన కోసం పోరాడేందుకు, ప్రతిఘటించేందుకు న్యాయమైన లక్ష్యాన్ని పెంపొందించేందుకు సిద్ధపడాలి.

గోవా సత్యాగ్రహంలో సీపీఐ

గోవా విమోచనలో సత్యాగ్రహోద్యమం, సీపీఐ పాత్ర భారత చరిత్రలో చెరిపేయలేని అధ్యాయం. ఇందులో కమ్యూనిస్టులు వీరోచితమైన పాత్ర పోషించారు. 1955 నుంచి కమ్యూనిస్టు పార్టీ విడతలు విడతలుగా గోవా సరిహద్దుల్లోకి సత్యాగ్రహులను పంపించింది. కొన్ని సందర్భాలలో ఈ సత్యాగ్రహులు గోవా లోపలికి కూడా ప్రవేశించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత కూడా పోర్చుగీసు వలసవాద పాలనలో ఉన్న గోవాకు స్వాతంత్ర్యం లభించనే లేదు. నిజానికి గోవా విముక్తి కోసం 19వ శతాబ్దంలోనే చిన్న స్థాయిలో ఉద్యమాలు జరిగాయి. ఈ ఉద్యమం 1940 నుంచి 1961 దాకా ఉధృతంగా జరిగింది. గోవా లోపల, వెలుపల కూడా విమోచనోద్యమం జరిగింది. ఈ ఉద్యమంలో అహింసాయుత పోరాటాలు జరిగాయి. విప్లవకర పద్ధతుల్లో పోరాటం సాగింది. దౌత్యపరమయిన ప్రయత్నాలూ జరగకపోలేదు. 1961లో భారత సైన్యాలను గోవాలోకి నడిపిస్తే తప్ప గోవా విముక్తి సాధ్యం కాలేదు.

1510లో పోర్చుగీసు వారు మన దేశంలోని పశ్చిమ ప్రాంతాలైన భూభాగాల మీద పెత్తనం చెలాయించి వలసవాదాన్ని కొనసాగించారు. దేశం కొన్ని తూర్పు ప్రాంతాలలోనూ పోర్చుగీసుల వలస పాలన కొనసాగింది. 19వ శతాబ్దం చివరి నాటికి కూడా గోవా, డయ్యూ, దామన్, నగర్ హవేలీ, దాద్రా, అంజెదివా దీవుల్లో మాత్రం పోర్చుగీసు పాలన కొనసాగింది. పింటోలు గోవాలో పోర్చుగీసు పాలనను తీవ్రంగా వ్యతిరేకించారు. పోర్చుగీసులకు వ్యతిరేకంగా స్థానికంగా 14 తిరుగుబాట్లు జరిగాయి. పింటోలు ఆఖరి సారి 1912లో గోవా విమోచన కోసం పోరాడారు. కానీ ఈ ప్రయత్నాలేవీ సఫలం కాలేదు. దీనికి ప్రధానమైన కారణం ఎక్కువ మంది గోవా ప్రజలు తాము పోర్చుగీసు పాలనలోనే సుఖంగా ఉన్నామనుకున్నారు. పోర్చుగీసు చట్టాలు గోవా ప్రజలను పోర్చుగీసు పౌరులతో పాటు సమానంగా పరిగణించడం

కూడా ఒక కారణం. లేకపోతే వారు బ్రిటిష్ ఇండియాలో భాగం అయిపోవాల్సి వచ్చేది.

1787లో కూడా పింటోలు పోర్చుగీసు పాలనను పడదోసేందుకు ప్రయత్నించారు. పోర్చుగీసు పాలకులు స్థానికులపట్ల వివక్ష ప్రదర్శించడం ఈ తిరుగుబాటుకు కారణం. అప్పుడు గోవా ప్రజలకు పోర్చుగీసులతో సమానమైన హక్కులు ఇచ్చేవారు కాదు. ఇగ్నాసియో పింటో నాయకత్వంలో స్వయం పాలన నెలకొల్పడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. దీనికోసం టిప్పుసుల్తాన్ మద్దతు కూడా తీసుకున్నారు. 1910లో పోర్చుగీసు రాచరికం రద్దు అయినప్పుడైనా గోవా ప్రజలకు స్వేచ్ఛ లభిస్తుందనుకుంటే అదీ జరగలేదు. పోర్చుగీసు వలస పాలన అంతం కాకపోవడంవల్ల వలసవాద వ్యతిరేక ఉద్యమం మొదలైంది. లూయీ డి మెంజెస్ బ్రగాంచ ఓ హెరాల్డో అన్న మొదటి పోర్చుగీసు భాషలో పత్రిక ప్రారంభించి వలసవాద వ్యతిరేక ఉద్యమాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చారు. 1940 నాటికి గోవా స్వాతంత్ర్యోద్యమం ఊపందుకుంది. దీనికి భారత జాతీయోద్యమం స్ఫూర్తినిచ్చింది. భారత్‌కు స్వాతంత్ర్యం ఇచ్చేస్తామని బ్రిటిష్ వారు 1946లో ప్రకటించిన తరవాత గోవా విమోచనోద్యమం మరింత తీవ్రమైంది. ఆ సమయంలోనే భారత నాయకులు గోవా విమోచన మీద మరింత దృష్టి సారించారు. గోవా ప్రజలు భారత యూనియన్‌లో చేరాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు.

దేశం స్వతంత్రం అయినా గోవాకు మాత్రం విముక్తి లభించలేదు. దేశ విభజన, స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనే పాకిస్థాన్ మనతో యుద్ధానికి తలపడడం వల్ల కూడా గోవా విమోచనోద్యమం చల్లబడింది. కొన్నాళ్ల తరవాత గోవాలో రెండు విధాలుగా వలసవాద వ్యతిరేక భావాలు పుంజుకున్నాయి. గోవా నేషనల్ కాంగ్రెస్ అహింసాయుత పద్ధతిని ఎన్నుకుని సత్యాగ్రహం బాట పట్టింది. అజాద్ గోమంతక్ దళ్ విప్లవ పద్ధతులను అనుసరించాలనేది. 1954 ఆగస్టు 15న భారీ స్థాయిలో సత్యాగ్రహం మొదలైంది. ఉద్యమం అహింసాయుత పద్ధతుల్లో మొదలైనా పోర్చుగీసు పాలకులు సత్యాగ్రహుల మీద దాడి చేశారు.

1955 మధ్యలో సీపీఐ విడతల వారీగా గోవాలోకి సత్యాగ్రహులను పంపాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా సత్యాగ్రహంలో పాల్గొనే వారి జాబితాలు తయారు చేసింది. కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో సాగిన సత్యాగ్రహం నిరుపమానమైంది. సత్యాగ్రహులు బృందాలుగా ఏర్పడి గోవా సరిహద్దులు దాటి లోపలికి వెళ్లాలని ప్రయత్నించారు. ఈ సత్యాగ్రహుల మీద పోర్చుగీసు పాలకులు అమానుషంగా ప్రవర్తించారు. సత్యాగ్రహులను జైళ్లకు పంపించారు. కొందరినైతే పోర్చుగల్ లోని జైళ్లకూ పంపారు. వారిని ఘోరంగా హింసించారు. ఈ బాధలన్నీ ఎదుర్కొన్న వారిలో కమ్యూనిస్టులు భారీ సంఖ్యలో ఉన్నారు.

స్టాలిన్‌ను 'అప్పా' అంటే తప్పేంటి: జస్టిస్ చంద్రు

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను విద్యార్థినీ, విద్యార్థులు 'అప్పా' (నాన్నా) అని పిలిస్తే తప్పేంటి అని మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రు ప్రశ్నించారు. చెన్నైలో స్టాలిన్ జన్మదిన వేడుకల సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న పిల్లలకు ఉదయం అల్పాహార పథకం అమలు చేయాలని గతంలో తాను ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశానని, వారంతా నిధుల కొరత పేరుతో, నిధులు సమకూర్చినా అమలు కష్టసాధ్యమనే సాకుతో పట్టించుకోలేదని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు బడి పిల్లలకు ఉదయం అల్పాహార పథకాన్ని స్టాలిన్ సమర్థవంతంగా అమలు చేసి అన్నివర్గాల ప్రశంసలు అందుకున్నారని చెప్పారు. ఉదయం అల్పాహారంతో తమ ఆకలి తీర్చుతున్నందుకు బడిపిల్లలు, తమ ఉన్నత చదువులకు ప్రతినెలా తమ బ్యాంక్ ఖాతాలలో నగదు జమ చేస్తున్నందుకు కాలేజీ విద్యార్థులు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను అప్పా (నాన్నా) అని పిలవటం సమంజసమేనని చంద్రు అన్నారు. కొంతమంది నేతలకు అప్పా అనే పిలుపు వింటేనే మంటగా ఉందని, ఇలాంటి నేతలు స్టాలిన్‌ను ఏ విధంగా సంబోధించినా పరవాలేదని జస్టిస్ చంద్రు పేర్కొన్నారు. భావిభారత పౌరులైన విద్యార్థులు తమకు నచ్చిన విధంగా సంబోధించడాన్ని ఎవరూ అడ్డుకోకూడదని చెప్పారు.

యూట్యూబర్‌గా వచ్చారు

రాహుల్ ధారావి పర్యటనపై సంజయ్ నిరుపమ్ విమర్శ

ముంబై: 'రాహుల్ గాంధీ ముంబైకి కాంగ్రెస్ నాయకుడిగా రాలేదు. ఓ యూట్యూబర్‌గా వచ్చి ధారావిని సందర్శించారు. అక్కడ వీడియోలు తీసుకొని వెళ్లిపోయారు' అంటూ శివ సేన నాయకుడు సంజయ్ నిరుపమ్ వ్యాఖ్యానించారు. ముంబై కాంగ్రెస్ పార్టీ దివాలా తీసే పరిస్థితిలో ఉన్నప్పటికీ స్థానిక నేతలను కలవకుండానే రాహుల్ తిరిగి వెళ్లిపోయారంటూ తీవ్ర స్థాయిలో విమర్శించారు. 'ముంబై కాంగ్రెస్ పరిస్థితి మరింత దిగజారిపోతోంది. అయితే, కాంగ్రెస్ నాయకుడు మాత్రం వీడియోలు తీయడంలో బిజీగా ఉన్నారు. ముంబై కాంగ్రెస్ పార్టీ ఓట్ల ద్వారానే కాదు... డబ్బు ద్వారా కూడా దివాలా తీసింది. ముంబై కాంగ్రెస్ కార్యాలయం చాలా నెలలుగా అద్దె కూడా చెల్లించట్లేదు. రూ.ఐదు లక్షల విద్యుత్ బిల్లు కూడా చెల్లించాల్సి ఉంది' అని తెలిపారు. కాగా, ముంబైలోని ధారావిలో రాహుల్ గాంధీ రెండు రోజుల క్రితం పర్యటించారు. అక్కడి తోలు పరిశ్రమ కార్మికులను కలుసుకున్నారు. స్థానిక పరిశ్రమలను సందర్శించి కార్మికులతో ముచ్చటించారు.

వర్సిటీలో చపాతీలపై వివాదం... విద్యార్థుల మధ్య ఘర్షణ

బెంగళూరు: కలబురగిలోని కర్నాటక సెంట్రల్ యూనివర్సిటీలో చపాతీల తయారీపై రెండు గ్రూపుల మధ్య వివాదం తలెత్తింది. ఇది విద్యార్థుల మధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో స్టూడెంట్స్ కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. క్యాంపస్‌లోని మెస్‌లో శుక్రవారం రాత్రి మెషిన్ తయారీ చపాతీలు కావాలని ఉత్తర భారత విద్యార్థులు డిమాండ్ చేశారు. అయితే చేతితో తయారు చేసిన చపాతీలు కావాలని దక్షిణ భారత విద్యార్థులు పట్టుబట్టారు. కాగా, ఈ వాగ్వాదం ముదరడంతో స్టూడెంట్ గ్రూపుల మధ్య ఘర్షణగా మారింది. ఈ కొట్లాటలో ఒక విద్యార్థి గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. మరోవైపు వర్సిటీ రిజిస్ట్రార్ ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రన్యారావు ఒంటిపై గాయాలు: డీఆర్ఐ

బెంగళూరు: బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టైన నటి రన్యారావు వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. కేసు విచారణలో భాగంగా నిందితురాలు గురించి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) సంచలన విషయాలు బయటపెట్టింది. రన్యారావు శరీరంపై అనేకచోట్ల గాయాలున్నాయని పేర్కొంది. రన్యారావు... వీఐపీ ప్రోటోకాల్స్‌ను దుర్వినియోగం చేస్తూ ఓ సిండికేట్ ముఠా బంగారం దందాలో భాగమైనట్లు గుర్తించామని డీఆర్ఐ తెలిపింది. ఆమె శరీరంపై చాలాచోట్ల గాయాలున్నాయని పేర్కొంది. అయితే దుబాయ్ వెళ్లడానికి చాలాకాలం ముందే తనకు ఈ గాయాలు అయ్యాయని నటి ఏజెన్సీకి తెలియజేసింది. దీంతో అవసరమైన వైద్య సాయం అందించాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది. నిందితురాలు దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరించడం లేదని డీఆర్ఐ కోర్టుకు తెలిపింది. శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టగానే న్యాయమూర్తి ముందు నటి కంటతడి పెట్టుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఇదిలాఉండగా ఈ కేసుకు సంబంధించి మూడు రోజులపాటు విచారించేందుకు డీఆర్ఐకు అనుమతిస్తూ సంబంధిత న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. రన్యారావు నుంచి డీఆర్ఐ అధికారులు ఇప్పటికే 14.2 కిలోల బంగారు బిస్కెట్లు, సుమారు రూ.2.06 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.2.67 కోట్ల నగదు జప్తు చేసుకున్నారు. గత ఆరు నెలల్లో ఆమె 27 సార్లు దుబాయ్‌కు వెళ్లి వచ్చిందని, దాంతోపాటు సౌదీ అరేబియా, అమెరికా, పశ్చిమాసియా, ఐరోపా దేశాలకూ ఆమె ప్రయాణించినట్లు డీఆర్ఐ అధికారులు తాజా విచారణలో గుర్తించారు. మరోవైపు సంఘవిద్రోహ శక్తులతో ఆమెకు సంబంధాలు ఉన్నాయని ప్రాథమిక విచారణలో గుర్తించిన అధికారులు... ఆ దిశగా విచారిస్తున్నారు.

మహిళలకు రూ.2,500 సాయం

ఢిల్లీ కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: దేశరాజధానిలోని మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం అందించే 'మహిళా సమృద్ధి యోజన' పథకానికి ఢిల్లీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేఖా గుప్తా శనివారం ప్రకటించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బీజేపీ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని చెప్పారు. మహిళా సంక్షేమం, మహిళా భద్రతకు తాను పనిచేస్తానని భరోసా ఇచ్చారు. ఢిల్లీలో పింక్ టాయిలెట్లు నిర్మిస్తామని ప్రకటించారు. 'ఈరోజు మహిళా దినోత్సవం. మహిళలకు రూ.2,500 సాయం అందిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీపై ఈరోజు మంత్రివర్గం సమావేశమైంది. ఇందుకు సంబంధించిన పథకాన్ని ఆమోదించింది' అని రేఖాగుప్తా తెలిపారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.5,100 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. తన సారథ్యంలో ఒక కమిటీ ఏర్పాటు కానుందని, త్వరలోనే ఈ పథకం రిజిస్ట్రేషన్ ఉంటుందని, ఇందుకు సంబంధించిన పోర్టల్‌ను ప్రారంభిస్తామని చెప్పారు.

మోదీ హామీ ఓ జుమ్లా: ఆతిశీ

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని మాజీ సీఎం, ఆప్ నేత ఆతిశీ విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముందే రూ.2,500 బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని మహిళలకు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ హామీ అంటే ఓ జుమ్లా అని ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం రుజువు చేసిందని దుయ్యబట్టారు. ఓటర్లను మభ్యపెట్టేడమే కాషాయ పార్టీకి తెలిసిందని ఆతిశీ ఎద్దేవా చేశారు. ఆమె శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంపై విరుచుపడ్డారు. 'ఢిల్లీ మహిళలు తమ ఫోన్లు పట్టుకొని మీర్చే రూ.2,500 కోసం వేచి చూస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. మోదీ ఇచ్చిన హామీలన్నీ డొల్ల మాటలని మరోమారు రుజువు అయిందన్నారు. ఈ హామీలానే మిగతావన్నీ నీటి మూటలే అని ఆతిశీ విమర్శించారు. ఇదిలావుంటే, మహిళా సమృద్ధి యోజన కోసం రూ.5,100 కోట్లను రాష్ట్ర కేబినెట్ మంజూరు చేసిందని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రకటించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇచ్చే ఈ పథకం కోసం కేటాయింపులను అధికారంలోకి వచ్చిన తర్వాత జరిపే తొలి కేబినెట్‌లో ఆమోదిస్తామని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు మోదీ హామీనిచ్చారు. మార్చి 8 (మహిళా దినోత్సవం) నాటికి మహిళల ఖాతాల్లోకి డబ్బు జమ చేస్తామని చెప్పారు.

మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు

- కేంద్రం 'స్వేచ్ఛాయుత ఉద్యమం' అడ్డుకున్న కుకీలు
- ఎంఎస్‌టీ బస్సులపై దాడి
- మహిళలపై విరుచుపడిన భద్రతా బలగాలు

ఇంఫాల్: మణిపూర్‌లో ఘర్షణలు మళ్లీ చెలరేగాయి. 'స్వేచ్ఛా ఉద్యమం' ప్రారంభమైన మొదటి రోజే భద్రతా దళాలతో కుకీ నిరసనకారులు ఘర్షణ పడ్డారు. కాంగ్‌పోక్పిలో పౌరుల బస్సుపై ఒక గుంపు దాడి చేయడంతో తాజాగా హింస చెలరేగింది. ప్రత్యేక పరిపాలన కోసం డిమాండ్ చేస్తున్న కుకీ తెగల నిరసన మధ్య భద్రతా దళాల రక్షణలో ఉన్న పౌర బస్సులు శనివారం మణిపూర్‌లోని జిల్లాలలో తిరిగి ప్రయాణాలు ప్రారంభించాయి. అయితే రాష్ట్ర రాజధాని ఇంఫాల్ నుంచి 45 కి.మీ దూరంలో ఉన్న కాంగ్‌పోక్పి జిల్లాలో నిరసనకారులు రహదారులు దిగ్బంధించారు. భద్రతా దళాలు లాఠీచార్జి చేయడంతో కుకీ తెగకు చెందిన అనేక మంది మహిళలు గాయపడ్డారు. ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ రాజీనామా తర్వాత రాష్ట్రపతి పాలనలోకి వచ్చిన రాష్ట్రంలో ఎక్కడా రోడ్డు దిగ్బంధనాలు ఉండకూడదని కేంద్రం ప్రకటించింది. అయినప్పటికీ, మణిపూర్‌లోని అనేక కుకీ ఆధిపత్య ప్రాంతాలలో ఘర్షణలు చోటుచేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ప్రత్యేక పరిపాలన కోసం తమ డిమాండ్ నెరవేరే వరకు స్వేచ్ఛాయుతంగా తిరగకూడదని కోరుకునే కుకీ తెగలు బస్సుపై దాడి చేసినట్లు పీటీఐ నివేదిక తెలిపింది. నిరసనకారులు వాహనాలపై రాళ్లు రువ్వడం, రోడ్లు తవ్వడం, టైర్లు తగలబెట్టడం, బారికేడ్లు వేసిన దృశ్యాలు కనిపించాయి. నిరసనకారులు కొందరు భద్రతా దళాలను దుర్భాషలాడుతూ వెనక్కి వెళ్లిపోవాలంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో నిరసనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళ సభ్యులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ఇంఫాల్‌లో సమాఖ్య పౌర సమాజ సంస్థల (ఎఫ్‌వోసీఎస్) సభ్యులు శాంతి, సాధారణ స్థితి కోసం వాదిస్తూ సేనాపతి వైపు శాంతి ర్యాలీ నిర్వహించడానికి ప్రయత్నించారు. అధికారిక అనుమతి లేకపోవడాన్ని పేర్కొంటూ భద్రతా దళాలు చింగ్‌మెయిరోంగ్ మావో మార్కెట్ వద్ద ర్యాలీని నిలిపివేశారు. ప్రైవేట్ వాహనాలకు బదులుగా ఎంఎస్‌టీ బస్సులు ఎక్కాలని అధికారులు నిరసనకారులకు సూచించారు. దీంతో భద్రతా దళ సభ్యులు, ఎఫ్‌వోసీఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు వేర్వేరు కార్యకలాపాలలో నాలుగు నిషేధిత సంస్థలకు చెందిన ఏడుగురిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భద్రతా దళాలు 114 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి బిష్ణుపూర్, సేనాపతి, తౌబాల్, జిరిబామ్, చందేల్, చురాచంద్‌పూర్, కాంగ్‌పోక్పి, ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమం సహా కొండ, లోయ జిల్లాలలో ఈ ఆపరేషన్లు జరిగాయి. మణిపూర్‌లోని కొన్ని కొండ ప్రాంతాలలో ఆధిపత్యం చెలాయించే లోయ-ఆధిపత్య మైతేయి వర్గం, కుకీ అనే పిలువబడే డజనుకు పైగా విభిన్న తెగలు మే 2023 నుంచి భూమి హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అనేక అంశాలపై పోరాడుతున్నాయి. గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న హింసలో 250 మందికి పైగా మరణించగా, దాదాపు 50 వేల మంది నిరాశ్రయులయ్యారు. కార్యకలాపాల సస్పెన్షన్ ఒప్పందంపై సంతకం చేసిన కుకీ నాయకులు దాదాపు రెండు డజన్ల మిలిటెంట్ గ్రూపులు, వారి ప్రధాన పౌర సంస్థలు మణిపూర్ అంతటా సమాజ సభ్యులు స్వేచ్ఛగా తిరగడానికి అనుమతించే ముందు కేంద్రాన్ని ప్రత్యేక పరిపాలన ఇవ్వాలని డిమాండ్ చేశాయి.

ట్రంప్ సుంకాల తగ్గింపు వాదనలు

కేంద్రం దేనిని అంగీకరించింది?

మోదీ సర్కార్‌ను నిలదీసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: భారతదేశం తన సుంకాలను తగ్గించడానికి అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలపై పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోవాలని కాంగ్రెస్ శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరింది. భారత రైతులు, తయారీదారుల ప్రయోజనాలకు రాజీ పడుతున్నారా అని ప్రతిపక్ష పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ ప్రశ్నించారు. 'వాణిజ్య మంత్రి పీయూశ్ గోయెల్ అమెరికన్లతో వాణిజ్యం గురించి మాట్లాడటానికి వాషింగ్టన్ డీసీలో ఉన్నారు. ఇంతలో అధ్యక్షుడు ట్రంప్ ఇలా అంటున్నారు...' అని ఆయన 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో అమెరికా అధ్యక్షుడు వాణిజ్య సుంకాలపై మాట్లాడుతున్న వీడియోను ట్యాగ్ చేస్తూ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ భారతదేశం తన సుంకాలను తగ్గించడానికి అంగీకరించిందని, తద్వారా అక్కడ ఉత్పత్తులను అమ్మడం కష్టతరం చేస్తుందని తన వాదనను పునరుద్ఘాటించారు. జైరాం రమేశ్ మాట్లాడుతూ 'మోదీ ప్రభుత్వం దేనిని అంగీకరించింది? భారత రైతులు, భారత తయారీదారుల విషయంలో రాజీ పడుతున్నారా? మార్చి 10న పార్లమెంటు తిరిగి ప్రారంభమైనప్పుడు ప్రధాని తప్పనిసరిగా విశ్వాసంలోకి తీసుకోవాలి' అని కోరారు. బడ్జెట్ సమావేశాల రెండవ భాగం తిరిగి ప్రారంభమైనందున పార్లమెంటు ఉభయ సభలు సోమవారం సమావేశమవుతాయి. కాగా, ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అనేక దేశాలను పరస్పర వాణిజ్య సుంకాలతో బెదిరిస్తున్నారు.

గుప్తనిధుల కోసం వేట

చీకటిపడితే తవ్వకాలు... 'ఛావా' సినిమా ప్రభావం

భోపాల్: సినిమా ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో అనే దానికి మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్ అసిర్‌గఢ్ కోట అద్దం పడుతుంది. బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ నటించిన 'ఛావా' చిత్రంలో ఇక్కడ బంగారం గనులున్నాయంటూ చెప్పడం గుప్త నిధుల ప్రచారానికి ఊపందుకుంది. వివరాల్లోకి వెళితే... జాతీయ రహదారుల పనుల్లో భాగంగా దర్గా సమీపంలో ఎక్స్‌కవేటర్ సాయంతో ఇటీవల మట్టి తవ్వకాలు చేపట్టారు. ఆ మట్టిని కోట సమీపంలో ఓ పొలంలో పారబోశారు. ఆ మట్టిలో స్థానిక కూలీలు పురాతన నాణేలను గుర్తించారు. వాటిని మొఘలుల కాలం నాటి బంగారం, వెండి నాణేలుగా కొందరు ప్రచారం చేశారు. ఆ ప్రచారం కాస్తా ఆ నోటా ఈ నోటా పాకి గుప్త నిధులు ఉన్నాయన్న ప్రచారం దానావలంలా వ్యాపించింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గుప్తనిధుల వేట మొదలు పెట్టారు. చీకటిపడితే చాలు చుట్టు పక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. తవ్వకాలు జరుపుతున్నారు. కొంతమందికి నాణేలు దొరకుతున్నాయి. రోజు రోజుకూ వీరి సంఖ్య పెరుగుతోంది. ఎవరికి వారు తమకు దొరికాయంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పట్వారీకి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని స్థానికుడు ఒకరు వాపోయారు. మొఘలుల కాలంలో బుర్హాన్‌పూర్ సంపన్న నగరాల్లో ఒకటని చరిత్రకారులు పేర్కొంటున్నారు. యుద్ధ సమయాల్లో స్థానికులు తమ సంపదను భద్రంగా పూడ్చిపెట్టేవారని చెబుతున్నారు. ఈ కారణం వల్లే ఎవరైనా తవ్వకాలు జరిపితే నాణేలు దొరికే అవకాశం లేకపోలేదని పేర్కొంటున్నారు. అదే సమయంలో అనధికారిక తవ్వకాల వల్ల విలువైన చారిత్రక సంపదకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసు యంత్రాంగం అనధికారిక తవ్వకాలపై తాజాగా దృష్టి సారించింది. తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని బుర్హాన్‌పూర్ ఎస్పీ వెల్లడించారు.

'ఛావా' చిత్రంలో మొఘలుల కాలంలో ఈ ప్రాంతం ఛత్రపతి శంభాజీ మహారాజుకు మిలటరీ క్యాంప్‌గా ఉండేదని, బంగారం గనులు ఉండేవని పేర్కొనడం దీనికి మరింత బలం చేకూరింది.

నేనే అత్యంత ధనవంతుడిని: మోదీ

అహ్మదాబాద్: మహిళ భద్రతకు తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. అత్యాచారం వంటి క్రూరమైన నేరాల్లో మరణశిక్ష విధించేలా చట్టాలు సవరించామన్నారు. కోట్లాది మంది తల్లులు, సోదరీమణుల ఆశీర్వాదం కలిగిన తాను ప్రపంచంలోనే అత్యంత ధనికుడినని మోదీ చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని నవసారిలో శనివారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. మహిళల నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. 'ఒక అమ్మాయి ఆలస్యంగా ఇంటికి వస్తే తల్లిదండ్రులు ఆమెను ప్రశ్నిస్తారు. కానీ, అబ్బాయిల విషయంలో మాత్రం అలా జరగదు. కానీ, వారిని కూడా ప్రశ్నించాలి. గడిచిన దశాబ్దంలో మహిళల భద్రత, మహిళలపై జరుగుతోన్న నేరాలను అరికట్టేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాం. నిబంధనలు, చట్టాలు మార్చాం. అత్యాచారం వంటి తీవ్రమైన నేరాల్లో మరణశిక్ష విధించేలా చట్టాలు సవరించాం' అని ప్రధాని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు మరింత సాధికారత కల్పించాల్సిన అవసరం ఉందని మోదీ ఉద్ఘాటించారు. దేశం ఆత్మ గ్రామాల్లో ఉందని గాంధీజీ చెప్పిన మాటను గుర్తు చేసిన ఆయన... మహిళలు మన గ్రామీణ ప్రాంతాలకు ఆత్మగా దానికి జత చేయాలనుకుంటున్నానని చెప్పారు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా చట్టం తీసుకువచ్చి లక్షల మంది ముస్లిం మహిళల జీవితాలు నాశనం కాకుండా కాపాడామన్నారు. మహిళల సారథ్యంలోని ఎన్నో సంస్థలు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు.

మహిళలకు మోదీ శుభాకాంక్షలు

కాగా, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నారీశక్తికి వందనం అంటూ దేశంలోని మహిళలకు ప్రధాని శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ అభివృద్ధి పథకాల ద్వారా ఎన్డీయే ప్రభుత్వం మహిళా సాధికారికతకు కృషి చేస్తోందని వెల్లడించారు. ఈరోజు తన సోషల్ మీడియా ఖాతాలను మహిళలే నిర్వహిస్తున్నారని తెలిపారు. దానికి తగట్టుగానే మోదీ ఎక్స్ ఖాతా నుంచి చెస్ క్రీడాకారిణి ఆర్.వైశాలి వరుస పోస్టులు పెట్టారు. 'నేను వైశాలి. మహిళా దినోత్సవం రోజున ప్రధాని సోషల్ మీడియా ఖాతా నుంచి నేను పోస్టు చేయడం ఆశ్చర్యంగా ఉంది. నేనొక చెస్ ప్లేయర్. ఎన్నో టోర్నీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా అనిపిస్తుంటుంది. ఆరో ఏట నుంచి నేను చెస్ ఆడుతున్నాను. ఆడపిల్లలకు అండగా నిలవాలని తల్లిదండ్రులు, తోబుట్టువులను కోరుతున్నాను' అని రాసుకొచ్చారు. తర్వాత న్యూక్లియర్, స్పేస్ సైంటిస్టులు అయిన ఎలినా మిశ్రా, శిల్పి సోనీ... మోదీ ఖాతా నుంచి పోస్టులు పెట్టారు. ఇంకా అనేకమంది మహిళలు మోదీ ఖాతా నుంచి పోస్టులు పెట్టారు.

ఇజ్రాయిల్, భారతీయ యువతులపై అత్యాచారం

బెంగళూరు: కర్నాటకలో సామూహిక అత్యాచార ఉదంతం కలకలం రేపుతోంది. రాత్రి సమయంలో స్టార్ గేజింగ్‌కు (ఆకాశంలో నక్షత్రాలను చూస్తూ గడపడం) వెళ్లిన ఓ ఇజ్రాయిల్ యువతి (27), ఆమెతో పాటు ఉన్న మరో భారతీయ యువతి(29)పై గుర్తు తెలియని వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. యువతుల వెంట ఉన్న ముగ్గురు పురుషులను సరస్సులోకి తోసి యువతులపై దారుణానికి తెగబడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి... నిందితుల కోసం గాలిస్తున్నారు. హంపీకి కొద్ది దూరంలోని ప్రముఖ టూరిస్టు స్పాట్ సానాపూర్ సరస్సు వద్ద గురువారం రాత్రి ఈ దారుణం జరిగింది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమెరికా, మహారాష్ట్ర, ఒడిశాకు చెందిన ముగ్గురు పురుషులు, ఇజ్రాయిల్ యువతి, మరో భారతీయ యువతి కలిసి సానాపూర్ సరస్సు వద్దకు వెళ్లారు. రాత్రి సుమారు 11 గంటల సమయంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు పెట్రోల్ బంకుకు దారి ఎటు అని వారిని ప్రశ్నించారు. అక్కడ సమీపంలో పెట్రోల్ బంక్ ఏదీ లేదని భారతీయ యువతి చెప్పాక ఆగంతుకులు వారిని డబ్బులు ఇవ్వమని డిమాండ్ చేశారు. ఇందుకు టూరిస్టులు తిరస్కరించడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో నిందితులు వారిపై దాడికి దిగారు. అమెరికాకు చెందిన డానియల్, మహారాష్ట్రకు చెందిన పంకజ్, ఒడిశాకు చెందిన దేబాస్‌ను సరస్సులోకి తోశారు. ఆ తరువాత నిందితుల్లో ఇద్దరు యువతులపై అత్యాచారానికి పాల్పడ్డారు. పంకజ్, డానియల్ బయటకు రాగలిగినా ఒడిశా వ్యక్తి మాత్రం నీటిలో పడి మృతి చెందారు. అతడి మృతదేహాన్ని అధికారులు మరుసటి రోజు గుర్తించారు. బాధిత యువతులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భారతీయ యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులు తెలుగు, కన్నడలో మాట్లాడినట్టు వెల్లడించారు. బలవంతపు వసూళ్లు, అత్యాచారం, హత్యాయత్నం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు.

మహిళా సంక్షేమంపై మీ నిబద్ధత ఏమిటి: తేజస్వి

పాట్నా: బీహార్‌లో మహిళలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని, వారి బాధలకు ఎవరిని బాధ్యుల్ని చేస్తారని ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌ను ఆర్‌జేడీ నేత తేజస్వీయాదవ్ సూటిగా ప్రశ్నించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి నిబద్ధత ఏమిటని ఆయన నిలదీశారు. 'బీహార్‌లో 63 శాతం గర్భిణీలు పోషకాహారలోపంతో, రక్తహీనతతో బాధపడుతున్నారు. దేశంలో ప్రసూతి మరణాల రాష్ట్రాల్లో బీహార్ 118వ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో రొమ్ము, గర్భాశయ కేన్సర్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇప్పటికీ రాష్ట్రంలో 59 శాతం మహిళలు మాత్రమే రుతుక్రమ ఉత్పత్తులు (శానిటరీ ప్యాడ్స్)ను ఉపయోగిస్తున్నారని ఆరోగ్య మంత్రిత్వశాఖ గణాంకాలే చెబుతున్నాయి.

మహిళా సిబ్బందితో వందేభారత్ రైలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సెంట్రల్ రైల్వే మొదటిసారిగా పూర్తిగా మహిళా సిబ్బందితో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపింది. సీఎస్ఎంటీ-షిర్డీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో శనివారం పూర్తిగా మహిళా సిబ్బంది ఉన్నారు. వీరిలో లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ సహా అందరూ మహిళలే. సెంట్రల్ రైల్వేస్ ఇదే విషయాన్ని అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేస్తూ... ఈ క్షణాలు అత్యంత గర్వకారణం, చారిత్రాత్మకమని అభివర్ణించింది. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు సీఎస్ఎంటీ నుండి బయలుదేరిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను మొదటిసారిగా పూర్తిగా మహిళా సిబ్బంది నడిపారు. లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్, రైలు మేనేజర్, టికెట్ ఎగ్జామినర్లు, రైలు మేనేజర్, రైలు హోస్టెస్, ఆన్-బోర్డ్ క్యాటరింగ్ ఇలా అంతా మహిళలే. భారతీయ రైల్వేలో మహిళల బలం, అంకితభావం, నాయకత్వాన్ని తెలియజెప్పే ఈ రోజు మాకు గర్వించదగ్గ క్షణం' అని సెంట్రల్ రైల్వేస్ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నది. సెంట్రల్ రైల్వే ప్యాసింజర్ రైలు మేనేజర్ శ్వేతా ఘోష్ మాట్లాడుతూ 'ఇది మాకు గర్వకారణమైన క్షణం. ప్రసవవేదనే భరించగలిగిన ఒక స్త్రీకి కష్టతరమైన పనంటూ ఏది ఉండదని నా అభిప్రాయం. ఆమె చేయలేనిదంటూ ఏముంది? సమాజం ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఒక స్త్రీ తన సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం లభిస్తే... అలాంటి మహిళ తన మొత్తం కుటుంబాన్ని సమర్థులైన వ్యక్తులుగా మార్చగలదు. ప్రతి స్త్రీ ఇలాగే జీవితంలో ఎదగగలిగితే... మన దేశం ఎందుకు అభివృద్ధి చెందదు' అని అన్నారు.

భాష గురించి అడిగితే ఈడీతో దాడులా

ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

చెన్నై: త్రిభాషా విధానంపై తాము నిలదీస్తున్నందుకే ఈడీ దాడులు చేయిస్తున్నారని, రాష్ట్రంలో పెరుగుతున్న అసంతృప్తి దిశ మార్చేందుకు టాస్మాక్ కార్యాలయాలు, గోడౌన్లలో ఈడీ దాడులు జరుగుతున్నాయని తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, అందిస్తున్న సంక్షేమ సహాయాలపై ఉదయనిధి జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. తిరువారూరు మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమై... శాఖల వారీగా చేపట్టిన కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉదయనిధి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా ముఖ్యమంత్రి స్టాలిన్ సూచన మేరకు నలుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటుచేశామన్నారు. ఈ కమిటీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకుంటోందని, కమిటీ నివేదిక అందిన తర్వాత వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. త్రిభాషా విధానం అమలుచేయాలని నిర్బంధం, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపులో పక్షపాతం తదితరాలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. 'నీట్'కు వ్యతిరేకంగా డీఎంకే సంతకాలు సేకరించిన సమయంలో విద్యార్థులు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేశారన్నారు. పాఠశాల విద్యార్థుల వద్ద సంతకాలు సేకరించలేదని తెలిపారు. ప్రస్తుతం త్రిభాషా విధానానికి మద్దతుగా బీజేపీ చేపట్టిన సంతకాల సేకరణకు పాఠశాల విద్యార్థులను కూడా బలవంతం చేస్తున్నారన్నారు. అలాంటి చర్యలు విడనాడాలని హితవు పలికారు. ఇప్పటికే బీజేపీ 'మిస్డ్ కాల్'తో కోటి సభ్యులను చేర్చినట్లు ప్రకటించిందని, ప్రస్తుతం చేపట్టిన సంతకాల సేకరణ కూడా తాము అలాగే చూస్తున్నామని ఉదయనిధి తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సంపద, వనరులు అందని వర్గాలను విశ్లేషణ చేయండి

స్వతంత్ర, మేధావుల కమిటీని కోరిన డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ (ఆర్థిక, రాజకీయ, విద్య, సామాజిక, న్యాయ) సర్వే ఆధారంగా చేసుకుని వచ్చిన సమాచారాన్ని, అంకెలు, సంఖ్యల ఆధారంగా సర్వే నివేదికను సంపూర్ణంగా అధ్యయనం చేయాలని స్వతంత్ర, మేధావుల కమిటీని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. సర్వే సమాచారం మేరకు ఏ వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా తరతరాలుగా వెనుకబడి ఉన్నాయో, రాష్ట్ర వనరులు అందుబాటులో లేకుండా, ఈ వర్గాలు దూరంగా ఉన్నాయో సమాజంలో అన్ని వర్గాల వారీగా విశ్లేషణ చేసి నెల రోజుల వ్యవధిలో నివేదిక అందజేయాలని కమిటీని కోరారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి చైర్మన్‌గా, ప్రొఫెసర్ కంచ ఐలయ్య వైస్ చైర్మన్‌గా, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్‌గా, ప్రొఫెసర్ సుఖదేవు తొరట్, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ప్రొఫెసర్ శాంత సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, ప్రొఫెసర్ భూక్య భంగ్యా, ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్‌లతో స్వతంత్ర హోదా కలిగిన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ (టిడబ్ల్యూజేఎఫ్) తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్‌కుమార్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మిద్దెల సత్యనారాయణ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు వాకిటి అశోక్ ప్రధాన కార్యదర్శి గోపాల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ హయంలో కూడా గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్న జర్నలిస్టుల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని జర్నలిస్టులు అక్రిడేషన్ కార్డుల హెల్త్ కార్డుల ఇళ్ల స్థలాలు పెన్షన్ మహిళా జర్నలిస్టులకు రాత్రి పూట రవాణా సౌకర్యం జర్నలిస్టుల రక్షణకై ప్రత్యేక చట్టం తీసుకురావాలనీ వీటిపై ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన జర్నలిస్టలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాబోయే రోజుల్లో జర్నలిస్టల సమస్యల పరిష్కారానికై బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జర్నలిస్టలు సభ్యత్వం తీసుకున్నారు.

బెల్లయ్య నాయక్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌ను ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలని కేంద్ర పార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి, మంత్రులకు జిల్లా ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ లింగం నాయక్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో ఆదివాసి లంబాడీలు ఉన్న ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీని బలపరిచి గెలిపియడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా ఇప్పటివరకు లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. ఇంతకుముందు రాజ్యసభ ఎంపీలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీల్లో లంబాడీలకు అవకాశం ఇవ్వలేదని అన్నారు. బెల్లయ్య నాయక్ ఎల్‌హెచ్‌పిఎస్‌ను స్థాపించి గత 30 సంవత్సరాలుగా లంబాడాలను జాగృతి పరుస్తూ, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నారని, ఆదివాసి కాంగ్రెస్ బాధ్యతలను నిర్వహిస్తూ నిరంతరం లంబాడి జాతినీ రాజకీయ చైతన్యం కల్పిస్తూ, లంబాడి గిరిజన జాతులకు కాంగ్రెస్ విధివిధానాలను తెలుపుతూ ముందుకు వెళ్తున్నారుని అన్నారు. బెల్లయ్య నాయక్‌కు ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఇచ్చి లంబాడలకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ రవి నాయక్, మండల ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ తులసి రామ్, జిల్లా ఆదివాసి కాంగ్రెస్ కోఆర్డినేటర్ రామచందర్ నాయక్, పట్టణ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 131 డివిజన్ కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షురాలు రాజానోళ్ల లక్ష్మి, రాష్ట్ర సెక్రటరీ రఫియా బేగమ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, డివిజన్ నాయకులు ఎండి జాకీర్, మహిళ అధ్యక్షురాలు సుజాత, జెస్సి, ఆగమయ్య, రేణుక రెడ్డి, అశ్విని, మాధవి రెడ్డి, హైమావతి, జ్యోతి, లతా, సంగీత, ఈశ్వర్, నాగార్జునరావు, మమత తదితరులు పాల్గొన్నారు.

320ఏ లయన్స్ జిల్లా గవర్నర్‌గా మహేంద్ర కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర-అమనగల్లు: కందుకూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు భూలక్ష్మి మెమోరియల్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ జి.మహేంద్ర కుమార్ రెడ్డి లయన్స్ ఇంటర్నేషనల్ యొక్క జిల్లా 320ఎ గవర్నర్‌గా, సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో జిల్లా 9వ వార్షికోత్సవంలో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబురావు ముఖ్యఅతిథిగా జరిగిన ఈ సమావేశంలో, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లైన్ ఆర్ సునీల్ కుమార్ మల్టిపుల్ చైర్మన్ రాజిరెడ్డి జిల్లా గవర్నర్ డి.కోటేశ్వరరావుతో పాటు జిల్లాకు సంబంధించిన మాజీ గవర్నర్ లందరు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2007-08 లో కందుకూరు నందు నూతనంగా లైన్స్ క్లబ్ స్థాపించి దానికి వ్యవస్థాపక అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి అంచలంచెలుగా ఎదుగుతూ క్లబ్ ద్వారా సమాజంలో వివిధ రకాలైన సేవా కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు కంటి వైద్య శిబిరాలు, నిర్వహిస్తూ క్లబ్ నుండి గవర్నర్ వరకు ఎదిగారు. ఇది అతని శ్రమ పట్టుదల అంకితభావానికి నిబద్ధతకు నిదర్శనమని పాస్ట్ గవర్నర్ గంగపురం చెన్నకిషన్‌రెడ్డి కొనియాడారు.

విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ బహదూర్ పుర నియోజకవర్గంలోని ఫలక్నుమా సోషల్ వెల్ఫేర్ ఎక్సలెన్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బహదూర్ పుర శాసనసభ్యులు మొహమ్మద్ ముబీన్‌లతో కలసి విద్యార్థినులతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అలాగే బాల, బాలికలు పోటీ తత్వంతో చదువులో రాణించాలని, దేశ భవిష్యత్తు మీ పైనే ఆధారపడి ఉందని స్థానిక సంస్థలలో మహిళలకు 50శాతం అవకాశం కల్పించామని అన్నారు. పరీక్షల సమయంలో విలువైన సమయం వృధా చేయకుండా అందరూ బాగా చదువుకోవాలని అన్నారు. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిన తరువాత తమకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారని విద్యార్థినులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మనం ఉన్నత స్థానాలకు ఎదగడానికి ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలు ఉపయోగించుకొని శ్రమపడి ఉన్నత శిఖరాలకు ఎదగడానికి ఆలోచన చేయాలని హితబోధన చేసారు. ఆడపిల్లలు సృష్టికి మూలాలని, ప్రతి ఒక్కరు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అదిశగా మహిళా దినోత్సవం రోజున ప్రతిజ్ఞ చేసుకోవాలని అన్నారు. విద్యాతోనే సమాజంలో మహిళలు సగభాగం పోటీ ప్రపంచంలో పోటీ పడుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యోగాల్లో 33 శాతం మహిళలు దాటి జనరల్ కోటలో కూడా పోటీపడుతున్నారని, మార్గదర్శకులుగా నిలవాలని అన్నారు. విద్యార్థులు మంచి ఉన్నత శిఖరాలకు ఎదుగుతున్నారంటే తల్లిదండ్రులు, విద్య నేర్పించే గురువుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. ఉజ్వలమైన భవిష్యత్‌కి ఇప్పుడే పునాది మీరంతా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు పోవాలని అన్నారు. లింగ వివక్ష లేకుండా అన్ని అంశాల్లో మహిళలు పోటీ పడాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఫలక్నుమా సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో సెమినార్ హాల్ లేదని చెప్పగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని ఆలోచనలతో 17 రకాల వ్యాపార రంగాల్లో పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. అలాగే మొదటిసారి మహిళా సమైక్య సంఘాల ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సులు కొనుగోలు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ నడిపించడం లాంటి పథకాలు మహిళలకు అందిస్తున్నామని అన్నారు. సమాజంలో సగభాగం అయినా మహిళలు పోటీతత్వ ప్రపంచంలో ముందు పోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యను మించిన సంపద లేదని ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు అందించాలని ఉజ్వల భవిష్యత్తు మీ పైనే ఆధారపడి, రేపటి భవిష్యత్తు పునాదులు మీరేనని ఎక్కడ కూడా లింగ వివక్షత చూపరాదన్నారు. విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఫిషర్ మెన్ సంస్థ మెట్టు సాయికుమార్, ప్రిన్సిపాల్ వి.జయంతి, కార్పొరేటర్ తారాబాయి మోతిలాల్, అధ్యాపకులు, మథర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం మహిళల జన్మహక్కు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో భారత మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆద్వర్యంలో సురవరం వెంకట్రామారెడ్డి భవన్ ఎదుట మహిళా సమాఖ్య జెండాను సంఘం జిల్లా కార్యదర్శి కొండికంటి పద్మావతి ఆవిష్కరించి అనంతరం సిపిఐ కార్యాలయంలో మహిళా దినోత్సవం వేడుక సభ సంఘం జిల్లా అధ్యక్షురాలు భార్గవి అధ్యక్షతన జరిగింది. ముందుగా 114వ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం కేకును కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. సింగర్ శ్యామల ఆలపించిన సామాజిక మహిళా చైతన్య గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులు హాజరైన ప్రముఖ విద్యావేత్త, జ్ఞాన భారతి విద్యాసంస్థ అధినేత కిరణ్మయి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పురుషులతో సమానంగా ఎదగాలని ఎక్కడ వివక్ష ఎదురైనా ఎదిరించి ధైర్యంగా నిలబడాలన్నారు. మహిళలు విద్యను అభ్యసించినప్పుడే స్త్రీ సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. కడుపులోనే ఆడబిడ్డలని చంపడం నేరమని అది దుర్మార్గమైన చర్య అని ఆమె పేర్కొన్నారు. చిన్న చిన్న సమస్యలకు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఇది సరైంది కాదన్నారు. స్త్రీ జాతిని భూమాతతో పోలుస్తారని గుర్తు చేశారు. సామాజిక కార్యకర్త సింగర్ శ్యామల మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి సామాజిక అణచివేత గొడ్డలి పెట్టుల మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాల నుండి మహిళలు అనేక కట్టుబాట్లకు సాంఘిక దురాచారాల సాంప్రదాయాలకు మహిళా శక్తి నిర్వీర్యం అయిపోయిందని నేడు శాస్త్ర సాంకేతిక రంగం పరుగులు పెడుతుందని సంబర పడుతున్న కాలంలోనే మహిళలపై దాడులు దౌర్జన్యాలు, వాటికి సమాంతరంగా పెరగడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సమాజంలో సగభాగం అన్న మహిళలని ఇంకా అవహేళనకు గురి చేస్తున్నారని ఆకాశంలో సగం అని అవకాశాల్లో సగం కోత పెడుతున్నారు అని ధ్వజమెత్తారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బ్యంగి బాలకిషన్, ట్రస్మా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జ్ఞాన భారతి లక్ష్మణ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పీ.సురేష్, భారత జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.భార్గవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కే.పద్మావతి, పట్టణ కార్యదర్శి పి.ఇందిర, ఆశ, వనపర్తి జిల్లా కార్యదర్శి జి.గీతమ్మ, మాధవి, పద్మ, సత్యమ్మ, లక్ష్మీకళ, సి.పూజ, జ్యోతి, భవాని, సుజాత వివిధ ప్రజా సంఘాల నాయకులు మహిళలు పాల్గొన్నారు.

ప్రమాదంలో మరణించిన కూలీల కుటుంబాలకు
రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జీడిగడ్డ తండాకు చెందిన గిరిజన వ్యవసాయ కూలీలు గురువారం మిరపకాయలు ఏరడానికి వేరే గ్రామానికి గూడ్స్ ట్రాలీలో వెళుతున్న సందర్భంగా ప్రమాదానికి గురై ఇద్దరు కూలీలు మరణించడం పలువురు క్షతగాత్రులు కావడం అత్యంత బాధాకరమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. రెక్కాడితే కానీ డొక్కాడని శ్రమజీవులైన వ్యవసాయ కూలీలు తమ ఊళ్లో పనులు లేక గత్యంతరం లేక ఇతర గ్రామాలకు కూలి పనుల కోసం వెళుతున్న సందర్భంగా ప్రతి సంవత్సరం ఇలాంటి ప్రమాదాలకు గురై ఎంతో మంది కూలీలు ప్రాణాలు కోల్పోతున్న ప్రభుత్వ అధికారులు తగిన నివారణ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున ఇలాంటి దుర్ఘటనలు తరచుగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా చూడాలన్నారు. మరణించిన కుటుంబాల వారికి 25 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కాళ్లు రెక్కలు విరిగి క్షతగాత్రులై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి పూర్తిస్థాయిలో ఉచిత వైద్య సేవలు, ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించి అన్ని విధాల ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని రానున్న పార్లమెంటు సమావేశాలలో ఆమోదించి అమలు పరచాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

మహిళల హక్కులను కాపాడటంలో మోడీ ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర - బషీర్ బాగ్: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహిళల హక్కులను కాపాడటంలో ఘోరంగా విఫలమైందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. మహిళలపై లైంగిక దాడుల నేరాల కేసులు ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలలో అత్యధికులు బిజెపిలో ఉన్నారని తెలిపారు. మహిళల భద్రత, రక్షణకు తన ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పదే పదే పేర్కొనడం సిగ్గుచేటన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో రికార్డుల ప్రకారం గత 11 ఏళ్లలో మహిళలపై నేరాలలో 18 శాతం ఆశ్చర్యకరమైన పెరుగుదలను చూపించిందని అన్నారు. అప్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ, మహిళా విభాగం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలకు ముఖ్యతిథిగా హాజరైన డాక్టర్ దిడ్డి సుధాకర్ మొదట కేక్ కట్ చేసి, సహచర మహిళా నేతలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మహిళలపై హింసను అంతం చేయడానికి, సమాన హక్కులను పొందడానికి, లింగ సమానత్వం, సాధికారత సాధించడానికి ప్రజాస్వామ్య మహిళా సంఘాలన్నీ ఏకమై బలమైన ఉద్యమాలు నిర్మించాలని అయన పిలుపునిచ్చారు. ఆప్ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు నర్సింగ్ యమునా గౌడ్ మాట్లాడుతూ సాంప్రదాయ, పురుష-ఆధిపత్య వైఖరులలో సామాజిక మార్పును తీసుకురావడం అవసరమన్నారు. సమాజం ఎదుర్కొంటున్న అత్యంత ముఖ్యమైన సవాళ్లలో మహిళలపై హింస ఒకటని, దీనిని అంతం చేయడం కోసం అన్ని ప్రజాస్వామ్య పార్టీలు, మహిళా సంఘాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర నాయకులూ డా. సోలొమన్ రాజ్, మహిళా నేతలు ఆఫస సలీమ్, సుధారాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో మహిళా రైతుల సదస్సు

ంవిశాలాంధ్ర - హైదరాబాద్ : మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మహిళ రైతుల సదస్సు రాజ బహదూర్ గౌర్ హోల్-మద్దూం భవన్-హైదరాబాదులో అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు సక్కుబాయి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, రిటైర్డ్ ప్రిన్సిపల్ వెంకటరమణ, మహిళా సమాఖ్య నాయకులు డాక్టర్ సదాలక్ష్మి, అడ్వకేట్ విజయలక్ష్మి పండిట్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభు లింగం, సహాయ కార్యదర్శి శంకరయ్య, అమృత, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మాధవరెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి అల్వాల్ రెడ్డి మేడ్చల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డీజీ సరేంద్ర ప్రసాద్, దేవ భక్తుని సంధ్య, హరిత, నీతుశర్మ, అరుణా దేవి, వజ్రాల అరుణ, శోభ, యాదమ్మ, తదితర రైతు మహిళలు పాల్గొన్నారు. ఈ సదస్సులో పశ్య పద్మ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలకు విద్య వైద్యం ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఓటు హక్కు కావాలని 1910వ సంవత్సరంలోనే క్లారా జెట్కిన్ పిలుపునిచ్చారు. ఈ డిమాండ్లను సాధించటానికి ప్రపంచ మహిళల ఉద్యమించండి పోరాడండి అని పిలుపునిచ్చారు. ఆనాటి నుంచి నేటి వరకు మహిళలు మన దేశంలో స్వాతంత్రోద్యమంలో తెలంగాణ సాయుధ పోరాటంలో ఇతర రాష్ట్రాలలో జరిగిన రైతాంగ పోరాటాలలో అగ్రగామి పాత్ర వహించి సాయుదులై పోరాడి చరిత్రలో విరాంగణలుగా ప్రసిద్ధిగాంచారు. అరుణాసఫలి, ఆరుట్ల కమలాదేవి, బ్రిజి రాణి గౌర్, గుజ్జుల సరళ దేవి, చంద్ర రాజకుమారి అనేక మంది మహిళా నాయకురాండ్రు మడిమ తిప్పని పోరాటాలు చేశారు ఫలితమే మన దేశంలో మహిళలకు ఓటు హక్కు సమాన ఆస్తి హక్కు, అత్యాచారాల నిరోధక చట్టం గృహహింస నిరోధక చట్టం సాధించు కోగలిగాం. ప్రభుత్వాలు క్లారా జట్కిన్ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆయా దేశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకో వటమే కాక ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఆయా దేశాలలో మహిళా దశాబ్దంగా నిర్వహించటం జరిగింది. 1995లో చైనా రాజధాని బీజింగ్‌లో నిర్వహించిన 4వ ప్రపంచ మహిళల సదస్సులో 12 మహిళలకు సంబంధించిన అంశాలపై ప్రపంచ దేశాలలో నికరమైన చర్యలు తీసుకొని అమలు చేయాలని నిర్ణయించడం జరిగింది.

మహిళా సాధికారతకు బీఆర్ఎస్ పెద్దపీట: కేసీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో మహిళా సాధికారతకు బీఆర్ఎస్ పెద్దపీట వేసినట్టు ఆ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. శనివారం ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ స్త్రీశక్తిని కొనియాడారు. కుటుంబ వ్యవస్థను ముందుకు నడపడంలో మహిళల త్యాగం మహోన్నతమైనదన్నారు. దేశ సంపదను సృష్టించడంలో పౌరులుగా వారి పాత్ర గొప్పదన్నారు. ఎన్నో కష్టాలను అధిగమిస్తూ పురుషుడితో సమానంగా నేటి సమాజంలో స్త్రీ పోషిస్తున్న పాత్ర అమోఘమని తెలిపారు. అబల సబలగా నిరూపించుకుంటుందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర మహిళాభ్యున్నతి కోసం అమలు చేసిన పలు కార్యక్రమాలు వారి సాధికారతకు దోహదం చేయాశయని కేసీఆర్ గుర్తు చేశారు. మహిళల ఆరోగ్యం, సంరక్షణ, సంక్షేమంతో పాటు పలు కీలక అభివృద్ధి పథకాలల్లో మహిళకే ప్రాధాన్యతనిచ్చామన్నారు. తెలంగాణ ప్రగతిలో మహిళలను ప్రభుత్వం భాగస్వామ్యం చేసిందన్నారు. వారిని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని కేసీఆర్ పేర్కొన్నారు.

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి భక్తులు ఉత్తర తెలంగాణ నుండి తిరుపతి వెళ్ళ వారి ప్రయాణికుల సమస్యలు తొలగించి కరీంనగర్ నుండి తిరుపతికి నిత్యం రైలు వేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరుతూ లేఖ వ్రాసారు. కరీంనగర్ నుండి తిరుపతి రైలు (12762) (ఆది, గురు), తిరుపతి నుండి కరీంనగర్ (12761) (బుధ, శని) రైలు ప్రస్తుతం వారానికి రెండు సార్లు మాత్రమే నడుస్తుంది. ఈ రైలును తాను ఎంపీగా ఉన్నప్పుడు ఉత్తర తెలంగాణ ప్రజలు తిరుపతి వెళ్ళడానికి సులభతరంగా ఉంటుందని యూపీఏ ప్రభుత్వంలో ప్రారంభించడం జరిగింది. తరువాత ఈ రైలుని ప్రతిరోజూ నడిచేలా చర్యలు తీసుకోవాలని కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి గత 10 సంవత్సరాలుగా రైల్వే శాఖ మంత్రిగా మీకు, స్థానిక ఎంపీ బండి సంజయ్‌కి విజ్ఞప్తి చేయడం జరిగింది..

సిఆర్ ఫౌండేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : నీలం రాజశేఖరరెడ్డి పరిశోధన కేంద్రం అద్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు హైదరాబాద్ కొండాపూర్‌లోని సి ఆర్ ఫౌండేషన్ ఆవరణలో ఇంద్రజిత్ గుప్తా హాలులో జరిగాయి. ఈ సందర్భంగా "డిజిటల్ మీడియా - మహిళలు - ప్రభావం - పరిణామాలు" ఈ అంశం పై ఎండ్ నౌ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కాలమ్ రచయిత, ఇంటర్నెట్ నీతి, డిజిటల్ వెల్ బీయింగ్ నిపుణుడు, పబ్లిక్ పాలసీ ఔత్సాహికులు డా.అనిల్ రాచమల్ల విపులంగా ప్రసంగించారు. డిజిటల్ మీడియా వల్ల మహిళలు, సమాజం మొత్తం గూడ ఏ విధంగా నష్ట పోతున్నారు అనే అంశంపై విపులంగా వివరించారు. ఈ కార్యక్రమానికి ఏ.ఐ.టి.యు.సి, ఎన్.ఎఫ్.ఐ.డబ్లు మాజీ కార్యదర్శి డా.బి.వి.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. డా .అనిల్ రాచమల్లని ఎన్ఆర్ఆర్ రిసెర్చ్ సెంటర్ కమిటి సభ్యులు సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు డా.జె.ప్రభాకర్‌రావు సభకు పరిచయం చేసారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఎన్ఆర్ఆర్ రిసెర్చ్ సెంటర్, మహిళా సంక్షేమ కేంద్రం సంయుక్తంగా సరోజినీదేవి ఆసుపత్రి రిటైర్డ్ సర్జన్ డా. సరస్వతిని, సిఆర్ ఫౌండేషన్ ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డా.రజనిని ఘనంగా సన్మానించారు. కనిపర్తి జ్యోత్స్న వందన సమర్పణ చేసారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఫౌండేషన్ నిర్వాహకులు, వృద్ధాశ్రమవాసులు, ఎన్.ఆర్.ఆర్.రీసెర్చ్ సెంటర్ సభ్యులు, మహిళా సంక్షేమ కేంద్రం విద్యార్థినిలు, ఉపాధ్యాయులు అలాగే భాష్యం పాఠశాల ఇతర పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన కూడా పాల్గొన్నారు.

సాయి శరణ్య భక్తి సంగీత విభావరి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : అన్నమయ్యపురంలో అన్నమాచార్య భావనా వాహిని సంస్థ వ్యవస్థా పకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. శోభారాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వరస్వామికి ఈ శనివారం సాయంత్రం అన్నమ స్వరార్చనలో భాగంగా "శ్రీ రాఘవ కూచిపూడి నృత్య సంగీత కళా నిలయం సంస్థ నుండి కే.సాయిశరణ్య, వారి శిష్యబృందం, కే.సాయిశ్రావ్య, కే.జ్యోషిత, టి.భువశ్రీ, సి.మొన్వి, యమ్.ధృతి, భువన సంయుక్తంగా గణనాథం భజారే, అలమేలుమంగ, గోవింద గోవింద, చక్కని తల్లికి - గ్రూప్, నారాయణతే నమో నమో, శ్రీమన్నారాయణ, వేదంబెవ్వని వెదకెదిరి, షోడశ కళానిధికి, తిరు తిరు జవరాల - గ్రూప్, తంద నానాహి, కట్టెదురా వైకుంఠం, ముద్దుగారే యశోద - గ్రూప్ , వేడు కొందామ - గ్రూప్, ఘనరవములు ఘలు పుల్లన, చూడరమ్మ సతు లాల, మాధవ కేశవ మొదలైన బహుళ ప్రాచుర్యం పొందిన అన్నమాచార్య సంకీర్తనలను సభక్తి పూర్వంగా అందించారు. అనంతరం కళాకారులకు, అన్నమాచార్య భావనా వాహిని పక్షాన సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డా. నంద కుమార్ జ్ఞాపికను అందించారు. వేంకటేశ్వరస్వామి వారికి అంగనలీరే హారతులతో దిగ్విజయంగా ముగిసింది.

జూనియర్ సివిల్ జడ్జి కోర్టు- వినుకొండ

ఓ.యస్ నెం. 13/2023

బిట్వీన్

దావులూరి కాంతమ్మ మరి ఒకరు - వాది

ఎదిరి

దావులూరి జయలక్ష్మి మరియు 7 మంది - ప్రతివాదులు

టు:

5వ ప్రతివాది :- **చిమట అచ్యుత నాగార్జునరావు,** తండ్రి వెంకటేశ్వర్లు, డోర్ నెం.24-582, ఫ్లాట్ నెం. 113, రోడ్ నెం.5, మారుతి నగర్, లోతికుంట, సికింద్రాబాదు, తెలంగాణా.

6వ ప్రతివాది :- **చిమట రవీంద్ర, తండ్రి వెంకటేశ్వర్లు,** డోర్ నెం.24-582, ఫ్లాట్ నెం. 113, రోడ్ నెం.5, మారుతి నగర్, లోతికుంట, సికింద్రాబాదు, తెలంగాణా.

7వ ప్రతివాది :- **మామిళ్ళ పల్లి సునిత, భర్త వెంకటేశ్వర్లు,** డోర్ నెం.24-582, ఫ్లాట్ నెం. 113, రోడ్ నెం.5, మారుతి నగర్, లోతికుంట, సికింద్రాబాదు, తెలంగాణా.

పై నెంబరు దావాలో మీపై ఇందలి వాది పార్టీషన్ దావా వేసియున్నారు. మీకు దావా సమన్లును అందుటకు కోర్టుద్వారా ఎన్నిసార్లు బత్తాలు కట్టినను మీరు తీసుకోనందున కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము మీకు తెలియజేయునది ఏమనగా **ది.20-03-2025**న వాయిదా అయియున్నది. సదరు వాయిదాకు మీరు స్వయంగాను లేక మీ న్యాయవాది ద్వారాను పై కోర్టునకు హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపగలరు, లేనియెడల శ్రీకోర్టు వారు మీ పరోక్షముగా తీర్మానం చేయగలరని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా:- 20-03-2025

చాగంటి వీరాంజనేయ చౌదరి,
సయ్యద్ మహమ్మద్ ఖాశిం,
వాది తరపు న్యాయవాదులు, వినుకొండ.
సెల్ : 9848021892, 9030214799

బీసీలకు ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు విజ్ఞప్తి చేసిన బీసీ నేతలు

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : ఎమ్మెల్సీగా సిపిఐకి అవకాశం వస్తే బీసీలకే ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ 50 శాతానికి పైగా ఉన్న బీసీలను సిపిఐ గౌరవించి గౌరవప్రదంగా ఆ ఎమ్మెల్సీ సీటును మొదటి నుంచి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బడుగు బలహీనవర్గాలకు చెందిన బీసీ బిడ్డకు ఇచ్చి సిపిఐ పార్టీ సామాజిక న్యాయం పాటించాలని కోరారు. మొదటి నుంచి కమ్యూనిస్టు పార్టీలకు బీసీలే అండగా ఉన్నారని అన్నారు.దీనికి కూనంనేని సానుకూలంగా స్పందించారని లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బడే సాబ్ తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ ఏఐఎస్ఎఫ్ సీనియర్ నాయకులు స్టాలిన్ పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

కేంద్ర మంత్రికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : దక్షిణ భారతదేశానికి ముఖ్య కూడలిగా ఉన్న కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ని కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. తెలంగాణ పర్యటన నేపథ్యంలో శనివారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న కేంద్రమంత్రిని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని వినతిపత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. నష్కల్ నుండి హసన్ పర్తి, నష్కల్ నుండి చింతలపల్లి నూతన బైపాస్ లైన్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఓఆర్ఆర్ చుట్టూ నూతన బైపాస్ అలైన్ మెంట్ మార్చాలని కేంద్ర మంత్రిని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు. ఈ విషయంపై వెంటనే సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బైపాస్‌ను ఓఆర్ఆర్ చుట్టూ అలైన్మెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలియజేసారు. కాజీపేట డివిజన్ అప్ గ్రేడ్‌పై త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రిని మరోసారి కలుస్తామని ఎంపీ తెలియజేసారు. అనంతరం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి కోమట్ రెడ్డి వెంకటరెడ్డి మహిళా మంత్రులను వరంగల్ ఎంపీ డా.కడియం కావ్యను శాలువాతో సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళా సాధికారతే లక్ష్యం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని మాజీ కార్పొరేటర్ కొలను తేజా శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిజాంపేట్ మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్ కొలను తేజా శ్రీనివాస్‌రెడ్డిని, కార్పొరేషన్ పలు డివిజన్ల మహిళలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌కట్ చేసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ప్రత్యేక వెసులుబాటు, ఉచిత బస్సు ప్రయాణం లాంటి పథకాలను తీసుకొచ్చి మహిళా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, సరిత, ధనలక్ష్మి, నవ్య దేవి, సత్యవతి, అరుణ కుమారి, రమ మెడిటేషన్ టీచర్, వరలక్ష్మి, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలి: కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : జనగణనతో ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. 2023లో పార్లమెంటు ఆమోదించినప్పటికీ మహిళా రిజర్వేషన్ చట్టాన్ని జనగణనతో ముడిపెట్టి కేంద్రం ఇప్పటికీ అమలు చేయడం లేదని, దాంతో దేశవ్యాప్తంగా మహిళలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమల్లో లేనందువల్ల ఇటీవల ఎన్నికలు జరిగిన మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యాన వంటి రాష్ట్రాల్లో చాలా మంది మహిళలు ఎమ్మెల్యేలుగా కాలేకపోయారని, త్వరగా జనగణన చేస్తే రాబోయే బిహార్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మరింత మంది మహిళలు ఎమ్మెల్యేలవుతారని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్ లో జరిగిన వేడుకలకు ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య

అతిథిగా హాజరయ్యారు. బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఉత్సవాలు జరుపుకున్నారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రతి మహిళకు రూ 2500 ఇస్తామన్న హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనలను స్వాగతిస్తున్నామని, అయితే మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారో నిర్దిష్టమైన ప్రణాళికను ప్రభుత్వం ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. అంగన్ వాడీ, ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచకపోవడం సరికాదని, తక్షణమే వారికి జీతాలను పెంచాలన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ బోధనా సామర్థ్యాలను మరింత పెంపొందించుకునేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తామన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దిల్ రాజు ఆధ్వర్యంలో కోణం ఫౌండేషన్ నిర్వాహకులు సందీప్ కుమార్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏఐ సిటీను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక్కడే అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీని కూడా ప్రారంభించబోతున్నామన్నారు. నల్గొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏఐ సాయంతో ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తున్న ఫౌండేషన్ సేవలను అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఫౌండేషన్ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన సందీప్ కుమార్ పుట్టిన ఊరిని మర్చిపోకుండా ఫౌండేషన్ తరపున అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ పాల్గొన్నారు.

పురుషాధిక్యాన్ని మహిళా ఉద్యమాలతో తిప్పికొట్టాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమాజ సృష్టికి మూలమైన మహిళల మనుగడను ప్రశ్నార్థకం చేస్తు మహిళల హక్కులను హరిస్తున్న పురుషాధిక్య భావజాల వ్యాప్తిని మహిళా ఉద్యమాలతోనే చెప్పి కొట్టాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ పిలుపునిచ్చారు. 114వ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతృత్వంలో శ్రామిక మహిళల ఉద్యోగినులు డప్పులు మోగిస్తూ హక్కులకై నినదిస్తూ భారీ మహిళ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ సమత కేక్ కటింగ్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఆటపాటలతో మహిళలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. అనంతరం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆసుపత్రి బ్రాంచ్ అధ్యక్షులు గోపాల్ నాయక్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నేతల కోటేశ్వర్ రెడ్డి, వెంకటేష్‌ల ఆర్థిక సౌజన్యంతో శ్రామిక మహిళ కార్మికులను సత్కరించి, మహిళా కార్మికులం దరికీ కానుకలు, బహుమతులు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ పితృస్వామ్య వ్యవస్థలో నేటికీ మహిళలు హింస, కట్టుబాట్లు, లింగ వివక్ష లాంటి సామాజిక అణిచివేతకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులే అధికంగా ఎన్నికవ్వడం స్త్రీ జాతి అభ్యున్నతికి గొడ్డలి పెట్టుగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళలకు భద్రత కరువైందని అన్నారు.మహిళల రక్షణకై నిర్భయ లాంటి ఎన్ని చట్టాలు వచ్చినా గ్యాంగ్ రేప్‌లు అత్యాచారాలు అఘాయిత్యాలు ఆగడం లేదని అన్నారు. పని ప్రదేశంలో సైతం మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పది సంవత్స రాల సీనియార్టీ కలిగిన కాంట్రాక్ట్ మహిళ కార్మికులందరినీ పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ 20 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతలు బి. చెన్నయ్య, కోటేశ్వర్ రెడ్డి వెంకటేష్ గోపాల్ నాయక్, దేవానంద్, మొగులయ్య, ఆర్ ఎం ఓ డాక్టర్ సమత,నర్సింగ్ ఆఫీసర్ శ్రావణి, మహిళ కార్మిక నేతలు నాగమ్మ, సత్యమ్మ, వరలక్ష్మి, ఇందిరా, సునీత, జ్యోతి, లక్ష్మి, కవిత, అరుణ, వెంకటమ్మ, సరోజా, యాదమ్మ, అంజిలమ్మ, సుధ, మమత, మంజుల, లక్ష్మమ్మ, చంద్రకళ, సాయమ్మ, జమున, రజీయా, రాధ, చిట్టి, యాదయ్య, నరేష్, నైసస్,యాదగిరి, అంజిలయ్య, శేఖర్, రవి, నరేష్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే ప్రభుత్వం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పలువురు మహిళలను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మహిళా మణులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కేశంపేట మహిళా మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, నందిగామ మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్ నేతృత్వంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మహిళలకు ఘనంగా సన్మానించి సత్కరించారు. సమావేశంలో మహిళల అభిప్రాయాలను వారి మనోభావాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ పస్తులు ఉండైనా సరే తన కన్న బిడ్డలకు పట్టడన్నం పెట్టె త్యాగమూర్తి అమ్మ అని కొనియాడారు. ఏ స్వార్థం లేని మహిళలు తమ కుటుంబం సమాజం కోసం రాత్రింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడుతుంటారని అన్నారు. సమాజంలో మహిళలది గొప్ప పాత్ర అని అన్నారు. నేటి సమాజంలో దాడులు దౌర్జన్యాలు దుర్మార్గాలు మహిళల పట్ల ఆకృత్యాలు ఎక్కువయ్యాయని వీటిని సమూలంగా చట్టాల ద్వారా పెకిలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్య యాదవ్, రఘునాయక్, పలు శాఖలకు సంబంధించిన మహిళా అధికారినిలు ఎస్ఐ సుశీల, అలియా సుల్తానా, విజయలక్ష్మి, జ్యోతి, డాక్టర్ స్రవంతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజీతోనే రాజా మార్గం

విశాలాంధ్ర- ఆమనగల్లు: రాజీతోనే రాజా మార్గమని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు వివిధ కేసుల్లో కక్షిదారులు రాజీ పడితేనే ఇరువురికి న్యాయం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఆమనగల్లు జూనియర్ మున్సిఫ్ కోర్ట్ ఆవరణలో శనివారం జడ్జ్ స్వరూప ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. సుమారు 126 కేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. జడ్జ్ కాటం స్వరూప మాట్లాడుతూ వివిధ కేసులలో కక్షిదారులు కోర్టులచుట్టూ తిరిగి సమయం వృధా చేసుకోకుండా లోక్‌అదాలత్ ద్వారా మేలు జరుగుతుందన్నారు.

మహిళలకు గుడ్ సిటిజన్ స్కూల్ సన్మానం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం, యూసుఫ్ గూడా డివిజన్, వెంకటగిరిలో ఉన్న గుడ్ సిటిజన్ కాన్సెప్ట్ స్కూల్లో ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ నసీంఉన్నిసా, కరస్పాండెంట్ అయుఖాన్ శనివారం జిహెచ్ఎంసి స్వీపింగ్ మహిళలకు మహిళ దినోత్సవం సందర్భంగా శాలువాతో సన్మానించి వారికి నూతన వస్త్రాలు అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (అడ్మిన్) కే.శశిశ్రీ, అడిషనల్ డైరెక్టర్ ఇంకా సందర్భని స్కూల్ ప్రిన్సిపాల్ కె. ఎస్. సుప్రభా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కే.శశిశ్రీ, అడిషనల్ డైరెక్టర్, మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి విషయంలోనూ మగాళ్ళతో సమానంగా ఉంటూ వారితో కూడా పైచేయి సాధిస్తూ అన్ని రంగాలలో ఉన్నత శిఖరాలను అందుకుంటూ, ఇంటి సంసారాన్ని కూడా సక్రమంగా నిర్వహిస్తూ తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ అందరితో మనులు పొందుతున్న ఏకైక వ్యక్తి మహిళ అని కొనియాడారు.

కన్సీవా ఫెర్టిలిటీని ప్రారంభించిన మంత్రి దామోదర్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్ : ప్రభుత్వ రంగంలో కూడా ఐవీఎఫ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కొండాపూర్లోని శేరిలింగంపల్లిలో అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన 'కన్సీవా ఫెర్టిలిటీ'ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న కేంద్రాలలో ఒకటి వరంగల్, రెండు నిజామాబాద్, మూడోది కొండాపూర్ లో ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఫెర్టిలిటీ కేంద్రాల అవసరం చాలా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులే వంధ్యత్వానికి కారణంగా చెప్పవచ్చన్నారు. వంధ్యత్వ సమస్యను అధిగమించడానికి ఫెర్టిలిటీ కేంద్రాల అవసరం ఎంతో ఉందన్నారు. ఆధునాతన వైద్య పద్ధతులు గర్భధారణ అవకాశాలను పెంచుతాయన్నారు. అందువల్ల ఈ సమస్యతో దంపతులు బాధపడాల్సిన అవసరం లేదన్నారు. ఇది నిజంగా సంతానం కోరుకునే దంపతులకు ఒక ఆశాకిరణంగా చెప్పవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా భద్రతా విభాగం డీజీపీ, సీఐడీ శిఖా గోయెల్, యశోద హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి పాల్గొన్నారు.

మహిళల సహకారంతోనే దేశాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్ : మహిళల సహకారంతోనే దేశాభివృద్ధి సాధ్యమని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం సూరారం కాలనీ నందు శనివారం ది కనౌలెడ్జి ఐకాన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సూరారం మహిళా పోలీస్ అధికారిణి లీమా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ మహిళా దినోత్సవం అని పిలువబడే మొట్టమొదటి మహిళా దినోత్సవ కార్యక్రమం ఫిబ్రవరి 28, 1909న న్యూయార్క్ నగరంలో పునాది పడిందని, మార్చి 8 మహిళలకు అంకితమైన రోజు అని ఆయన గుర్తు చేశారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, స్థానిక పోలీసుశాఖ మహిళా అధికారులు ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, శంకర్, విజయ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీలో అత్యుత్తమ సాంకేతిక వినియోగం: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటన జాతీయ విపత్తు అని, సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించడానికి ప్రపంచంలోనే అత్యుత్తమ సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నాగర్ కర్నూలు శాసన సభ్యులు చిక్కుడు వంశీకృష్ణతో కలిసి ఎస్.ఎల్.బి.సి టన్నెల్‌ను శనివారం సందర్శించారు. సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సొరంగంలో ఇప్పటి వరకు జరిగిన పురోభివృద్ధి పై రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ కార్యదర్శి అరవింద్ కుమార్, ఆర్మీ కమాన్డెంట్ పరిక్షిత్ మెహ్రా మంత్రికి వివరించారు. ఎన్.జి.ఆర్.ఐ, జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా, క్యాడవర్ డాగ్ బృందం, ర్యాట్ మైనర్స్, రోబోటిక్ రంగాల నిపుణులతో చర్చించి సహాయక చర్యలు వేగంగా జరగకపోవడానికి గల కారణాలు, అడ్డంకులు, వాటిని అధిగమించడానికి చేపట్టాల్సిన చర్యలపై సలహాలు సూచనలు చేశారు. శాసన సభ్యులు డా.వంశీకృష్ణ, రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ డోగ్రా రెజిమెంట్ కమాండెన్ట్ పరిక్షిత్ మెహ్రా, మిలటరీ ఇంజనీర్ వికాస్ సింగ్, ఎన్.డి.ఆర్.ఎఫ్. కమాన్డెన్ట్ ప్రసన్న కుమార్, ఎస్.డి.ఆర్.ఎఫ్ కమాన్డెట్ ప్రభాకర్, సింగరేణి, రైల్వే, ఎన్.జి.ఆర్.ఐ, హైడ్రా తదితర రంగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - మేడిపల్లి: మహిళలు చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆర్.వి. ఫౌండేషన్ బాలాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా మిరాకిల్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనుంది. ఈ వైద్య శిబిరం ఆదివారం ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు గణేష్ మండపం, స్ట్రీట్ నెం. 2, బాలాజీ నగర్ కాలనీ, పీర్జాదిగూడ లో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మహిళలకు, పిల్లలకు ఉచిత వైద్య సేవలు అందించబడతాయి. అనుభవజ్ఞులైన వైద్యులు, ఆరోగ్య నిపుణులు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు అందిస్తారు. ఈ సందర్భంగా ఎర్.వి ఫౌండేషన్ చైర్మన్, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మాట్లాడుతూ మహిళలు, పిల్లల ఆరోగ్యం పరిరక్షణ మా ప్రధాన లక్ష్యం. ఈ వైద్య శిబిరం ద్వారా పీర్జాదిగూడ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు మా ఆర్.వి. ఫౌండేషన్ కట్టుబడి ఉందన్నారు.

ఘనంగా మహిళాదినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను సర్కిల్ 28 మల్కాజిగిరి పారిశుద్ధ్య విభాగం, స్కై ఫౌండేషన్ వారు సంయుక్తంగా ఘనంగా తమ పారిశుధ్యం కార్మికులకు సన్మానం, ప్రశంస పత్రంతో కార్యక్రమం నిర్వహించడం జరిగినది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి పారిశుద్ధ విభాగం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు సర్కిల్లోని పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వహించు 325 మంది కార్మికులకు, 8 మంది ఎస్ఎఫ్ఏలు, 4 రాంకీ సూపర్వైజర్స్‌కు సన్మానం, ప్రశంస పత్రములు అందజేశారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. సర్కిల్ ఉపవైద్యాధికారి డాక్టర్ కే.మంజుల , స్కై ఫౌండేషన్ నిర్వాహకులు, మహిళా ఎస్ఎఫ్ఏలు, నరేందర్, అంజయ్య, శేఖరయ్య, అలినవాజ్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లి ఫర్ మల్కాజిగిరి కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన రాజు ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంటరి మహిళలకు బ్యూటీ పార్లర్ కోర్స్‌ను ఉచితంగా ఇస్తున్న శ్రావ్య ప్రొఫెషనల్ బ్యూటీ పార్లర్ అధినేత్రి కాల్వ నందిని సన్మానించారు. ఇప్పటి వరకు 50 మందికిపైగా ఒంటరి మహిళలకు స్వయం ఉపాధి కొరకు శిక్షణ ఇచ్చిన శ్రావ్య ప్రొఫెషనల్ బ్యూటీ పార్లర్ అధినేత్రి కాల్వ నందిని, డ్వాక్రా సంఘాల రిసోర్స్ పర్సన్స్ ప్రియదర్శిని, భవాని, సమత, లావణ్య, శారద. అశ్వినీలను కూడ వారు సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన రాజు, శ్రీనివాసన్, నాయకులు దాస్, రాజు, మణి, చక్రవర్తి, లక్ష్మణ్‌లు శ్రావ్య ప్రొఫెషనల్ బ్యూటీ పార్లర్ అధినేత్రి కాల్వ నందిని చేస్తున్న సేవకు సహకారం అందించేందుకు బ్యూటీ కిట్‌ను ఉచితంగా అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆనంద్ బాగ్ క్యాంప్ కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి మహిళలను సన్మానించారు. కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, నిరంజన్, మహిళా నాయకులు ఆశ, రోజా రమణి, సుమలత యాదవ్, భాగ్యరాణి, కృష్ణవేణి, శారద, నజియా, లక్ష్మి, ఇంద్ర ప్రియదర్శిని, చిత్ర గోకుల్, నిర్మల, కనక లక్ష్మి, సంగీత, రామ లీల, చైనా రాణి, మేరి, నాగలక్ష్మితో పాటు స్థానిక నాయకులు బాబు, సత్యనారాయణ, సంతోష్ రాందాస్ ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, బాలరాజు యాదవ్, మంద భాస్కర్, రాజు, కన్నా, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పి.వి.ఎన్ కాలనీలోని కార్పొరేటర్ ఆఫీస్ కార్యాలయంలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో మహిళలను సన్మానించి కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సి.ఓ లక్ష్మి, మహిళలు రోజా రమణి, పద్మ, భాగ్య, అఖిల, కృష్ణవేణి, ప్రణీత, జ్యోతి, అనసూయ, శ్రీలత, జమునతోపాటు నాయకులు బాబు, సత్యనారాయణ, కిషోర్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మహిళలు ఇంటికి పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంతోష్ నగర్ కాలనీలో, జ్యోతి నగర్‌లో వేరువేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్‌కు మహిళలు ఘనంగా సన్మానించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్‌బిఎస్ ఎస్.ఎం.హంసమ్మ, రాణిగుంజ్ బస్ డిపో ఆఫీస్ సూపర్డెంట్ అనితా, మహిళా కండక్టర్స్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఐద్వా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మంగను సన్మానించారు. ఈ కార్యక్రమంలో షాపూర్ లక్ష్మి, ఉమా, పుణ్యమా, లలిత, దీప,శోభ పాల్గొన్నారు.

మానవసేవే మాధవసేవ వాట్సప్ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రూప్ సభ్యులు కే.లక్ష్మణ్ రావు సహకారంతో, శనివారం మల్కాజిగిరి నియోజకవర్గం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని, గౌతమ్ నగర్ చౌరస్తాలో జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులకు చీరలు బహూ కరించి సన్మానించారు. గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు, మానవసేవే మాధవసేవ మహమ్మద్ రషీద్, డాక్టర్ సుధాకర్, మహమ్మద్ జిలాని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో 5సంవత్సరాలుగా 25వ డివిజన్ లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిని అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సన్మానించి బహుమతులు మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. 250 మంది మహిళలతో అంగరంగ వైభవంగా క్రీడలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలిచారు. అనంతరం మహిళలు అందరూ ప్రేమతో సహబంతి భోజనం చేశారు. తర్వాత మహిళ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళలు తమ తమ ప్రసంగాన్ని వినిపించారు. తదనంతరం కేక్ కట్ చెసి శుభాకాంక్షలు తెలుపుకొని, క్రీడల్లో విజేతలకు మెమోంటో అందించారు. పీర్జాదిగుడ 25వ డివిజన్ లోని విహరిక, శ్రీ సాయి నగర్, సాయి హిల్స్, క్రాంతి కాలనీల మహిళలు, కాలనీల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి మండలంలోని జంట సర్కిళ్ళ పరిధిలో ఉన్న 40 కాలనీలలో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలైన స్త్రీ మూర్తులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని తారానగర్‌లో ఉన్న విద్యానికేతన్ మోడల్ హైస్కూల్‌లో ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్, ఎంవీఆర్ గ్రూప్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలోని ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి, ఎంవీఆర్ గ్రూప్స్ చైర్మన్ మూల వేంకటేష్ గౌడ్ విచ్చేశారు.

ముగిసిన ఈ-పంట నమోదు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రబీ పంట కాలానికి సంబంధించి ఈ-పంటలో రైతుల సాగు వివరాల నమోదు ముగిసిందని వ్యవసాయ సంచాలకులు డిల్లీరావు శనివారం తెలిపారు. రైతుల వివరాలను గ్రామ స్థాయిలో వ్యవసాయ సహాయకులకు పంపినట్టు చెప్పారు. ముసాయిదా కాపీని సోమవారం రైతు సేవా కేంద్రాల నోటీసు బోర్డుల్లో పెడతారన్నారు. సామాజిక తనిఖీలో భాగంగా గ్రామ సభలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అభ్యంతరాల స్వీకరణ, మార్పులు, తొలగింపులు , పరిష్కారాలు చేస్తారన్నారు. అభ్యంతరాలను సవరించి ధృవీకరించిన వివరాలను ఆమోదం కొరకు పైఅధికారుల పంపుతారన్నారు. మండల స్థాయిలో వ్యవసాయ అధికారి, తహసీల్దార్లు ఆమోదించిన తుదిజాబితా ఈ నెల 22న ప్రదర్శిస్తారని చెప్పారు. పంట వివరాలను ధృవీకరించుకోవాలని రైతులను కోరారు.

మహిళా సాధికారత కోసం పోరు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని, మానవాళికి మహిళలు స్ఫూర్తి ప్రదాతలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి అధ్యక్షతన 'గౌరవప్రదమైన దాతృత్వం కాదు... అది మన హక్కు...అందుకే పోరాడుదాం' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. సదస్సులో మహిళా నేతలను రామకృష్ణ దుశ్శాలువాలతో సన్మానించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ అమెరికాలో 1908లో మహిళలు 8 గంటల పని, సమాన హక్కుల కోసం పోరాడి విజయం సాధించిన రోజును మహిళా కార్మికుల కోర్కెల దినోత్సవంగా జరుపుకునేవారని, దీనిని 1975 నుండి అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నారని తెలిపారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు సమాయత్తం కావాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంలో పని ప్రదేశాలలో మహిళలకు రక్షణ లేదని, రాజకీయ నాయకులు కల్పించిన ఈ దుస్థితిని ప్రతిఘటించాలన్నారు. మహిళా బిల్లును అమలు చేయడానికి పాలకులకు మనసు రావడం లేదని విమర్శించారు. రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలని, మహిళల అణచివేత ధోరణి మారాలని రాజకీయ నాయకులకు సూచించారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అమెరికా, రష్యా దేశాలలో మహిళలు పోరాటం చేసి సాధించిన విజయాలను వివరించారు. ఆశయం కోసం వచ్చిన వారే మహిళా సాధికారిత సాధిస్తారన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన గత జగన్ ప్రభుత్వాన్ని గుర్తుంచుకోవాలని, సూపర్‌సిక్స్ హామీల అమలు కోసం కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. తొలుత రాష్ట్ర సమితి సభ్యులు కె.సుజాత పతాకావిష్కరణ చేసి... కేక్ కట్ చేశారు. మహిళ హక్కులు సాధిస్తామని నినదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, నగర అధ్యక్షుడు ఎస్‌కే నజీర్ విప్లవ, అభ్యుదయ గేయాలు ఆలపించారు. ఆర్గనైజింగ్ అధ్యక్ష, కార్యదర్శులు డి.సీతారావమ్మ, డి.రమణతో పాటు మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు, డివిజన్ కార్యదర్శులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ మాధవ్ కౌశక్ నుండి పురస్కారం స్వీకరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

జనావాసాల్లో మద్యం షాపు

విశాలాంధ్ర-తిరుపతి: మహిళా దినోత్సవం సందర్భంగా తిరుపతిలో మహిళలు శనివారం ఉగ్రరూపం ప్రదర్శించారు. సాయినగర్ నివాస ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైన్‌షాప్ వద్ద ఆందోళనకు దిగారు. బైరాగిపట్టెడ సీపీఐ కార్యాలయం నుండి మహిళలు ప్రదర్శనగా వైన్‌షాప్ వద్దకు చేరుకున్నారు. కొద్దిరోజులుగా ప్రజాసంఘాలు ఆందోళన చేస్తున్నప్పటికీ వైన్‌షాప్ అక్కడే కొనసాగిస్తుండడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. షాపు బ్యానర్లు చించి దహనం చేశారు. వైన్‌షాప్ షట్టర్లు మూసివేసి నిరసనకు దిగారు. బ్యానర్లు దహనం చేయకుండా మహిళలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వైన్‌షాప్ యజమానులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని మహిళలు అసహనం వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ కల్పించాలని, నివాసాలు, బ్యాంకులు, విద్యార్థుల హాస్టల్, ఆసుపత్రులు, విద్యా సంస్థల సమీపంలో ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నదియా మాట్లాడుతూ తిరుపతి సాయినగర్ పంచాయతీ జయనగర్ మెయిన్ రోడ్డులో మద్యం షాపు ఏర్పాటు చేశారని, దీనికి ఆనుకొని ఆసుపత్రి, మహిళా సంఘాలకు సంబంధించిన బ్యాంకులు ఉన్నాయని, ఇక్కడికి వచ్చే రోగులకు, మహిళలకు చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. వైన్‌షాప్ చుట్టుపక్కల వందలాది ఇళ్లు ఉన్నాయని, మద్యం దుకాణం వల్ల ప్రశాంతంగా మహిళలు ఇంటికి చేరే పరిస్థితి లేదని చెప్పారు. వైన్‌షాప్ ఎదురుగానే విద్యార్థుల హాస్టల్ ఉందని, మందుబాబుల ప్రభావం విద్యార్థులపై పడుతుందని అన్నారు. దుకాణాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని నిరసన వ్యక్తం చేస్తుండగా... పోలీసులు వైన్‌షాప్ యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఉద్యమాన్ని అణిచివేయాలని చూడటం శోచనీయమన్నారు. ఎక్సైజ్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా జోక్యం చేసుకొని సాయినగర్ పంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన వైన్‌షాప్‌ను తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మంజుల, నాయకులు రత్నమ్మ, ప్రమీల, లక్ష్మీ, విజయ, అవనాక్షి, కవిత, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ప్రగతి నిర్దేశకులుగా ఎదగాలి: మంత్రి నారాయణ

విశాలాంధ్ర-కాకినాడ: ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ వ్యాపార వేత్తగా, పారిశ్రామిక వేత్తగా ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్ష అని ఆకాంక్ష అని జిల్లా ఇంఛార్జ్ మంత్రి, రాష్ట్ర మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శనివారం రాజా ట్యాంక్ ప్రాంగణంలోని ఫేబ్ కన్వెన్షన్ హాలులో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, మెప్మా శాఖల సంయుక్త అధ్వర్యంలో జిల్లా స్థాయి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నారాయణ, విశిష్ట, అతిథులుగా కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, శాసన మండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, నిమ్మకాయల చిన్నరాజప్ప, జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి, కాకినాడ నగర మాజీ మేయర్ సుంకర పావని, ఎస్పీ జి.బిందు మాధవ్, కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన పాల్గొని జ్యోతి ప్రజల్వనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా అవకాశాలు ఇచ్చి సాధికారిత కల్పిస్తోందని, మహిళా సంక్షేమం కోసం ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కటొక్కటిగా నెరవేరుస్తోందని తెలిపారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం, సాధికారత కోసం ఇటీవలి బడ్జెట్‌లో నాలుగున్నర లక్షల కోట్ల నిధులు కేటాయించిందన్నారు. బదిలీలు విషయంలో మహిళా ఉద్యోగుల విజ్ఞాపనలకు సానుకూలమైన ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి ప్రసంగించారు. వేడుకల్లో భాగంగా మంత్రి కేక్ కట్ చేసి, డీఆర్‌డీఏ, మెప్మా ద్వారా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజి రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఆటల పోటీలు, విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. జిల్లాలో స్ఫూర్తిదాయకంగా నిలిచిన మహిళా పారిశ్రామిక వేత్తలను సత్కరించారు. రాపిడో సంస్థ సమన్వయంతో బ్యాంకు రుణాలతో 25 మంది సుశిక్షిత యువతులకు ఎలక్ట్రికల్ వాహనాలు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ, మెప్మా, ఐసీడీఎస్ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజు, ట్రయినీ ఐపీఎస్ అధికారిణి సుస్మిత, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ

మహిళల రక్షణ, సంక్షేమం మా బాధ్యత: పవన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సమాజ నిర్మాణానికి నిజమైన వాస్తు శిల్పి... స్త్రీమూర్తి అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొనియాడారు. కుటుంబాన్ని చక్కదిద్దడం మొదలు పరిపాలన, కార్యనిర్వహణ, వాణిజ్య వ్యవహారాలు, పరిశ్రమల నిర్వహణ వరకూ మహిళలు రాణిస్తున్నారన్నారు. 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శక్తి స్వరూపిణి అయిన ప్రతి స్త్రీమూర్తికీ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియ చేస్తున్నా' అని పవన్ ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన సాధించేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. అతివలు ఆర్థికంగా బలోపేతమైతే ప్రతి కుటుంబం తద్వారా సమాజం బహుముఖంగా సంపన్నం కాగలవన్నారు. మహిళల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళల రక్షణ, సంక్షేమం తమ ప్రభుత్వ బాధ్యత అని పవన్ పేర్కొన్నారు. ఆరోగ్య సేవలలో మహిళల ముందంజ: సత్యకుమార్ లింగ వివక్షను అధిగమించి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి చోదక శక్తిగా ఎదుగుతున్న 'నారీశక్తి'కి మహిళా దితనోత్సవం సందర్భంగా మంత్రి సత్యకుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ-ప్రైవేట్ రంగాలలో ఆరోగ్య సేవల్ని అందించడంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ వైద్య రంగంలో 50,000 మంది మహిళా వైద్యులు, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది ఉన్నారన్నారు.

16, 17 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర వర్క్‌షాప్: జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాప్ ఈ నెల 16, 17 తేదీలలో గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లోని వీఎస్‌కే హాలులో జరుగుతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు కోరుతూ నిర్వహిస్తున్న ఈ వర్క్ షాప్ జయప్రదం కోరుతూ మల్లయ్యలింగం భవన్‌లో శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ కార్మిక కుటుంబాలు సంవత్సరం పొడవునా అరకొరగా పనులు చేస్తూ చాలీచాలని వేతనాలతో కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాలలో గ్రామాలకు గ్రామాలు ఖాళీ చేసి ఇతర జిల్లాలకు వలస పోతున్నారని చెప్పారు. బతుకుతెరువు కోసం ముక్కుపచ్చలారని పసిపిల్లలను ఎత్తుకొని వెళుతూ ప్రయాణాల్లో మార్గమధ్యంలో ప్రమాదాలకు గురైన ఘటనలు లేకపోలేదని అన్నారు. దీంతో వ్యవసాయ కార్మిక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలన్నిటికీ కారణం వ్యవసాయ కార్మికులకు వారి సొంత గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించకపోవడమేనని అన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వారి సొంత గ్రామాలలో ఉపాధి కల్పించి వలసలు నివారించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాటోతూ ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లో నివసించే వారికి రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాసు, నాయకులు గుర్రంకొండ సత్యానందం, కంభంపాటి దేవుని, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, అనురాధ, మల్లవరపు రమణ, యార్లగడ్డ శివయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ముందుండాలి

వీఐటీ మహిళా దినోత్సవంలో ఇషా సింగ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అర్జున అవార్డు గ్రహీత (షూటింగ్) ఇషా సింగ్ పిలుపునిచ్చారు. వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఇషా సింగ్ మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయాలని సూచించారు. విద్యార్థులు తక్కువ మార్కులు వచ్చాయని బాధపడకుండా, ఎప్పటికప్పుడు లక్ష్యాలు నిర్దేశించుకుని జీవితంలో ఉన్న శిఖరాలకు చేరాలని అన్నారు. విట్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ మహిళలకు వీఐటీ విశ్వవిద్యాలయ అడ్మిషన్లలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. 2017 సంవత్సరంలో తమ క్యాంపస్ కేవలం 8 శాతం మహిళా విద్యార్థులతో ప్రారంభం కాగా, ఇప్పుడు 33 శాతానికి పెరిగిందని, త్వరలోనే ఇది 50 శాతానికి చేరుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విటోపియా-2025 వార్షిక క్రీడా సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు డ్రగ్స్ రహిత భారత్ కోసం మారథాన్‌ను గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మత్తు పదార్థాలకు యువత బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఈ విషయాన్ని గ్రహించి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. రెండవ రోజు సాయంత్రం జరిగిన ప్రో-షో లో షల్మాలి ఖోల్గాడే (ప్రముఖ నేపథ్య గాయని), కార్తీక్ (ప్రముఖ నేపథ్య గాయకుడు), డీజేల సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీ సెల్వం, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి, డా.కృష్ణ సామి (విటోపియా కన్వీనర్), డాక్టర్ ఖదీర్ పాషా (స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్), ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా.ఎస్.రామచంద్రరావు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు నిలిపివేయాలి

- మైనారిటీల హక్కులు కాలరాయొద్దు
- కేంద్రం నియంతృత్వ పోకడలను నిరసించాలి
- మైనారిటీల హక్కుల పరిరక్షణకు చంద్రబాబు కృషి చేయాలి
- ముస్లిం పర్సనల్ లా బోర్డు సెక్రటరీ మౌలానా మొహమ్మద్ ఫజలూర్ రహిమాన్
- లోక్‌సభలో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన, వైసీపీ ఓటు వేయాలి: జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రజల అభిప్రాయాన్ని సేకరించి కూడా గౌరవించకుండా ఏకపక్షంగా వక్ఫ్ చట్ట సవరణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవడం బాధాకరమని ముస్లిం పర్సనల్ లా బోర్డు సెక్రటరీ మౌలానా మొహమ్మద్ ఫజలూర్ రహిమాన్ అన్నారు. వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్వర్యాన శనివారం విజయవాడ ధర్నా చౌక్‌లో మహా ధర్నా నిర్వహించారు. అన్ని ముస్లిం మైనారిటీ సంఘాల నాయకులు, జమాత్‌ల ప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఫజలూర్ రహిమాన్ మాట్లాడుతూ మైనారిటీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకు కుట్రపూరితంగా వక్ఫ్ చట్ట సవరణకు సిద్ధమైందని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు, మైనారిటీలతో జాయింట్ పార్లమెంటరీ కమిటీని నియమించిన కేంద్రం... ఆ కమిటీకి తాము చేసిన 44 సూచనల్లో ఒక్కటి కూడా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఏ వర్గం రక్షణ కోసమైతే వక్ఫ్ చట్టం చేశారో... ఆ వర్గం వారి అభిప్రాయాలను గౌరవించకుండా పార్లమెంటులో బలం ఉందని ఏకపక్షంగా వక్ఫ్ చట్ట సవరణ దిశగా ముందుకు వెళ్లడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ముఖ్యంగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని ముస్లిం మైనారిటీల హక్కులను కాపాడేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే చంద్రబాబును కలిసి తమ వక్ఫ్ చట్ట సవరణ వల్ల మైనారిటీలకు కలిగే నష్టాలను వివరించామని తెలిపారు. దేశంలోని ముస్లిం మైనార్టీలందరూ ఆంధ్ర ప్రదేశ్, బీహార్ ముఖ్యమంత్రుల వైపు చూస్తున్నారని, ఇద్దరూ చొరవ తీసుకుని పార్లమెంటులో వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోవాలని విన్నవించారు.

లౌకికవాదులు కదలి రావాలి: జల్లి విల్సన్

లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక చైర్మన్, సీపీఐ మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పాల్గొని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక తరపున మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. వక్ఫ్ చట్ట సవరణ వల్ల కేవలం ముస్లిం మైనారిటీలకే నష్టం కాదని, క్రిస్టియన్లు, ఇతర మైనారిటీలకు కూడా తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎందరో త్యాగధనుల పోరాటాలు, ఆత్మబలిదానాల ఫలితంగా స్వాతంత్ర్యం వచ్చిందని, అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో ఒక గొప్ప లౌకిక రాజ్యాంగాన్ని రచించుకుని అమలు చేసుకుంటున్నామని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం పాలకులు దేశంలోని ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించాలని, అందరికీ సంక్షేమం చూడాలని, అందరి అభివృద్ధి కాంక్షించాల్సి ఉందని చెప్పారు. కానీ ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ డైరెక్షన్‌లో నడుస్తున్న మోదీ ప్రభుత్వం పదేళ్లుగా దేశంలో హిందువులకు తామే ప్రతినిధులం అన్నట్లుగా వ్యవహరిస్తూ అనేక దుశ్చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370 రద్దు చేయడం, రామజన్మ భూమి విషయంలో కృత్రిమ తీర్పు పొంది బాబ్రీ మసీదును కైవసం చేసుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. బాబ్రీ మసీదు కేసులో తీర్పు ఇచ్చిన జడ్జికి రాజ్యసభ సభ్యత్వం ఇవ్వడం కేంద్ర ప్రభుత్వమే లంచాలు ఇచ్చిన పద్ధతిలో ఉందని విమర్శించారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే ముస్లింలు, ఇతర మైనారిటీల హక్కులను కాలరాస్తోందన్నారు. మణిపూర్‌లో క్రైస్తవులపై నిరంతరం దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అన్నదమ్ములు అయిన ముస్లింలు, క్రైస్తవుల మధ్య ఐక్యత లేకుండా చేసి ఇద్దరిపైనా తన దాడిని ఉధృతం చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే వక్ఫ్ చట్ట సవరణకు పూనుకుందని తెలిపారు. ఈ చట్ట సవరణ విషయంలో మైనారిటీలను దగా చేసేందుకు జేపీసీ ఏర్పాటు చేసి మైనారిటీల మనోభావాలను పట్టించుకోకుండా కాకమ్మ కథలు చెబుతూ తాము అనుకున్న విధంగానే బిల్లును రూపొందించి రాజ్యసభలో ఆమోదం పొందిందని చెప్పారు. ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందకుండా లౌకిక పార్టీలు అన్నీ కలిసి అడ్డుకోవాలని కోరారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న మన రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన, ప్రతిపక్ష వైసీపీ లోక్‌సభలో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసి, మైనారిటీల హక్కులను కాలరాసేలా ఉన్న బిల్లును అడ్డుకోవాలని అన్నారు. టీడీపీ లౌకిక పార్టీ అని, తమ పార్టీ చరిత్రను ఒకసారి గుర్తు చేసుకుని మతోన్మాద పార్టీతో జట్టు కట్టే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పునరాలోచన చేయాలని సూచించారు. అనేక రంగులు మార్చిన తర్వాత జనసేన పార్టీ కొత్తగా సనాతన పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. మోదీ నియంతృత్వ పోకడలకు అడ్డుకట్ట వేసేందుకు వక్ఫ్ చట్ట సవరణ బిల్లును లోక్‌సభలో ఓడించడమే ఏకైక మార్గమని జల్లి విల్సన్ చెప్పారు. లేకపోతే భవిష్యత్‌లో మోదీ మరింత నియంతగా మారి రాజ్యాంగాన్ని సైతం మార్చివేసే ప్రమాదం ఉందని తెలిపారు.

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ మోదీ సర్కారు నియంతృత్వ ధోరణితో మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిందని, రైతులందరూ ఏకమైన ఉద్యమించడంతో వెనక్కి తగ్గిందన్నారు. అదే తరహాలో లౌకిక వాదులు అందరూ కలిసి ఐక్యంగా ఉద్యమించి వక్ఫ్ సవరణను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కారదర్శి అఫ్సర్, సీపీఎం మాజీ ఎమ్మెల్యే గఫూర్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ సభ్యులు మౌలానా నసీర్ అహ్మద్ ఉమ్రి, ముఫ్తీ యూసుఫ్, హుస్సేన్ అహ్మద్, మక్బుల్ నద్వి, కరీముద్దీన్, అక్బర్ బాషా, సీపీఎం నాయకులు సీహెచ్.బాబూరావు, న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాసరావు, మతీన్, ఫాదర్ ప్రసాద్, ముస్లిం సోదరీమణులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆధునీకరణకు రూ.27.48 కోట్ల నిధులు

కేంద్ర క్రీడల మంత్రికి రాష్ట్ర మంత్రి మండిపల్లి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో క్రీడా అభివృద్ధికి సహకారం అందించాలని కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడ శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను ఏపీ యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో ఏర్పాటు చేసిన చింతన్ శిబిర్ సమావేశంలో మంత్రి మండిపల్లి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఆంధ్ర ప్రదేశ్‌లో ఇప్పటికే నూతన క్రీడా పాలసీ, క్రీడా యాప్ ఆవిష్కరించడం జరిగిందని, ఇటీవల విశాఖలో దివ్యాంగుల స్పోర్ట్స్ సెంటర్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించినందుకు కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్ర ప్రదేశ్‌లో క్రీడలలో సుపరిపాలన, అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, కార్పొరేట్‌లతో భాగస్వామ్యం వంటి అంశాలతో ముందుకు సాగుతుందన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆధునీకరణకు రూ.27.48 కోట్ల నిధులు కేటాయించాలని, రాయచోటిలో క్రీడా సముదాయ నిర్మాణం కోసం రూ.42.62 కోట్ల ప్రాజెక్టుకు సహకారం అందించాలని, ఖేలో ఇండియా పథకం ద్వారా వివిధ ప్రాజెక్టుల క్రీడా మౌలిక సదుపాయాలు కల్పనకోసం నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రికి రాంప్రసాద్ రెడ్డి వినతి పత్రం అందించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

ఇది ఎప్పటికీ గెలవని యుద్ధం

కేంద్రంపై స్టాలిన్ విమర్శలు

చెన్నై: జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు–కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ విధానంతో హిందీని తమపై రుద్దుతున్నారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం మరో పోస్టు పెట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై ఆయన విరుచుకుపడ్డారు. 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎప్పటికీ గెలవని యుద్ధం మొదలుపెట్టారు. 'చెట్టు ప్రశాంతంగా ఉండాలని అనుకున్నా... గాలి ఊరుకోదు. అలాగే... మమ్మల్ని రెచ్చగొట్టిన ఆయనకు వరుసగా లేఖాస్త్రాలు సంధిస్తున్నాం. ఎన్ఈపీని తిరస్కరిస్తున్న తమిళనాడు... విద్యావిధానంలో ఇప్పటికే అనేక లక్ష్యాలు సాధించింది. ఎల్‌కేజీ విద్యార్థి పీహెచ్‌డీ హోల్డర్‌కు ఉపన్యాసం ఇచ్చినట్లు ఉంది. మేం ఢిల్లీ ఆదేశాలు తీసుకోం.

త్రిభాషా విధానంపై బీజేపీ సర్కారు చేస్తున్న సంతకాల ప్రచారం హాస్యాస్పదంగా ఉంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ అంశాన్నే ప్రధాన అజెండాగా చేసుకొని బరిలో దిగాలని సవాల్ విసురుతున్నా. పథకాల దగ్గర నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ఇచ్చే అవార్డుల వరకు అన్నింటికీ హిందీ పేర్లు పెట్టారు. దేశంలో అధికంగా ఉన్న హిందీయేతర ప్రజలను ఇది ఉక్కిరిబిక్కిరి చేస్తుంది' అని స్టాలిన్ పేర్కొన్నారు.

వికటన్‌కు ఊరట

చెన్నై: వందేళ్ల చరిత్ర గల తమిళ మీడియా సంస్థ వికటన్‌కు మద్రాస్ హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఈ మ్యాగ్జైన్ వెబ్‌సైట్‌ను అన్‌బ్లాక్ చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. అయితే, ఏ కార్టూన్ కారణంగా కేంద్ర ప్రభుత్వం ఆగ్రహంతో ఆ సంస్థ వెబ్‌సైట్‌ను బ్లాక్‌చేసిందో... ఆ కార్టూన్ తీసివేయాలన్న ముందస్తు షరతు ఇందులో ఉంది. షరతుకు అంగీకరించిన పక్షంలోనే, ఆ వెబ్‌సైట్ మళ్లీ తెరమీద ప్రత్యక్షమవుతుందన్న ఆదేశాలు మధ్యంతరం కావచ్చు. అంతిమతీర్పు మిగిలే ఉండవచ్చు. కానీ, న్యాయస్థానం ఇలా అతిజాగ్రత్తగా వ్యవహరించడం మిగతా మీడియా సంస్థలకు ఉత్తేజాన్నిచ్చే అంశమైతే కాదు. అక్రమవలసదారులంటూ కాళ్లకూ చేతులకూ గొలుసులు కట్టి, ముఖానికి మాస్కులు పెట్టి అమెరికా తన విమానాల్లో మన పౌరులను పంజాబ్‌లో దించేసినందుకు దేశం యావత్తూ బాధపడింది, అవమానపడింది. ఇంత అమానుషంగా, అగౌరవంగా వ్యవహరించడాన్ని ప్రశ్నించకపోతే ఎలా అని విపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించాయి. ప్రభుత్వం మౌనంగా ఉండటం సరికాదని తప్పుబట్టాయి. ఓ కార్టూన్‌కు సంబంధించి తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఫిర్యాదుతో వికటన్ మ్యాగజైన్‌పై కేంద్రం చర్యలు తీసుకుంది. కార్టూన్ ఫిబ్రవరి 10న ప్రచురితమైతే, ఐదురోజుల అనంతరం కేంద్రప్రభుత్వం తన వెబ్‌సైట్ బ్లాక్ చేసిందనీ, ఫిబ్రవరి 25 వరకూ తనకు అధికారికంగా సమాచారమివ్వలేదని వికటన్ వాదించింది.

శీష్ మహల్‌లో కూర్చొని పనిచేయను: రేఖా గుప్తా

న్యూఢిల్లీ: ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నంత కాలం దేశరాజధాని అభివృద్ధికి నోచుకోలేదని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఆరోపించారు. ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజల గురించి ఆలోచించకుండా శీష్ మహల్ నిర్మించుకోవడంలో బిజీగా ఉన్నారని ఎదురుదాడి చేశారు. ఆయనలా తాను మహల్‌లో కూర్చొని పని చేసే సీఎంను కానన్నారు. 24 గంటలు ప్రజల మధ్యే ఉంటూ వారి కోసం పని చేసే ముఖ్యమంత్రినని చెప్పారు. దేశ రాజధానిలో ఓ మీడియా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేఖా గుప్తా పాల్గొన్నారు. ఢిల్లీలో మహిళను సీఎం చేయడంతో సులభంగా అధికారం తమ చేతిలో పెట్టుకోవచ్చని బీజేపీ నేతలు ఈ పదవి కట్టబెట్టినట్లు వస్తున్న వార్తలపై ఆమె స్పందిస్తూ మహిళలపై ఉన్న గౌరవంతోనే దేశరాజధానికి తనను సీఎంగా నియమించారని అన్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న తనను కేవలం ప్రజలు మాత్రమే నియంత్రించగలరని తెలిపారు. పార్టీ నేతలు కేవలం తనకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తారే తప్ప అధికారం తమ గుప్పిట్లో పెట్టుకోవాలనే ఆలోచన వారికి ఉండదని చెప్పారు. తామంతా ప్రధాని మోదీ అధ్వర్యంలో కలిసికట్టుగా దేశరాజధానిని అభివృద్ధి బాటలో నడుపుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. 'అధికారం చేపట్టిన మొదటి రోజే శీష్ మహల్‌లో ఉండబోనని చెప్పాను. ప్రజలు కష్టపడి సంపాదించుకున్న డబ్బును విశ్రాంతి, సౌకర్యం కోసం ఉపయోగించుకునే హక్కు నాకు లేదు. ఆ ఆస్తి ఢిల్లీ ప్రజలది' అని రేఖా గుప్తా అన్నారు.

బెంగళూరు యూనివర్సిటీకి మన్మోహన్ సింగ్ పేరు

బెంగళూరు: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గౌరవార్థం ఆయన పేరును కర్నాటక ప్రభుత్వం ఓ యూనివర్సిటీకి పెట్టింది. బెంగళూరు సెంట్రల్ యూనివర్సిటీకి మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని ఆ రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా అసెంబ్లీలో శుక్రవారం ప్రకటించారు. మన్మోహన్ సింగ్ 2024 డిసెంబర్ 26న తుది శ్వాస విడిచారు. ఆయన మరణం తర్వాత దేశంలో ఒక యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం ఇదే తొలిసారి. బెంగళూరు సెంట్రల్ యూనివర్సిటీని 2017లో స్థాపించారు. 2024లో తన 92వ ఏట కన్ను మూసిన మన్మోహన్ సింగ్ ఆధునిక ఆర్థిక సంస్కరణల రూపకర్తగా కీర్తిని సంపాదించారు. భారతదేశానికి ఆయన 13వ ప్రధానిగా పనిచేశారు. ఆయన 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా కొనసాగారు.

బిజూను అవమానిస్తారా?

- పంచాయతీ దివస్ తేదీ మార్పుపై బీజేడీ, కాంగ్రెస్ ఆందోళన
- ఒడిశా అసెంబ్లీలో గందరగోళం
- స్పీకర్ పోడియం వద్ద ప్రతిపక్ష సభ్యుల నిరసన

న్యూఢిల్లీ: ప్రతిపక్ష సభ్యుల నిరసనల నడుమ ఒడిశా అసెంబ్లీలో తీవ్ర గందరగోళం నెలకొంది. రెండో దశ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రతిపక్ష బీజేడీ, కాంగ్రెస్ సభ్యులు స్పీకర్ వెల్ వద్దకు దూసుకెళ్లి... బీజేపీ ప్రభుత్వం బిజూపట్నాయక్‌ను అగౌరవ పర్చడం సహా మహిళల భద్రత వంటి అంశాలపై నినదించారు. శాసనసభ సమావేశమైన వెంటనే ప్రశ్నోత్తరాలు చేపట్టగా... ప్రతిపక్ష సభ్యులు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మార్చి 5న మాజీ ముఖ్యమంత్రి బిజు పట్నాయక్ జయంతి రోజున కాకుండా పంచాయతీ రాజ్ దివస్‌ను ఏప్రిల్ 24న నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు. దివంగత బిజు పట్నాయక్ వారసత్వాన్ని తుడిచిపెట్టే ప్రయత్నంలో భాగంగానే ప్రభుత్వం బిజూ జయంతి నుండి పంచాయతీ రాజ్ దివస్ వేడుకలను వేరు చేసిందని మండిపడ్డారు. 1993 నుండి బిజూపట్నాయక్ జయంతి రోజున పంచాయతీ రాజ్ దివస్‌ను జరుపుకుంటున్నామని బిజూ జనతాదళ్ (బీజేడీ) ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఒడిశా వెలుపల చేసినట్లుగా ఏప్రిల్ 24నే పంచాయతీ రాజ్ దివస్‌ను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసి... మార్చి 5న సెలవు కూడా రద్దు చేసింది. బీజేడీ, కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ... ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీజేడీ సభ్యుడు అధిరాజ్ పాణిగ్రాహి, కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బహినిపతి స్పీకర్ సురామ పాఢి పోడియంపైకి ఎక్కి మైక్రోఫోన్‌ను పగలగొట్టడానికి ప్రయత్నించారు. ఆ తర్వాత సభ మధ్యాహ్నం వరకు వాయిదా పడింది. అయితే సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా గందరగోళం కొనసాగడంతో సభను సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు. కాగా 2024 జూన్‌లో ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై అకృత్యాలు పెరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. కాగా సభ వెలుపల, బిజూ పట్నాయక్ విగ్రహం దగ్గర బీజేడీ సభ్యులు ధర్నా చేయగా, మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర కాంగ్రెస్ సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు బీజేపీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని సమర్థిస్తూ... ప్రతిపక్ష సభ్యులు సభలో కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. "బిజూ పట్నాయక్ పట్ల బీజేపీ ప్రభుత్వానికి అత్యున్నత గౌరవం ఉంది. ఈ విషయాన్ని సభలో చర్చించడానికి వారు సిద్ధంగా లేరు" అని పంచాయతీ రాజ్ మంత్రి రబీ నారాయణ్ నాయక్ అన్నారు. బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 5 వరకు కొనసాగనున్నాయి.

మోదీకి 'తారీఫ్' తప్ప 'టారిఫ్' పట్టదు

ట్రంప్ బెదిరింపులపై ప్రధాని మౌనం ఆక్షేపణీయం: జైరాం రమేశ్



న్యూఢిల్లీ: ప్రధాని మోదీకి తారీఫ్ (ప్రశంసలు) తప్ప టారిఫ్ (సుంకాలు) గురించి పట్టదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. అమెరికా ప్రతీకార సుంకాలు బెదిరింపులకు దీటైన బదులు ఇచ్చేందుకు 56 అంగుళాల ఛాతిగల ప్రధాని ఎందుకు జంకుతున్నారని ఎద్దేవా చేశారు. జైరాం రమేశ్ శుక్రవారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా బెదిరింపులపై మోదీ మౌనాన్ని ఆక్షేపించారు. కేంద్ర బడ్జెట్ రెండవ దశ సమావేశాల్లో భాగంగా పార్లమెంటులో అమెరికా తీరును ఉమ్మడిగా ఎండగట్టాలన్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అమెరికా రాయబారిగా... ఆ దేశానికి అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని జైరాం రమేశ్ దుయ్యబట్టారు. 'మన ప్రధానికి ప్రశంసలు మాత్రమే వినిపిస్తాయని, ఆయనకు సుంకాల గురించి పట్టదు. ప్రశంసలు తగ్గించి సుంకాలపై మాట్లాడండి'అని సూచించారు. అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించిన అన్ని నిబంధనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరగరాస్తున్నారని, ప్రతీకార సుంకాలంటూ విచిత్ర నిర్ణయం తీసుకున్నారన్నారు. '1995లో డబ్ల్యూటీఓలో చేరిన 170 దేశాలు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందుకోసం రాజీ కుదరడానికి 10ఏళ్లు పట్టింది. ఇప్పుడు వచ్చిన ట్రంప్ తన విచిత్ర ఆలోచనలతో అంతర్జాతీయ వాణిజ్యానికి దశ–దిశ నిర్దేశించాలని చూస్తున్నారు. డబ్ల్యూటీఓ అంటే వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్... వరల్డ్ ట్రంప్ ఆర్గనైజేషన్ కాదు' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. అక్రమ వలసదారుల నెపంతో భారతీయులను అమానీయ విధానంతో అమెరికా నుంచి స్వదేశానికి తరలించడాన్ని ఆక్షేపించారు. చిన్న దేశాలు కూడా అమెరికాను ఎండగడుతుంటే 56 అడుగుల ఛాతీగల ప్రధాని నోరు మెదపడం లేదన్నారు. 'భారత్ లాంటి దేశాన్ని ట్రంప్ బెదిరిస్తున్నారు. ఇది తేలికగా తీసుకునే అంశం కాదు. అమెరికాను ఎండగట్టేందుకు ప్రధాని 56 అంగుళాల ఛాతి ఏమైంది? 1971 నవంబరులో అమెరికాకు అప్పటి అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌తో ఇందిరా గాంధీ ఏం చెప్పారో గుర్తుందా? భారత్ ప్రతిష్ఠను దిగజార్చేందుకు నిక్సన్, హెన్రీ కిస్సింగర్ ప్రయత్నించారు కానీ ఇందిరా గాంధీ దీటుగా బదులిచ్చారు. 'భారత్ ప్రయోజనాల కోసం ఏం చేయాలో అదే చేస్తా' అని వారితో అన్నారు' అని జైరాం రమేశ్ తెలిపారు. ఇప్పుడున్న ప్రధానికి 'నమస్తే ట్రంప్'... 'ట్రంప్ మంచి మిత్రుడు' అంటూ ఆయనను హత్తుకోవడమే సరిపోతోందని విమర్శించారు. భారత్‌ను ట్రంప్ లక్ష్యంగా చేసుకోవడాన్ని తేలికగా తీసుకోలేమని, ఇది దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన అంశమని జైరాం రమేశ్ అన్నారు.

'పార్లమెంటులో ప్రధాని మౌనం వీడకుండా విదేశీ వ్యవహారాల మంత్రిని పంపారు... ఆయన అమెరికాకు ప్రతినిధిగా మాట్లాడారు. ప్రతీకార సుంకాలంటూ అమెరికా బెదిరింపులను సమష్ఠిగా తిప్పికొట్టాలి' అని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం ఎప్పుడు అఖిలపక్షాన్ని పిలవదని దుయ్యబట్టారు. విదేశాంగ మంత్రి, హోంమంత్రి ఉపన్యాసాలు మాత్రమే ఇస్తారని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

మౌలికవసతులు, సంక్షేమానికి పెద్దపీట

- కర్నాటక బడ్జెట్ రూ.4.8 లక్షల కోట్లు
- అన్ని థియేటర్లలో సినిమా టికెట్ గరిష్ట ధర రూ.200

బెంగళూరు: ఆర్థిక సంవత్సరం 2025–26 కు సంబంధించి కర్నాటక బడ్జెట్‌ను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.4,08,647 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలను సభ ముందుకు తీసుకువచ్చారు. మౌలికవసతుల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు, మైనారిటీల అభివృద్ధి, మహిళా సాధికారత, ఇతర రంగాలకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. 'ముఖ్యమంత్రి మైనారిటీ కాలనీ అభివృద్ధి కార్యక్రమం' కింద రూ.1000 కోట్లతో ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఇది 2025–26లో అమలు చేయబడుతుంది. వక్ఫ్ ఆస్తుల మరమ్మతులు, ముస్లిం శ్మశాన వాటికల రక్షణ కోసం రూ. 150 కోట్లు కేటాయించారు. ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీ వర్గాలలో సాధారణ వివాహాలను ప్రోత్సహించడానికి ప్రతి జంటకు రూ.50,000 సహాయం అందిస్తారు. బడ్జెట్ లో జైన పూజారులు, సిక్కుల ప్రధాన గ్రంథీలు, మసీదుల పేష్–ఇమామ్ ల గౌరవ వేతనాన్ని నెలకు రూ.6000కి పెంచారు. అసిస్టెంట్ గ్లాండ్స్, ముజ్జిన్ల గౌరవ వేతనం నెలకు రూ.5000గా నిర్ణయించబడింది. కేటగిరీ 2బీకి చెందిన మైనారిటీ కాంట్రాక్టర్లు ఇతర వర్గాల మాదిరిగానే రూ.2 కోట్ల వరకు ప్రభుత్వ కాంట్రాక్టులను పొందుతారు. సినీ రంగానికి సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలను సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు వెలువరించింది. కన్నడ సినిమాలను ప్రోత్సహించడానికి ఓటీటీ ప్లాట్‌ఫామ్ రూపకల్పన, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సినిమా థియేటర్లలో గరిష్టంగా టికెట్ ధరను రూ.200గా నిర్ణయించారు.మల్టీప్లెక్స్ లతో సహా రాష్ట్రంలోని అన్ని థియేటర్లలో అన్ని షోలకు ఇదే రేటు ఉంటుందని సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. సామాన్యులకు సినిమాను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ ప్రమాణాలతో మైసూర్ లో ఒక ఫిల్మ్ సిటీ నిర్మించేందుకు 150 ఎకరాల భూమిని ఇస్తున్నట్లు అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. దీని నిర్మాణానికి రూ. 500 కోట్ల బడ్జెట్ ను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. బెంగళూరులో మౌలిక సదుపాయాల కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. సొరంగ రహదారుల నిర్మాణానికి రూ.19,000 కోట్లు, 40.5 కి.మీ. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.8,916 కోట్లు, బ్రాండ్ బెంగళూరు ప్రాజెక్టుకు రూ. 1,800 కోట్లు కేటాయించారు. ఇక మహిళా సాధికారత కోసం సిద్ధరామయ్య సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 10 పట్టణ ప్రాంతాల్లోని ఇందిరా క్యాంటీన్లను జాతీయ జీవనోపాధి మిషన్ మహిళా స్వయం సహాయక బృందాలు నిర్వహిస్తాయి.

ఆర్థిక సమతుల్యత, పన్ను సంస్కరణలు

కర్నాటక ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరంలో హామీ ఇచ్చిన పథకాల అ కోసం రూ. 51,034 కోట్లు కేటాయించింది. ఇది జీఎస్‌డీపీలో 3 శాతం. జీతాలు, వేతన జీవులపై పన్నును రూ.200 నుంచి రూ.300కి పెంచడానికి ప్రొఫెషనల్ ట్యాక్స్ చట్టాన్ని సవరించనున్నారు. వార్షిక గరిష్ట పరిమితిని రూ.2,500గా నిర్ణయించనున్నారు.

నక్సలిజంపై కీలక ప్రకటన

కర్నాటక నక్సల్ రహితంగా మారినందున నక్సల్స్ వ్యతిరేక దళాన్ని రద్దు చేస్తారు. లొంగిపోయిన నక్సలైట్ల పునరావాసం కోసం ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.10 కోట్లతో ప్రణాళికను రూపొందించనున్నారు. బడ్జెట్ లో ప్రకటించిన ఈ పథకాలు రాష్ట్రంలోని వివిధ వర్గాల సంక్షేమానికి, బెంగళూరు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ముఖ్యమైనవిగా పరిగణించబడుతున్నాయి.

విదేశాంగ శాఖ అధికారి ఆత్మహత్య

న్యూఢిల్లీ: విదేశాంగశాఖకు చెందిన అధికారి జితేంద్ర రావత్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. భవనంపై నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నారు. శుక్రవారం ఢిల్లీలోని చాణక్యపురి ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై ఆ శాఖ స్పందించింది. విదేశాంగశాఖకు చెందిన రెసిడెన్షియల్ సొసైటీలో అధికారులు నివాసం ఉంటున్న భవనం టెర్రస్ పైనుంచి దూకి రావత్ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన తన తల్లితో పాటు ఆ ఇంట్లో ఉంటున్నారు. రావత్ భార్య, ఇద్దరు పిల్లలు ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో నివసిస్తున్నారు. కొంతకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతూ ఆయన చికిత్స తీసుకుంటున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు. విదేశాంగ శాఖ ఆయన మృతిని ధ్రువీకరిస్తూ ప్రకటన విడుదల చేసింది. 'ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి అన్ని రకాలుగా సాయం అందిస్తున్నాం. కేసు విచారణలో ఎప్పటికప్పుడు ఢిల్లీ పోలీసులతో సంప్రదింపులు చేస్తున్నాం' అని పేర్కొంది. బాధిత కుటుంబం గోప్యత దృష్ట్యా ఇతర వివరాలేవీ వెల్లడించడం లేదని తెలిపింది.

ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లు

చెన్నై: ఎండ వేడిని తట్టుకునేలా ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లు ఆ శాఖ అధికారులు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఎండల నుంచి వాహనచోదకులకు ఉపశమనం కలిగించేలా ప్రధాన నగరాల్లోని సిగ్నల్స్ వద్ద పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చెన్నైను విభజించి కొత్తగా రూపొందిన ఆవడి పోలీసు కమిషనర్ కార్యాలయ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులకు కమిషనర్ శంకర్ ... ఏసీ హెల్మెట్లు అందజేశారు. ఫైబర్‌తో రూపొందించిన హెల్మెట్‌లో బ్యాటరీ ద్వారా ఏసీ యంత్రం పనిచేసి ట్రాఫిక్ పోలీసులకు ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తుందని అధికారులు తెలిపారు.

మహిళలకు సాధికారత అవసరం: సుప్రీం

న్యూఢిల్లీ: మహిళలకు సానుభూతి కాదని, సమాజంలో సాధికారత అవసరమని సుప్రీంకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టులో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళా జడ్జీలలో ఒకరైన జస్టిస్ ఎం.త్రివేది మౌఖికంగా ఈ వ్యాఖ్యలు చేశారు. బాధితురాలి పట్ల అందరి సానుభూతి ఉందని లైంగిక వేధింపుల కేసు విచారణ సందర్భంగా నిందితుడి తరపున వాదిస్తున్న న్యాయవాది సమర్థిస్తుండగా... న్యాయమూర్తి దీనికి ఖండించారు. 'మహిళలకు సానుభూతి అవసరం లేదు. చట్టాలను సమర్థవంతంగా, కఠినంగా అమలు చేయడం ద్వారా వారికి సాధికారత కల్పించాలి' అని జస్టిస్ త్రివేది పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై సీనియర్ న్యాయవాది స్పందిస్తూ ఇళ్లలో మహిళలకు అధికారం ఇవ్వాలని, అది జరుగుతోందని అన్నారు. ఈ వ్యాఖ్యలను జడ్జి మరోసారి ఖండించారు. కేవలం ఇళ్లలో ఉన్న మహిళల గురించి మాత్రమే కాదని అన్నారు. సమాజంలో ప్రతి చోటా ఉన్న మహిళలందరికీ సాధికారత అవసరమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. నిందితుడు ఏడు నెలలుగా జైలులో ఉన్నాడని న్యాయవాది వాదించారు. తమిళనాడుకి చెందిన ఈ కేసు అత్యాచారానికి సంబంధించినది. బాధితురాలి మెడపై చిన్న గాయం మాత్రమే ఉందని, హత్యాయత్నం కేసు కాదు. దీంతో శిక్షను పునఃపరిశీలించాల్సి ఉందని న్యాయవాది వాదించారు. బాధితురాలి మెడపై ఉన్న గుర్తు సాధారణ గాయం కాదని, నైలాన్ తాడుతో గొంతు కోసి హత్య చేసేందుకు యత్నించారని జడ్జి పేర్కొన్నారు. రెండు కోర్టులు ఈ తీర్పును ధృవీకరించాయి. శిక్ష పరిమితిపై సుప్రీంకోర్టు రాష్ట్రానికి నోటీసులు జారీ చేసింది.

తమిళంలో ఇంజినీరింగ్, వైద్య విద్య

సీఎం స్టాలిన్‌కు అమిత్ షా విజ్ఞప్తి

రాణిపేట: ఇంజినీరింగ్, వైద్య విద్యను తమిళ భాషలో బోధించాలని తమిళనాడు సీఎం స్టాలిన్‌ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కోరారు. హిందీ భాషను వ్యతిరేకిస్తూ స్టాలిన్ చేస్తున్న వ్యాఖ్యలకు కౌంటర్‌గా అమిత్ షా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్థానిక భాషల్లో పరీక్షలు రాసే వీలు కల్పించిందని, ఇప్పుడు సీఐఎస్ఎఫ్ పరీక్షను తమిళంలోను రాయవచ్చని మంత్రి పేర్కొన్నారు. తమిళనాడులోని రాణిపేటలో జరిగిన 56వ సీఐఎస్ఎఫ్ రైజింగ్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమిళ విద్యార్థుల లబ్ధి కోసం ఇంజినీరింగ్, మెడికల్ విద్యను తమిళంలో బోధించాలని సీఎం స్టాలిన్‌ను కోరుతున్నట్లు అమిత్ షా తెలిపారు. భారతీయ సంస్కృతిని బలోపేతం చేయడంలో తమిళనాడు కీలక పాత్ర పోషించిందన్నారు. పరిపాలనా సంస్కరణలైనా, ఆధ్యాత్మిక చింతనైనా, విద్య అయినా... దేశ సమగ్రత, ఐక్యత అయినా తమిళనాడు పాత్రను విస్మరించలేమన్నారు.

మహిళా ఎమ్మెల్సీలపై నితీశ్ ఎదురుదాడి

పాట్నా: బాలికా విద్యపై చర్చ సందర్భంగా బీహార్ సీఎం నితీశ్ కుమార్ సహనం కోల్పోయారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఆర్జేడీపై విరుచుకుపడ్డారు. లాలూ ప్రసాద్ యాదవ్ తన భార్య రాబ్రీదేవిని సీఎం చేయడాన్ని ఎద్దేవా చేశారు. బీహార్ శాసనమండలిలో బాలికా విద్యపై శుక్రవారం చర్చ జరిగింది. తన ప్రాంతంలో బాలికల కోసం తగినన్ని పాఠశాలలు లేవని ఆర్జేడీ ఎమ్మెల్సీ ఊర్మిళా ఠాకూర్ తెలిపారు. విద్య కోసం కిలోమీటర్ల దూరంలోని స్కూళ్లకు వెళ్లేందుకు బాలికలు ఇబ్బందిపడుతున్నట్లు ఆమె చెప్పారు. దీనికి విద్యా శాఖమంత్రి సునీల్ కుమార్ ఇచ్చిన సమాధానంపై ఊర్మిళా ఠాకూర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బెగుసరాయ్ జిల్లాలో పరిస్థితిని ఆమె వివరించారు. దీంతో సీఎం నితీశ్ కుమార్ అసహనం వ్యక్తం చేశారు. 'బాలికల విద్య కోసం మేం ఏం చేశామో మీకు తెలుసా? మేం అధికారంలోకి వచ్చే వరకు బీహార్‌లో గ్రామీణ బాలికలు చాలా అరుదుగా స్కూళ్లకు వెళ్లేవారు' అని అన్నారు. నితీశ్ కుమార్ వ్యాఖ్యలను ఊర్మిళా ఠాకూర్ ఖండించారు. 'సార్ దయచేసి అలా అనకండి. నేను కూడా ఒక గ్రామం నుంచి వచ్చా. నేను పాత తరానికి చెందినదానిని. అయినప్పటికీ నా పాఠశాల విద్యను పూర్తి చేశా' అని అన్నారు. ఇంతలో మరో ఆర్జేడీ ఎమ్మెల్సీ మున్నీదేవి రాజక్ తన సీటు నుంచి పైకి లేచారు. 'ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు మాకు ఉంది. దానికి సమాధానం చెప్పడం మీ పని' అని అన్నారు. దీంతో మున్నీదేవిని సముదాయించేందుకు ఊర్మిళా ఠాకూర్ ప్రయత్నించారు. సహనం కోల్పోయిన నితీశ్ కుమార్ తన సీటు నుంచి లేచిన ఆయన ప్రతిపక్షంపై విరుచుకుపడ్డారు. 'మహిళల కోసం మేం ఏమి చేశామో మీకు తెలియదు. మీరు మహిళలు కావచ్చు. కానీ మీ సహకారం ఏమిటి' అని ప్రశ్నించారు. మండలిలో ప్రతిపక్ష నాయకురాలైన రాబ్రీదేవిపై మాటల దాడి చేశారు. ఆమె భర్త (లాలూ ప్రసాద్ యాదవ్) మునిగిపోతున్నప్పుడు తన భార్యను సీఎం చేశారు. మీ పార్టీ (ఆర్జేడీ) ఏమీ చేయలేదు. మీకు ఏమీ తెలియదు. మహిళల కోసం ఏమి చేసినా, అది నేనే చేశా. ఇప్పుడు మహిళలకు ఎలాంటి సమస్యలు లేవు' అని అన్నారు. దీంతో మండలిలో గందరగోళం చెలరేగడంతో నితీశ్ కుమార్ బయటకు వెళ్లిపోయారు.

నా చావుకు భార్యే కారణం

కంపెనీ వెబ్‌సైట్‌లో ఉద్యోగి ఆత్మహత్య లేఖ

ముంబై: మహారాష్ట్రలోని ముంబైలో ఓ కంపెనీలో పనిచేసే ఉద్యోగి తన చావుకు భార్యే కారణమని లేఖ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి ముందు తన సూసైడ్ నోట్‌ను కంపెనీ వెబ్‌సైట్‌లో పెట్టాడు. వివరాల్లోకి వెళ్తే.. ముంబైకి చెందిన నిశాంత్ త్రిపాఠి స్థానికంగా ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఆయన సహారా హోటల్లో రూమ్ బుక్ చేసుకుని దిగాడు. ఆత్మహత్యకు ముందు తన గది బయట 'నన్ను ఆటంక పరచొద్దు' (డు నాట్ డిస్టర్బ్) అనే బోర్డు తగిలించాడు. దాంతో సిబ్బంది ఆయన గది తలుపు తట్టలేదు. మూడు రోజులైనా త్రిపాఠి గది నుంచి బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చి మారు తాళంతో గది తెరిచి చూశారు. అప్పటికే అతడు ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తన భార్య అపూర్వ పారిఖ్, అత్త ప్రార్థన మిశ్రా వేధింపులే తన ఆత్మహత్యకు కారణమని నిశాంత్ తన ఆత్మహత్య లేఖలో రాశాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి నీలం చతుర్వేది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సూసైడ్ నోట్‌లో నిశాంత్ తన భార్యపై తనకున్న ప్రేమను... భార్య, అత్త కలిసి తనను ఏవిధంగా వేధించారో వివరించాడు. భార్య కారణంగా చనిపోతున్నా ఆమెపై ప్రేమే ఉందని పేర్కొన్నాడు. 'నువ్వు ఈ లేఖ చదివేటప్పటికీ నేను ఈ లోకంలో ఉండను. నా ఆఖరి రోజుల్లో జరిగిన ప్రతి ఘటన నిన్ను ద్వేషించాల్సినదే. కానీ నేను అలా చేయలేదు. అయినా నేను నిన్ను ప్రేమించాను. ఇప్పుడు ప్రేమిస్తున్నాను. నాలో నీపై ఉన్న ప్రేమ ఇకపై కూడా చెరిగిపోదని నీకు ప్రమాణం చేస్తున్నా' అని నిశాంత్ తన ఆత్మహత్య లేఖలో పేర్కొన్నాడు. మీతో నేను పడిన యాతన అంతా మా అమ్మకు తెలుసు. నా చావుకు మీరు ఇద్దరే కారణం. చనిపోతే దయచేసి మా అమ్మ దగ్గరికి వెళ్లకండి. ఆమెను ప్రశాంతంగా బాధపడనివ్వండి' అని భార్య, అత్తను అభ్యర్థించాడు. నిశాంత్ తల్లి కూడా కొడుకు మరణం గురించి తన ఎక్స్ ఖాతాలో హృద్యమైన పోస్టు పెట్టారు. 'నా జీవితం ఓడింది. నా కొడుకు నన్ను వదిలి వెళ్లిపోయాడు. నేను ఇప్పుడు ఒక జీవచ్ఛవాన్ని అయ్యాను. తను నా అంతిమ సంస్కారాలు చేయాల్సి ఉంది... కానీ నేను నా కొడుకు అంత్యక్రియలు చేశాను. నా కుమార్తె తన అన్నకు తల కొరివి పెట్టింది. నాకు, నా బిడ్డకు ఈ కఠోర పరిస్థితి నుంచి బయటపడే ధైర్యం కావాలి' అని తన పోస్టులో పేర్కొన్నారు.